ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
ANDHRA PRADESH
LEGISLATIVE COUNCIL DEBATES

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధ వారం, ఫిబ్రవరి 04, 2009
ఏడవ సమావేశము, సంపుటము I నంబరు 2
సర్వధారినామ సంవత్సర మాఘ శు. 9.

**WEDNESDAY, THE 4th FEBRUARY, 2009**

**SEVENTH SESSION, VOLUME I, NO.2**

**15 MAGH, 1930 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ మహ్మద్ జానీ |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీ వాసిరెడ్డి. వరద రామారావు |
| | | శ్రీ బి. కమలాకర రావు |
| | | డా. రాయపాటి శ్రీనివాస్ |
| | | డా. మసాల పద్మజ |
| **కార్యదర్శి** | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| **ప్రత్యేక కార్యదర్శి** | : | శ్రీ కె. గోపాల కృష్ణయ్య |
| **సంయుక్త కార్యదర్శి** | : | శ్రీ డి. శివరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ ఎం. పాండురంగాచార్య |
| | | శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| | | శ్రీ పి. సీతారాములు |
| | | శ్రీ డి. నర్సింహులు |
| | | శ్రీ పి. సత్యనారాయణ |
| | | శ్రీ కె. సుభాష్ చంద్రబోస్ |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ డి. సత్యనారాయణ |
| | | శ్రీ ఎ. రాంరెడ్డి |
| | | శ్రీ టి. రాంచందర్ |
| | | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ ఎస్. జయరాం |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీమతి ఎ. సాయి లక్ష్మి |
| | | శ్రీమతి ఎస్.ఎ. జ్యోతి |
| | | శ్రీ జి. వెంకట కృష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| | | శ్రీ జి.ఎల్. నరసింహారావు |
| | | శ్రీమతి వి. ప్రభ |
| | | శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| **మార్షల్** | : | శ్రీ ఆర్. సీతారామారావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | ఎల్. తిరుమలరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## అధికార నివేదిక

## బుధ వారం, ఫిబ్రవరి 04, 2009

### విషయ సూచిక

1. సభా కార్యక్రమము :

విషయము: వాయిదా తీర్మానము గురించి

2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానాలు :

3. ప్రకటనలు :

విషయము: i) ప్యానల్ వైస్ చైర్మెన్ నియామకం గురించి.

ii) 2.2.2009 న జరిగిన శ్రీ జల్లి విల్సన్ అరెస్టు మరియు విడుదల గురించి.

iii) గవర్నరు గారి ప్రసంగపు నిజ ప్రతిని సభాసమక్షంలో ఉంచడం గురించి.

iv) గవర్నరు గారి ప్రసంగముపట్ల ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనకు సవరణలగురించి.

v) గౌరవ ముఖ్యమంత్రికి మరియు గౌరవ ఆబ్కారి శాఖామంత్రికి చెందిన కార్యక్రమ ప్రదానము గురించి.

4. సభా సమక్షంలో ఉంచిన పత్రములు :

5. సభా సమక్షంలో పెట్టిన పత్రము :

6. అర్జీల సమర్పణ :

7. గవర్నరు గారి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం మరియు చర్చ :

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

**2009, ఫిబ్రవరి 4 వ తేది, బుధ వారము**

**ఏడవ సమావేశపు రెండవ రోజు**

**(సభ ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. గౌ. ఛైర్మన్ అధ్యక్ష స్థానం వహించారు.)**

**సభా కార్యక్రమము**

**విషయము: వాయిదా తీర్మానము గురించి**

SRI PUVVADA NAGESWARA RAO (Assembly): Sir,. we have given Adjournment Motion on Satyam Computers and Maytas.

MR.CHAIRMAN : It is already listed under 'Short Discussion'.

**నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు - వాగ్రూప సమాధానాలు**

**విషయము: వివిధ కార్యక్రమాలకు టి.టి.డి.చే నిధుల కేటాయింపు**

ప్రశ్న నెం.11 (2273)
సర్వశ్రీ దాడి వీరభద్రరావు, సిద్ద రాఘవరావు, ఎం.వి.ఎస్. శర్మ:

అ. గత 4 సంవత్సరాలలో తిరుమల తిరుపతి దేవస్థానం, దేవాలయాల నిర్వహణ, మతపరమైన కార్య కలాపాలు కాకుండా, ఇతర కార్యకలాపాల కోసం మంజూరు చేసిన నిధులు ఎన్ని;

ఆ. పర్వదినాలలో సేవలను రద్దు చేస్తున్న విషయం వాస్తవమేనా;

ఇ. ఇటీవలే వైకుంఠ ఏకాదశి రోజున భక్తులు ఎదుర్కొన్న ఇబ్బందులపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన విషయం వాస్తవమేనా;

ఈ. సాధారణ భక్తులకు అందుబాటులో సేవలు, దర్శనం చేసుకోడానికి, ప్రాచీన ఆచారాలను పాటించడానికి తీసుకుంటున్న చర్యల స్వభావం ఏమిటి;

ఉ. ప్రతి సంవత్సరం పరిపాలన నివేదికలు, ఆడిట్ నివేదికలను శాసనాధికార సంస్థల సమక్షంలో వుంచ డానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

దేవాదాయ శాఖా మంత్రి (శ్రీ జె. రత్నాకర రావు) :

అ. గత 4 సంవత్సరాలలో తిరుమల తిరుపతి దేవస్థానం దేవాలయాల నిర్వహణ, మతపరమైన కార్యక లాపాలు కాకుండా ఇతర కార్యకలాపాల కోసం మంజూరు చేసిన నిధులు రూ.41,837.38 లక్షలు.

ఆ. అవునండీ.

ఇ. అవునండీ.

~~ఈ~~.

i. బాగా రద్దీగా వున్న రోజులలో కొన్ని ఆర్జిత సేవలను రద్దు చేయడం.

ii. ఇ–సేవా సౌకర్యాలను, టిక్కెట్ల అడ్వాన్సు బుకింగ్‌ను ప్రవేశపెట్టడం.

iii. సుదర్శన్ టోకెన్ సిస్టం.

iv. ప్రస్తుత బుకింగ్ విధానం క్రింద బ్యాంకులో ఆర్జిత సేవల బుకింగ్.

v. తిరుమల తిరుపతి దేవస్థానం సాధారణ భక్తులకు అందుబాటులో సేవలు, దర్శనం చేసుకోడానికి విపరీతంగా రద్దీ వున్న సమయంలో విఐపి/బ్రేక్/సెల్లార్ టికెట్లను రద్దు చేయడం వంటి కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకుంది.

ఉ. 1987, ఆంధ్రప్రదేశ్ ధర్మాదాయ, హిందూ మతపరమైన సంస్థలు, దేవాదాయాల చట్టం (1987 లో నెం.30వ చట్టం), దానిలోని నియమావళి ప్రకారం, ప్రతి సంవత్సరం పరిపాలన నివేదికలు, ఆడిట్ నివేదికలను శాసనాధికార సంస్థల సమక్షంలో వుంచాలనే నిబంధన ఏదీ లేదు.

శ్రీ దాడి వీరభద్రరావు (విశాఖ పట్నం): సార్. వార్తాపత్రికలలో అప్పుడపుడు చూస్తున్నాం. తిరుమల తిరుపతి దేవస్థానం తాలూకు నిధులు ధర్మకార్యాలకు కాకుండా ఇతర కార్యాలకు మంజూరు చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవలే రూ.5 కోట్లు బ్లడ్‌బ్యాంక్ నిర్మాణం నిమిత్తం ఇస్తామన్నారు. అది వాస్తవమా కాదా? అదే విధంగా తిరుమలకి కాకుండా వేరే రోడ్లకి, మిగిలిన కార్యక్రమాలకి, ఇతర ప్రాంతాలకి ప్రజా ప్రయోజనాల నిమిత్తం నిధులని డైవర్టు చేస్తున్నది వాస్తవమేనా?

రెండవది, వైకుంఠ ఏకాదశి నాడు రద్దీ చాలా విపరీతంగా వుండడం వలన క్యూలో వున్న వారి పిల్లలకు పాలు కూడా అందించలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో వారికి పాలిచ్చేవారు. సుమారు 18 గంటల పాటు పిల్లలకు పాలు లేని పరిస్థితులలో దేవస్థానం యాజమాన్యం ఏం చేస్తోంది? దీని మీద ఏం చర్యలు తీసుకున్నారు? పది గంటల తర్వాత ఒక్కసారిగా వారిని వదిలివేయడం, ఒకరిమీద ఒకరు పడిపోవడం, మళ్లీ ఆపివేయడం జరిగింది. అలాగే లోపలికి వెళ్లే టప్పుడు విఐపి దర్శనాలు ఉండవంటున్నారు. కాని అక్కడ ప్రజలను ఆపేసి, పది గంటలపాటు రాత్రంతా వైకుంఠ ఏకాదశి పర్వదినం అయిపోయే వరకూ సినిమా యాక్టర్లని, బ్రాందీలు తయారు చేసే కాపిటలిస్టుల్ని, ఇటువంటి డబ్బున్న వాళ్లని అందరినీ లోపలికి తీసుకుపోతే, ఇక్కడ పలకరించడానికి కూడా వీలు లేని వాళ్లున్నారు, అటువంటి వారిని కూడా లోపలికి తీసుకుపోయి, వాళ్లు గంటల తరబడి పూజలు చేసే పరిస్థితి ఎంతవరకూ న్యాయంగా వుందని మంత్రి గారిని అడుగుతున్నాను. దీని వల్ల సాధారణ భక్తులు, పేద భక్తులు ఇబ్బంది పడే పరిస్థితి వుంది.

మూడవది, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు తమరు చెప్పారు. అసలు ఆర్జిత పూజలు ఉన్నాయా? జరుగుతున్నాయా? కేవలం సేవా టికెట్లను మాత్రమే రద్దు చేశారా? లేదా ఆర్జిత పూజలను కూడా రద్దు చేశారా?

శ్రీ జె. రత్నాకర రావు : అధ్యక్షా, ఫండ్సు డైవర్షను గురించి మాట్లాడేరు. రోడ్సుకి గాని, బ్లడ్ బ్యాంక్సుకి గాని ఇప్పటివరకూ, ఈ రోజు వరకూ అయితే ఎటువంటి నిధులూ ఇవ్వలేదు.

వైకుంఠ ఏకాదశి రోజున కలిగిన ఇబ్బందుల గురించి పత్రికలలో చూశామన్నారు. ఇవన్నీ చూశాక ముఖ్యమంత్రి గారు దీని మీద ఇద్దరు మెంబర్సుతో ఒక కమిటీ వేశారు. వీరభద్రయ్య, సుధీర్ కుమార్‌లతో వేశారు. వారు వెళ్లి పరిశీలించి, రిపోర్టు కూడా ఇచ్చారు. అది ప్రధాన పరిపాలన శాఖ పరిశీలనలో వుంది వివరాలు ఇంకా బయటకు రాలేదు.

అలాగే నిధులు బయటకు మళ్లుతున్నాయన్నారు. అది వాస్తవం కాదు. మేము సెక్షన్ 111 ప్రకారం విద్యా సంస్థలు, ఆసుపత్రులు, ఇంజనీరింగ్ నిర్మాణ పనులకు మాత్రమే ఇస్తున్నాము. వాటి వివరాలు చెప్ప మంటే చెబుతాను. మిగతా వాటికి ఎక్కడా ఇవ్వలేదు.

తర్వాత ఆడిట్ గురించి అడిగేరు. మీకు తెలుసు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం జరుగుతుంది. గవర్నమెంటు నిబంధనల ప్రకారమే ఆడిట్ జరుగుతుంది. ఆడిట్ అయినాక 3 నెలల్లో ట్రస్టు బోర్డుకు నివేదిక ఇస్తారు. ట్రస్టు బోర్డు ప్రభుత్వానికి పంపించడం జరుగుతుంది. అయితే సభకు దానిని సమర్పించే కార్యక్రమం గతంలో జరగలేదు. భవిష్యత్తులో కూడా అటువంటి కార్యక్రమం ఉండదు.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, శాసన సభ, శాసన మండలి అనేవి రాజ్యాంగపరంగా ఏర్పాటైనవి. దీనికి తిరుమల తిరుపతి దేవస్థానం అయినా, ఏ ఇతర సంస్థ అయినా ఆన్సరబుల్ కావాలి. ఏ సంస్థకూ లేని ఎగ్జంప్షను టి.టి.డి. కి మాత్రం ఎందుకుండాలి? దాని అడ్మినిస్ట్రేటివ్ రిపోర్టు, ఆడిట్ రిపోర్టు ఉభయ సభలలో పెట్టే సంప్రదాయాన్ని పాటించే విధంగా చేయాలని తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

అలాగే భవిష్యత్తులో బ్రేక్ దర్శనాల నిమిత్తం ఏ విఐపి వచ్చినా, వారి కన్వీనియెన్సు ప్రకారం చేయించే దైవ దర్శనం, బ్రేక్ దర్శనం ఆపేస్తూ, దేవుడిని కూడా డిక్టేట్ చేసే విధానానికి స్వస్తి చెప్పి, గతంలో లాగా బ్రేక్ దర్శనానికి ఒక టైము పెట్టాలి. విఐపిలు వచ్చినా, వివిఐపిలు వచ్చినా ఆ టైములోనే రావాలి. ఏదో టైములో వచ్చి దేవుడిని చూసి వెళ్లే పరిస్థితి ఆపాలి. అది సమంజసం కాదు. కాబట్టి బ్రేక్ దర్శనం కోసం స్ట్రిక్టు టైముని ఇంపోజ్ చేస్తారా? తగిన చర్యలు తీసుకుని సాధారణ భక్తులకు కూడా ఇన్‌కన్వీనియెన్సు లేకుండా తగిన చర్యలు తీసుకుంటారా?

ఉ. 10.10

శ్రీ జె. రత్నాకరరావు : అధ్యక్షా, ఇది చాలా కాలంగా జరుగుతున్న విషయమేనని వీరభద్రరావు గార్కి కూడా తెలుసు. వారు అధికారంలో ఉన్నప్పుడు కూడా ఈ సభ ముందుకు తీసుకురావాలన్న ఆలోచన చేయ లేదు. ఇప్పుడు వారు సభ దృష్టికి తీసుకువచ్చారు. మేము ప్రభుత్వంతో సంప్రదించి దీనిపైన నిర్ణయం తీసు కొంటాము. ఆడిట్ రిపోర్టుని చట్టసభల్లో పెట్టే ఆలోచన ఇప్పటి వరకు లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆడిట్ నివేదిక చట్ట సభల్లో ప్రవేశ పెట్టాలని మొట్టమొదటి సారిగా సభ్యులు అడిగారు. అటువంటి ఆలోచన మాకు లేదు.

శ్రీవారి సేవల గురించి, దర్శనం, సేవ టికెట్స్ విషయం ప్రస్తావించారు. పండుగలు తదితర పర్వదినాల్లో భక్తుల క్యూ లైన్‌ని ఆపి, వి.ఐ.పి.లను ప్రత్యేకంగా వదలే పరిస్థితి లేదు. లైన్‌ని ఆపి పూజలు జరిపించే పరిస్థితి కూడా లేదు. రద్దీ ఎక్కువైనప్పుడు ఇటువంటివన్నీ క్యాన్సిల్ చేసి, ప్రజలకు భగవంతుని దర్శనం కల్పించి పంపించడం జరుగుతోంది. పాలు, మంచినీరు తదితర సౌకర్యాలను క్యూ లో ఉన్న భక్తులకు కల్పించే అవకాశం అమౌలౌతోంది. ఇప్పుడు కూడా ఇస్తున్నాము. లక్షలాదిగా భక్తులు దర్శనానికి వచ్చినప్పుడు కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఆ రోజున (వైకుంఠ ఏకాదశి) టికెట్స్‌ని ఇవ్వలేదు. ఎవర్నీ ఆపలేదు. పేపర్‌లో వచ్చిన దానిపై వెంటనే ఆఫీసర్స్‌తో యింక్వైరీ చేయించాము. ఆ యింక్వైరీ రిపోర్టు వచ్చిన తరువాత సభ్యులకేమైనా వివరాలు కావాలంటే ఇస్తాము.

మిస్టర్ ఛైర్మన్ : వైకుంఠ ఏకాదశి తదితర పర్వదినాల్లో క్యూలో ఉన్న భక్తుల సౌకర్యార్థం బాటిల్స్ ద్వారా త్రాగునీటిని అందిస్తే బాగుంటుంది.

శ్రీ జె. రత్నాకరరావు : అధ్యక్షా, సాధారణంగా మేము ఫిల్టర్ వాటర్‌నే భక్తులకు అందజేస్తున్నాము. బాటిల్స్ ద్వారా సపరేట్‌గా ఇచ్చే ఆలోచన చేస్తాము.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు : వైకుంఠ ఏకాదశి రోజున కొన్ని అవకతవకలు జరిగినట్లు పేపర్స్ వచ్చాయి. ముఖ్యమంత్రి గారు ఆదేశిస్తే మీరు యింక్వైరీ చేయిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి గారు పిలిచి సమీక్ష చేస్తే తప్ప మీ శాఖ లో చలనం లేని పరిస్థితి కనిపిస్తోంది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్, పాలక వర్గం సభ్యులు ఉన్నారు. ఐ.ఏ.ఎస్. అధికారిని ప్రభుత్వం తరఫున పంపించారు. మంత్రిగా మీరు ఉన్నారు. ప్రతిదీ ముఖ్యమంత్రిగారు ఆదేశించినప్పుడే స్పందిస్తే ఎట్లా? Government should function as usual. తిరుమల తిరుపతి దేవస్థానం చాలా పవిత్రమైంది. చాలా మంది భక్తులు భగవంతుని దర్శించుకోడానికి వెళుతుంటారు. అక్కడ అవకతవకలు జరగడమనేది అందరికి ఆశ్చర్యం కలుగుతోంది. ఆదాయంపై దెబ్బకొట్టే పరిస్థితి ఉంది. ఈ ప్రత్యేక దర్శనాలు కల్పించే విషయంలో వీలైనంత వరకు తగ్గించే విషయంలో ఏమి చర్యలు తీసుకొంటారు? సినిమా యాక్టరు, ఇతరత్రా పెద్ద యాక్టర్లు వెళ్లి వారిపై పెత్తనం చేయకుండా చూడడానికి కావాల్సిన ఆలోచనలు చేయండి. దేవస్థానం పవిత్రతను కాపాడే నిమిత్తం ఫలానా ఫలానా చర్యలు తీసుకొంటున్నామని చెప్పండి.

శ్రీ టి.జి.వి. కృష్ణారెడ్డి (గుంటూరు): అధ్యక్షా, పేపర్లు పుంఖాను పుంఖాలుగా వ్రాస్తాయి. ఎవరి తరఫున వ్రాయాలనుకొంటే వారి తరఫున వ్రాస్తుంటారు. కొంత మంది తరఫున వకాల్తా పుచ్చుకొంటారు. దీంట్లోకి వెళ్లకుండా, వాస్తవాలను మంత్రిగారు చెప్పారు. ఆ విషయంలో వారు తగిన చర్యలు తీసుకొంటున్నారని అన్నారు. ఆడిట్ నివేదికను ప్రతి సంవత్సరం చట్ట సభల ముందు పెట్టడానికి గాను మంత్రిగారు తగిన చర్యలు తీసుకొంటే, ఇటువంటి అభియోగాలకు తావులేకుండా ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నాను. దేవస్థానం వారు అటానమస్ బాడీ అని అభ్యంతరాలు చెప్పవచ్చు. కానీ, మొన్న గవర్నర్ గారి ప్రసంగంలో చేనేత వస్త్రాలని టి.టి.డి. వారు కొనుగోలు చేయాలని చెప్పారు. అలాగే, బడ్జెటు, వినియోగాలు, జమా ఖర్చుల వివరాలు సభా సమక్షంలో పెడితే, తగిన సిఫార్సులు, సూచనలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నా ను.

శ్రీ బి. చెంగళ రాయుడు (అసెంబ్లి): అధ్యక్షా, వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో జరిగిన విషయాల గురించి దాడి వీరభద్రరావు గారు ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి నేను వెలుతున్నాను. ప్రభుత్వానికి నా సూచన ఏమంటే, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కమిటీలను వేయాలి. జనవరి ఒకటవ తేదీన, వైకుంఠ ఏకాదశి తదితర పర్వ దినాల్లో రద్దీని తట్టుకొనే నిమిత్తం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కమిటీలను వేయాలని కోరుతున్నాను. అమినిటీస్ మెయింటెనెన్స్ కమిటీ, టైమ్ మేనేజ్‌మెంట్ కమిటి, హెల్త్ మేనేజ్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేస్తే ఆ కమిటీలు దగ్గరుండి ఈ కార్యక్రమాలను చూసుకొనే అవకాశం ఉంటుంది. తిరుమలలో భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగి రోజుకు లక్ష మందికి పైగా వస్తున్నారు. భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించేందుకు మేనేజ్‌మెంట్ కమిటీలను వేసి పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేస్తున్నాను. మిత్రులు మాట్లాడుతూ, బ్రాందీ షాప్ వారికి ప్రత్యేక దర్శనం అని అన్నారు. కౌశికుడి గురించి మీకు తెలుసు కదా. ఆయన మటన్ కొట్టుకొంటూ ధర్మాన్ని ప్రతిపాదించిన వ్యక్తి..

(అంతరాయం)

శ్రీ బొమ్మిడి నారాయణరావు (అసెంబ్లి) : కౌశికుడు కాదు, ధర్మవ్యాధుడు.

శ్రీ బి. చెంగళ రాయుడు : ధర్మవ్యాధుడే. నేనూ ఒప్పుకొంటున్నాను. నారాయణరావు గారు నాటకాల్లో మంచి పాత్రలు వేస్తారు. మన గవర్నర్ నారాయణదత్ తివారి గారి ప్రసంగంలోని 29వ పేజీలో ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం వారిని ఖాదీ పరిశ్రమల ద్వారా బట్టలు కొనుగోలు చేయాలని ఆదేశించింది. అలాగే ప్రభుత్వం వారికి మౌఖికమైన ఆదేశాలు ఇచ్చి ఆడిట్ రిపోర్టు ఉభయ సభల ముందు పెట్టాలని చెప్పాలి. అందులో జరుగుతున్న విషయాలు మనకు తెలియాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను.

మిస్టర్ చైర్మన్ : మంత్రి గారు పరిశీలిస్తామని అన్నారు. మీరు కూర్చోండి.

శ్రీ కె.ఆర్. ఆమోస్ (అసెంబ్లి) : అధ్యక్షా, తిరుమల తిరుపతి దేవస్థానం ఆడిట్ అకౌంట్స్ గురించి పేపర్ లెయిడ్ కమిటి దేవస్థానం అధికారులతో సమావేశమై చర్చించగా, ఆడిట్ రిపోర్టు, అకౌంట్స్ సరైన పద్ధతిలో లేవని, సరైన పద్ధతుల్లో నడిపించలేకపోతున్నారని, గవర్నమెంట్ఆడిట్ చేస్తే బాగుంటుందని, తగు విధంగా ప్రపోజల్స్ ప్రభుత్వానికి పంపిస్తామని వారు చెప్పడం జరిగింది. ఇన్ని కోట్ల రూపాయలు ప్రజల నుండి దేవస్థానానికి వస్తున్నప్పుడు, ప్రభుత్వానికి ఏదో రిపోర్టు పంపిస్తున్నారు, వారు శ్యాటిస్‌ఫైఅయ్యామన్న పద్ధతిలో అంటే ఎట్లా? ఆడిట్ నివేదికలను హౌజ్‌లో పెట్టకుండా, ప్రభుత్వం శ్యాటిస్‌ఫై అయిందన్నది బాగుండదు. హౌజ్‌లో ఆడిట్ రిపోర్టు పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో సరైన పద్ధతిలో చేయాలని కోరుతున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు : అధ్యక్షా, ఇంతకు ముందు నేను వేసిన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకొన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున సుమారుగా ఏడెనిమిది గంటల పాటు సామాన్య భక్తులకు భగవంతుని దర్శనం కల్పించ లేదు. వి.ఐ.పి.లకు, వివిఐపి లకు మాత్రమే దర్శనాలు కల్పించారు. బ్రాందీ తయారు చేసే వారా, మరొకరా అన్నది కాదు. గతంలో, మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి గారు భారత రాష్ట్రపతిగా ఉన్నప్పుడు తిరుమలకు దర్శనార్థమై రాగా, ప్రొటోకాల్ ప్రకారం కేవలం ఆయనకు మాత్రమే దర్శనం కల్పిస్తామని, ఆయన మనుమడిని మామూలు దర్శనం చేసుకోవాల్సిందిగా చెప్పారుట. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం కేవలం మీకే (నీలం సంజీవ

రెడ్డి గార్కి) అనుమతి ఉంది కానీ, మీ మనుమడిని అలా చేయలేమని చెపితే ఆయన నేను కూడా క్యూ లోనే దర్శనం చేసుకొంటా అని అన్నారుట. అప్పుడు, మేనేజ్‌మెంట్ ఇంటర్ఫీయరై వారిద్దరిని లోపలకు తీసుకు వెళ్లడం జరిగింది. అటువంటి పవిత్రమైన ఆలయంలో సినిమా ఆర్టిస్ట్ శ్రీదేవి వెళితే డైరెక్టుగా దర్శనం ఇచ్చారు. మోహన్‌బాబు వెళితే డైరెక్టుగా ఒక గంట సేపు దర్శనం చేయించారు. సుబ్బరామిరెడ్డి గారు, బ్రాందీ తయారు చేసే వారు వెళితే గంట సేపు పూజలు చేయించారు. ఇది పద్ధతా? దీనికి ఒక సిస్టమ్ అంటూ ఉండాలి కదా? ఎవరి దయాదాక్షిణ్యాలపై, ఎవరి ప్రాప్తం కోసం వారు దర్శనాలు చేయించి గంటల కొలది దేవుణ్ణి ఆక్రమిస్తే ఎట్లా గండి? భూ ఆక్రమణలను ఎలాగూ చేస్తున్నారు. దేవుడి ఆక్రమణలను కూడా చేస్తారా మీరు? దీనికో సిస్టమ్ ప్రవేశ పెట్టండి.

(అంతరాయం)

ఉ.10.20

శ్రీ పాతూరి సుధాకర రెడ్డి (మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాదు) : అధ్యక్షా, తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర భక్తి ఛానెల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ ఛానెల్‌లో వస్తున్న భక్తి ప్రసారాలు తిరుమలలో వున్న కాటేజ్‌లలో వుండే టెలివిజన్స్‌లో రాకూడదనే నిర్ణయం ఏమైనా తీసుకోబడిందా? మరి ఎందుకు అక్కడ కాటేజీలలో వున్న టివిలలో ఈ ప్రసారాలు రావడం లేదు? నేను కూడా ఒకసారి అక్కడకు వెళ్లి కాటేజీలో వున్నాను. అందులో టివి వుంది. నేను భక్తి ఛానెల్ ప్రసారాలను చూడాలని అక్కడ టివిని పెట్టుకోవడం జరిగింది. అయితే అందులో భక్తి ప్రసారాలు ఏవీ రావడం లేదు. అంతేగాకుండా తిరుమలలో కూడా గతంలో అన్ని మైక్ సెట్స్‌లో భక్తి పూరితమైన పాటలు వినపడటం జరిగేది. ఇప్పుడు అవి వినిపించడం లేదు. కాబట్టి మంత్రి గారిని నేను అడిగేది ఈ విధంగా వినిపించకూడదనే నిర్ణయం ఏమైనా మంత్రిగారిచే చేయబడిందా? లేనట్లైతే గతంలో మాదిరిగా తిరుమలలో మళ్లీ భక్తి పాటలు, భక్తి పూరిత ప్రసారాలు కొనసాగిస్తారా లేదా తెలియజేయవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ జె. రత్నాకర్ రావు : అధ్యక్షా, గౌరవ సభ్యులు చాలా మంది ఇక్కడ వున్న ప్రశ్నకు సంబంధం వున్నా లేకపోయినా తమకు కలిగిన సమస్యల గురించి మాట్లాడటం జరిగింది. నిజానికి ఇక్కడ చేయబడుతున్న ఆడిట్ ప్రభుత్వ పరంగానే జరుగుతున్నది. ఆడిట్ చేయబడిన తర్వాతనే బోర్డుకు పోతుంది. బోర్డుకు పోయిన తర్వాత మళ్లీ ప్రభుత్వానికి పంపించబడుతుంది. వీర భద్రరావు గారూ మీరు కూడా 11 సంవత్సరాలు అధికారంలో వున్నారు. ఆ 11 సంవత్సరాలలో మీరెప్పుడూ ఈ విధంగా క్వశ్చన్ చేయలేదు. ఈ విషయమై మాట్లాడలేదు.

విఐపి లకు ఎక్కడా కూడా ప్రత్యేకత యివ్వడం లేదు. విఐపిలకు ఎప్పుడూ దర్శనం ఇవ్వడం జరుగుతోందని సభ్యులు అంటున్నారు. వారికి ఎప్పుడు ప్రత్యేక దర్శనం యివ్వడం జరుగుతోందంటే శుభ్రతకోసం బ్రేక్ ఎప్పుడయితే వుంటుందో అప్పుడు, అంటే అక్కడ శుభ్రత చేసే సమయంలో బ్రేక్ యివ్వడం జరుగుతుంది. ఆ తర్వాత ధర్మ దర్శనం లైన్ కంటే ముందుగా దర్శనం యిప్పించడం జరుగుతోంది. అక్కడ వారెవరినీ కూడా ఒక్క సెకండ్‌కన్నా ఎక్కువ నిలబడనిచ్చే పరిస్థితి కూడా ఉండటం లేదు. ఇది వాస్తవం . ఎవరి చేతా కూడా గంటల తరబడి పూజ చేయించే సంప్రదాయం లేదు. ఎవరినీ తీసుకు పోవడం లేదు. లైన్ లోనే తీసుకు పోతున్నారు తప్ప మరోటి కాదు. రోజాను తీసుకు పోయారా?

సరితాను , గీతాను తీసుకుపోయారా ఎవరిని తీసుకు పోయారు అన్నది మాకు తెలియదు కాని. అటువంటి సంప్రదాయం లేదు. జరగే వీలు లేదు. అటువంటి ప్రయత్నం మేం చేయడం లేదు, ఆ ఆలోచన మాత్రం లేదు.

మేం చేసేటువంటిది మహా ద్వారం ద్వారా కొందరిని లోపలికి పంపించడం జరుగుతోంది. అలా మహా ద్వారం ద్వారా ఎవరిని పంపిస్తున్నామంటే చిన్నపిల్లల తల్లులను, హ్యాండీ క్యాప్డ్ మరియు వృద్ధులను మాత్రమే ప్రత్యేక ద్వారం ద్వారా తీసుకు పోవడం జరుగుతోంది. భక్తి ఛానెల్ పాటల గురించి సభ్యులు అడిగారు. ప్రత్యేకంగా భక్తి పాటల గురించి ఒక ఛానెల్‌ను ప్రవేశ పెట్టడం జరిగింది. అక్కడ అది తప్ప వేరే పాటలు అవీ పెట్టడం జరగడం లేదు. అలాంటి సందర్భాలను నేనయితే చూడలేదు. గమనించలేదు కూడా.

(అంతరాయం)

అధ్యక్షా, నేను సత్యంగా చెబుతున్నాను. నా కొడుకు, కోడలు తిరుపతికి వెళ్లడం జరిగింది. అక్కడ వారు బ్రేక్ దర్శనం గురించి అడిగారు. అలా అడిగితే బ్రేక్ దర్శనం లేదని అక్కడి వారు చెప్పడం జరిగింది. అలా చెబితే నేను వారిని లైన్‌లోనే పంపించడం జరిగింది. నేను సత్యమైన మాటలనే చెబుతున్నాను. ఎప్పుడు కూడా నేను సత్యమైన మాటలనే చెబుతాను సార్, ఈ వయసులో ఈ దేవాదాయ శాఖ మంత్రిగా వచ్చినందుకు చాలా అదృష్టంగా భావించాను. మీ ప్రభుత్వ హయాములో మీ మంత్రుల ద్వారా, మెంబర్సు ద్వారా నేను ఉత్తరాలు తీసుకుపోతే కూడా గంటల తరబడి దర్శనం దొరకని సందర్భాలు వున్నాయి. ఈ రోజు దేవాదాయ శాఖా మంత్రిగా నేను పోతున్నానంటే ఇంతకన్నా ఎక్కువ అదృష్టం లేదనుకుంటున్నాను. అక్కడ అటువంటి సమస్యలు లేవు. రద్దీ ఎక్కువ అయినప్పుడు అక్కడ ఎలా వుంటుందో మీ అందరికీ తెలుసు. దర్శనం వద్ద యిబ్బందులు వస్తాయి. వైకుంఠ ఏకాదశి నాడు ............

(అంతరాయం)

MR.CHAIRMAN: Please take your seat, I am not allowing.

శ్రీ జె. రత్నాకర్ రావు: అధ్యక్షా, సమస్య వచ్చినప్పుడు అందరినీ ఆపుతారు గాని, ఎవరినో ఒక్కరిని ఆపే సమస్య లేదు. అసలు అందరినీ ఆపే సమస్య లేదు. వీలైనంత వరకూ మేం భక్తులందరికీ సౌకర్యాలు కలిగేలా చూస్తాం. బ్రేక్‌లు వచ్చినప్పుడు ఎవరైనా విఐపి లు వస్తే వారిని ముందుగా పంపించడం జరుగుతోంది తప్ప అంతకు ముందు వారిని పంపడం జరగడం లేదు. అటువంటి సమస్యలు వచ్చినప్పుడు మా దృష్టికి తీసుకు రండి. మేం తప్పకుండా చర్యలు తీసుకుంటాము. మరో విషయం సార్, సేవా టికెట్సు విషయంలో, వాటి మీద నిబంధనలు పెట్టడం జరిగింది. ముందు బుక్ చేసుకుంటే తప్ప వాటిని ఇవ్వడంలేదు. ఎవరైనా సరే విఐపీలుంటే, తప్పక మాకు వారిని చూడవలసిన అవసరం వుంది. శుక్ర వారం నాడు మేం అభిషేకం చేసుకోవాలని ఎవరైనా అడిగితే, వారికి టికెట్టు యిచ్చే కార్యక్రమం పెట్టాము. అయితే, దానికి కూడా మేం వారి నుండి ఎక్కువ డబ్బులు తీసుకోవడం జరుగుతోంది. మామూలుగా ఆ సేవ నిమిత్తం రూ. రెండువేలో ఎంతో వుంటే, దానికి ఇలాంటి సందర్భాలలో రూ. 5 వేలు తీసుకోవడం జరుగుతోంది. ఈ విషయంలో చాలా స్ట్రిక్ట్ చేశామండీ.

ఉదయం. 5.30 నుంచి మీరు టివిలో వెంకటేశ్వర స్వామికి సంబంధించి భక్తి ఛానెల్ పెట్టుకుని చూడండి. రోజూ వెంకటేశ్వర స్వామికి సంబంధించిన కార్యక్రమాలు అందులో వస్తున్నాయి. నేను కూడా ఆ కార్యక్రమాలను చూస్తున్నాను. ఇది వాస్తవమైనటువంటి మాట.

అధ్యక్షా, అక్కడ అంటే, తిరుమలలో జరిగే కార్యక్రమాలు టివీలలో వస్తున్నాయి ఉదయం 4.30 నుంచి సుప్రభాతం మిగతా కార్యక్రమాలు వస్తున్నాయి . మరి మైకులలో కూడా ఈ విధమైన భక్తి కార్యక్రమాలు, పాటలు వస్తున్నాయి. తదుపరి గౌరవ సభ్యులు చెప్పిన విధంగా అక్కడ కాటేజీలలో టివీలకు సంబంధించి నేను ఎప్పుడూ చూడడం జరగలేదు. నాకటువంటి అవకాశం రాలేదు. అలాంటివి ఏవైనా వుంటే తప్పకుండా కాటేజీలలో భక్తి ఛానెల్ కార్యక్రమాలు వచ్చే విధంగా చూడవలసిందిగా నేను మరల ఆదేశిస్తాను. తప్పకుండా ఆ కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

తదుపరి యిక్కడ భక్తి కార్యక్రమాల ప్రసారాలు చేయడం, భక్తుల రద్దీగా ఎక్కువగా వున్న సందర్భాలలో విఐపిలకు ప్రత్యేక దర్శనాలను యిప్పించడం గురించిన విషయాలపై ఎంక్వైయిరీ చేయడం అన్నది ముఖ్యమంత్రి గారు చేసినదే కాకుండా, మేం కూడా మా పరంగా కూడా ఎంక్వైయిరీ చేస్తున్నాము. ముఖ్య మంత్రి గారు స్పెషల్‌గా ఇద్దరు మనుషులను పంపి ఎంక్వైరీ చేయించారు. నేను అక్కడ ఇ.ఓ తోను, వారి ఛైర్మన్‌తోనూ కూడా ఈ విషయాలను గురించి మాట్లాడటం జరిగింది. ఎప్పటికప్పుడు ఈ విధంగా కార్యక్రమాలు పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ కూడా, ర ద్దీ బాగా పెరగడం మూలంగా భక్తులకు స్వామిని దర్శించుకోవడంలో చాలా సమయం పడుతున్నది.

నా చిన్నప్పుడు అంటే నేను 14 లేక 15 సంవత్సరాల వయసున్నప్పుడు తిరుపతికి వెళ్లడం జరిగింది. అప్పుడు, ఆ రోజులలో పుష్కరణిలో స్నానం చేసుకోవడం, అరగంటలో దేవుని దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. ఈ రోజు అక్కడకి పోతే కొన్ని గంటలు తప్పనిసరిగా వుండాలి. కనీసం ఒక రోజు అయినా ఉండక పోతే దర్శనం చేసుకునే పరిస్థితి యిప్పుడు అక్కడ లేదు. 10 సంవత్సరాల క్రితం కూడా 14 గంటలు 16 గంటల తర్వాత దర్శనాలు చేసుకున్న సందర్భాలున్నాయి.

భక్తులలో కొంత మందికి విఐపి పద్ధతి ద్వారా దర్శనం చేసుకునే అలవాటు లేదు సార్. చాలా మంది డబ్బు వున్న వారు కూడా ధర్మ దర్శనమే చేసుకుంటారు తప్ప, విఐపి దర్శనానికి పోరు. కారణం ధర్మ దర్శనం చేసుకుంటేనే పుణ్యమని. అలాంటి వారు అక్కడ , ఒక రోజు, రెండు రోజులు కూడా లైన్లలో వుండి భక్తులు ధర్మ దర్శనం చేసుకుంటున్న సంప్రదాయం వుందనే మాట కూడా తమకు మరొకసారి తెలియజేస్తున్నాను. ఏప్రెల్ లో మనకు ఎన్నికలు వస్తున్నాయి , ఈ లోపు సభ్యులు ఎవరైనా కోరితే మిమ్ములను అందరినీ కూడా ఆ క్యూ ద్వారానే లోపలకు తీసుకుని పోయి తప్పకుండా స్వామి దర్శనం చేయిస్తాను.

(అంతరాయం)

శ్రీ ఎ. రేవంత్ రెడ్డి (మహబూబ్‌నగర్): అధ్యక్షా, అక్కడ వీల్ ఛైర్స్ లభించడానికి సంబంధించి కూడా చాలా యిబ్బంది వుందండీ, దాని గురించి మంత్రి గారిని చెప్పవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ జె. రత్నాకర్ రావు : అధ్యక్షా, వీల్ ఛైర్స్ వున్నాయి. వాటి ద్వారా మేం అక్కడ ఒక్క హ్యాండీ కాప్డ్ నే కాదు బాగా ఏజ్ వున్న వాళ్లను 80 లేక 90 సంవత్సరాల వయసున్న వాళ్లను కూడా మహా ద్వారం వరకూ వీల్ ఛైర్‌లో తీసుకుపోయి దించడం జరుగుతోంది. అది నిజం. గత సంవత్సరం యాజ్ ఎ ఛైర్మన్ నేను టికెట్టు కొనుక్కునే అక్కడకు పోవడం దర్శనం చేసుకోవడం జరిగింది. నేను పోయిన సంవత్సరం కూడా తిరుపతికి వెళ్లాను. నాకు దర్శనం చేసుకోవడానికి 45 నిమిషాలు పట్టింది యాజ్ ఎ ఛైర్మన్. నా ఫ్యామిలీ 8 మంది అక్కడకు వెళ్లాము. 8 మందికి కూడా నేను దర్శనం టికెట్సు కొన్నాను. ఎప్పుడో ఒకసారి ఈ విధంగా కొన్ని సంఘటనలు జరగడం, ల్యాప్స్ కావడం అవుతుంది. ఇన్‌స్పైర్డ్ పీపుల్ వుంటారక్కడ. అక్కడున్న ఎంప్లాయీస్ మోర్ ఇన్‌స్పైర్డ్ చేస్తారట్లా. అయితే, ఎప్పుడో ఒకసారి జరుగుతుంది. జరగదని కాదు. అందుకనే నేను కావాలంటే అక్కడికి తీసుకుని పోయి కూడా తమకు చూపుతాను. మీరు ఫ్లోర్ లీడర్సుతో మాట్లాడతామన్నారు కదా. కావాలంటే అక్కడికి కూడా తీసుకు పోయిచూపుతాను.

శ్రీ దాడి వీరభద్ర రావు : అధ్యక్షా, అడ్మినిస్ట్రేషన్ రిపోర్టు అన్నది సీక్రెట్ డాక్యుమెంట్ కాదు. పబ్లిక్ డాక్యుమెంట్ కాబట్టి, ఇంతవరకూ జరిగింది ఏదో జరిగింది. ఇకపై ఆ డాక్యుమెంట్‌ను ప్రవేశ పెట్టడానికి దయచేసి పరిశీలించాల్సిందిగా కోరుతున్నాను. తర్వాత ఛైర్మన్ గారు డైరెక్షన్ యిచ్చినందుకు చాలా సంతోషం. వారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. స్వామి వారి కార్యక్రమం కాబట్టి దానిని టైటన్ చేసి, ఎవరికైనా సరే ఎక్కువ సేపు దర్శనం యిచ్చేటువంటి పరిస్థితి కాదు. మిగిలినటువంటి వారికి కూడా ఇన్‌కన్వీనియన్సు లేకుండా ఒక పద్ధతి అంటూ ప్రవేశపెట్టి, దైవ దర్శనానికి కూడా ఒక సిస్టెమ్ అన్నది ఇంట్రడ్యూస్ చేస్తే బాగుంటుందని కోరుతున్నాను. ఇది గతంలో వుండేది. దానిని రీ ఇంట్రడ్యూస్ చేసి ఎట్టిపరిస్థితులలో వయలేషన్సు లేకుండా చూడవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ ఎం. మాణిక్ రావు : అధ్యక్షా నేను అడిగేది I am handicapped, అక్కడ వీల్ ఛైర్స్ 6 వున్నాయి. అందులో 2 పని చేస్తుంటే, మిగిలిన 4 పనిచేయడం లేదు. నేను 1972లో ఒక కాటేజ్ కట్టించాను. దానిని అడిగే దిక్కు లేరు. అక్కడ లోపల సామాను లేదు. దానిని ఊడ్చేవారు లేరు. ఇప్పుడు వారు చెప్పారు కాటేజీలలో టివిలు అవీ వున్నాయి. కానీ ఏవీ పని చేయవు. గ్లాస్‌లు లేవు. తల్లెలు లేవు. ఏమీ లేవు. Nothing was inside, this is worst. My Hon'ble friend, he is very close to me. చీఫ్ మినిష్టర్ గారు చాలా బాగా చేశారు, ఎవరూ దొరకకపోతే, కరీంనగర్‌కు చెందిన ఒక మంచి వ్యక్తిని పెట్టారు. బాగా చేశారు. అలాగే దయచేసి నీవు మంచి వాడివి దేవునికి, భక్తులకు మంచి చేయమని ఆలోచన చేయండి.

ఉ. 10.30

శ్రీ బొమ్మిడి నారాయణ రావు: అధ్యక్షా, మంత్రి గారు మాట్లాడుతూ, చాలా ఆనందంగా నేను ఈ శాఖను నిర్వహిస్తున్నాను, సదరు శాఖ నాకు రావడం, అదృష్టం అన్నారు. మీ టైములో ఏదైనా ఆర్జిత సేవల రేట్లు పెంచడం జరిగిందా? రెండవది, ప్రతి శుక్రవారం వచ్చే వస్త్రం సేవ, గతంలో రూ.12,500 ఉండేది, ఈరోజు అది రూ.50 వేలకు పెంచడం నిజమా కాదా? ఇది సమంజసమా? ఇవి తగ్గించే ఆలోచన మీకు గాని, ప్రభుత్వానికి గాని ఏమైనా ఉందా? ఈ మధ్య న్యూస్ పేపర్లో ఒకటి చూసాం. ఏడు కొండల వాడు మరల అప్పుతెచ్చుకోవడానికి కుభేరుడి దగ్గరకు పరిగెత్తవలసిన పరిస్థితి వస్తుందా? దానికి మంత్రిగారిచ్చే సమాధానం ఏమిటి?

శ్రీ జె.రత్నాకర్ రావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పింది ఏదైతే ఉందో, అది వాస్తవం కాదు. వస్త్రం గురించి చాలా సంవత్సరాల నుండి అంటే ఇంచుమించూ 15 నుండి 20 సంవత్సరాల నుండి బుక్ చేసుకున్న వాళ్లు ఉంటారు. ఎవరైనా వి.ఐ.పిలు వచ్చి బాగా ప్రెజర్ చేసినప్పుడు, ఒక్కరికో ఇద్దరికో, ఆ అవకాశం ఏర్పాటు చేస్తాం. ఆ అవకాశం ఏర్పాటు చేసినప్పుడు కూడా టికెట్ మీద పెంచడం లేదు. కాని, తత్కాలికంగా అప్పటికప్పుడు వచ్చి వెంటనే కావాలనే వారికి మాత్రం రూ.50 వేలు వసూలు చేస్తారు. సదరు రూ.50 వేలతోకూడా ఒక్కరికో, ఇద్దరికో ఇవ్వడం జరుగుతోంది. అది కూడా కేవలం రద్దీని తగ్గించడం కోసమే తప్పా, డబ్బుగురించిన ఆలోచన కాదు. అది వాస్తవం కాదు, అటువంటి కార్యక్రమాలేవి జరగడం లేదు.

అలాగే గౌరవ సభ్యులు మాణిక్ రావు గారు కూడా ఒక ప్రశ్న అడిగారు. వారు కూడా నాకు బాగా పరిచయం ఉన్న గౌరవ సభ్యులు. వారు ఈ మధ్య నా దృష్టికి ఒక విషయం తీసుకువచ్చారు. పురాతనంగా 40 నుండి 70 సంవత్సరాల క్రింద కట్టిన క్వార్టర్స్ అన్ని లీకేజ్ ద్వారా చెడిపోయాయి. మేము ఏమి చేస్తున్నామంటే, మళ్లా వారికే లెటర్ రాసి దానికి రిపేర్ చేయడానికి ఇంత డబ్బు అవుతుంది, రివైజ్డ్ ఎస్టిమేట్స్ వేస్తాం, మీరు ఇస్తారా లేదా? అని అడగడం జరుగుతుంది కాబట్టి, వారి నుండి సమాధానం వస్తే వెంటనే బాగు చేస్తాం.

## FEE FOR MEDICAL FITNESS CERTIFICATES

Q.No.12 (2293)

MR.CHAIRMAN: Question No.12 is postponed.

Q.No. 11 (2273) Contd.

శ్రీ ఆర్.గోపినాద్ (అసెంబ్లీ): అధ్యక్షా, వైకుంఠ ఏకాదశి రోజు జరిగిన అంశం గురించి ప్రశ్న వచ్చింది. వైకుంఠ ఏకాదశి రోజు జరిగినదాంట్లో ప్రభుత్వానికి గాని, బోర్డుకిగాని ఎలాంటి సంబంధం లేదు. అక్కడ ఉన్న ఒకరిద్దరు అధికారులది తప్పా, వేరే వాళ్లది పొరపాటు లేదు. ఇది జరిగిన నిజం. నేను కూడా ఆరోజు క్యూలో ఉండి, రాత్రి 3.00 గంటలకి దర్శనం చేసుకున్నాను. అది అక్కడ జరిగిన వాస్తవం.

MR.CHAIRMAN: You are not a Defence Lawyer, please take your seat.

## UPGRADATION OF SGT POSTS

Q.No. 13 (2280)

MR. CHAIRMAN: Q.No. 13 is postponed.

## రామచంద్రాపురం మండలంలో అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణ

Q.No.14 (2311)

శ్రీ వి.భూపాల్ రెడ్డి:

గౌరవనీయులైన రెవిన్యూ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) జి.ఓ. 166 ను పురస్కరించుకొని, రామచంద్రాపురం, పటాన్ చెరువు పరిధిలలోని అమీన్‌పూర్ గ్రామ పంచాయితీ, బండ్లగూడలలో 100 చదరపు గజాల కంటే తక్కువగా ఉన్న ప్రభుత్వ భూమిలోని గృహ నిర్మాణాలకు సంబంధించి రెవిన్యూ అధికార్లు క్రమబద్ధీకరించడం లేదన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకుంటున్న చర్య ఏమిటి?

రెవిన్యూ శాఖ మంత్రి (శ్రీ ధర్మాన ప్రసాదరావు):

అ) రామచంద్రాపురం, పటాన్ చెరువు పరిధిలలోని అమీన్‌పూర్ గ్రామపంచాయితీ, బండ్లగూడలలో 16.02.2008 తేదీగల రెవిన్యూ (పిఓటి) శాఖ జి.ఓ.ఎం.ఎస్ నెం. 166 క్రింద 100 చదరపు గజాల కంటే తక్కువగా ఉన్న ప్రభుత్వ భూముల అక్రమణల క్రమబద్ధీకరణ ప్రగతిలో ఉంది.

ఆ) క్రమబద్ధీకరణ కోసం అమీన్‌పూర్‌లో 865 దరఖాస్తులు అందాయి. అందులో 77 దరఖాస్తులు అర్హమైనవిగా కనుగొనడమయింది. 59 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. 18 దరఖాస్తులకు పట్టా సర్టిఫికెట్లను జారీ చేయడమయింది. అసైన్డ్ భూముల విషయంలో తిరిగి తీసుకోవడం / శిఖం భూములకు సంబంధించి క్రమబద్ధీకరణకు మిగతా 788 మంది దరఖాస్తుదారులు అర్హులు కారు.

బండ్లగూడ గ్రామ పంచాయితీలో 20 దరఖాస్తులు అందాయి. అన్ని దరఖాస్తులను విచారించి, వారు అర్హులు కానందున తిరస్కరించడమయింది.

శ్రీ వి.భూపాల్ రెడ్డి (మెదక్): అధ్యక్షా, బండ్లగూడ గ్రామంలోపట సర్వే నెం.50 గాడిదల కుంట అని ఉంది. దానికి 20 ఎకరాల శిఖం భూమి ఉంది. అందులో సర్వే నెం.63,64,65లో పరిశ్రమలు రావడంతో, అక్కడ కార్మికులంతా ఆ పరిశ్రమలలో పనిచేస్తూ, చాలా మంది ఇళ్లు లేక అక్కడే గుడిసెలు వేసుకొని, ఇప్పటికి సుమారు 15 సంవత్సరాల నుంచి పక్కా ఇళ్లు కూడా నిర్మించుకోవడం జరిగింది. నేను అప్పట్లో మండల ప్రసిడెంటుగా ఉన్నప్పుడు, రోడ్డు ఫార్మేషన్ చేయించడం జరిగింది. ఇప్పుడు గ్రామ పంచాయితీ పరిస్థితి బాగుకావడంతో, అన్నీ సి.సి రోడ్లు అయిపోయాయి. 15 సంవత్సరాల నుంచి గ్రామ పంచాయితీకి రసీదుల రూపంలో పన్ను చెల్లిస్తున్నారు. అట్టి స్థలం లోపట ఒక్క ఎకరం కూడా పారుదల లేదు. పారుదల ఉన్న భూమిని కూడా ప్లాట్లుగా చేసి అమ్ముకున్నారు. శిఖం భూమి కూడా అంతా నిండిపోయింది. కేవలం అయిదారెకరాలు మాత్రమే మిగిలిపోయింది. నేను మిమ్ములను కోరేదేమిటంటే, ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నెం.166 క్రింద ఏదైతే అవకాశం ఇస్తూ, రెగ్యులరైజేషన్ చేస్తోందన్నారో, దాని క్రింద వర్తింపజేస్తే చాలా బాగుంటుంది. 467 మంది అక్కడ నివసిస్తున్నారు. నేను సరైన సమాచారంతోనే మాట్లాడుతున్నాను. అటువంటి వారికి ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేస్తే, వారికి ధైర్యంగా ఉంటుంది. మేము ఒక ఇల్లు కట్టుకున్నాం, మాకు ఒక ఆస్థి ఉన్నదనే తృప్తితో ఉంటారు. ఆ విధంగా చేస్తే బాగుంటుందని నేను మంత్రిగారిని కోరుతున్నాను.

అంతేకాకుండా, అమీన్‌పూర్ గ్రామ పంచాయితీ లోపట, వందల ఎకరాల భూమి ఉంది, అసైన్డ్ భూమి ఉంది. అక్కడ కూడా నాకు తెలిసి, ఏడు వందల అప్లికేషన్లు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్

దగ్గర నేను వచ్చిన తరువాత ఇవన్నీ చేయించడం జరిగింది. మీరు ఎవరినైనా పరిశీలన చేయమనండి. నేను మొన్ననే జె.సిగారితో ఆర్.డి.ఓగారితో మరియు ఇద్దరు ఎమ్మార్వోలతో కలెక్టర్‌గారి పర్మిషన్‌తో మీటింగ్ ఏర్పాటు చేయించుకొని, ఇవన్నీ చెప్పడం జరిగింది. సదరు సమావేశంలో చర్చించిన సమస్యల గురించి న్యూస్ పేపర్లో కూడా రావడం జరిగింది. మరి ఆర్.డి.వో గారు ఇక్కడే ఉన్నారు. వారికి సదరు విషయాలన్నీ తెలుసు. నేను కోరేదేమిటంటే, ఎవరైతే 70, 80 గజాలలో ఉన్నారో, వాళ్లకు రెగ్యులరైజ్ చేయమని కోరుతున్నాను. ఎవరైతే అర్హులైఉండి, ఇళ్లులేక ఉన్నారో, వాళ్లందరికీ ఇళ్ల పట్టాలు జారీచేయాల్సిందిగా కోరుతున్నాను. ఇది వాస్తవమైనది, ప్రభుత్వం ఏదైతే చేస్తుందని మనం చెప్పామో, ప్రభుత్వం తరపున ఎవరికైతే 60, 70 గజాల ఉన్నాయో వారికి రెగ్యులరైజ్ చేస్తున్నాం. 100 గజాలకు మించి ఉన్నవారికి నామినల్ రేటు అన్నాం. ఆవిధంగా తొందరగా చేస్తే బాగుంటుందని తమరి ద్వారా కోరుతున్నాను. అలాగే పటాన్ చెరువు, రామచంద్రాపురం గ్రామాలలో కూడా కొన్ని రెగ్యులరైజ్ చేయాల్సినవి ఉన్నాయి. దయచేసి సంబంధిత అధికారులకు గట్టి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, అతి త్వరలో చేయించే ప్రయత్నం చేస్తే, ఆ ప్రాంతమంతా జనంతో కూడుకున్న ప్రాంతం గనుక ప్రభుత్వం చేసినందుకు వారికి మేలు కలుగుతుంది. దయచేసి, దీనిపై చర్యతీసుకొనేవిధంగా చూడాలని తమరి ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ జూపూడి ప్రభాకర రావు (నామినేటెడ్): అధ్యక్షా, హైదరాబాద్, రంగారెడ్డి మరియు నల్గొండ జిల్లాల్లో క్లెయిం చేయని evacuee lands చాలా ఉన్నాయి. జి.ఓ.ఎం.ఎస్.నెం.166 ప్రకారం సదరు evacuee lands కూడా రెగ్యులరైజ్ చేసే అవకాశం ఏమైన ప్రభుత్వం దగ్గర ఉన్నదా అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి (వరంగల్): అధ్యక్షా, ఈ జి.ఓ.ఎం.ఎస్.నెం.166లో కొన్ని అనుమానాలు ఉన్నాయి. ఎందుకంటే, వరంగల్ జిల్లాలోని భూపాల్‌పల్లి అనే గ్రామ ప్రజలు రెగ్యులరైజేషన్ కావాలని కోరుతూ, దాదాపు ఒక వెయ్యి మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఈ జి.వో గ్రామ పంచాయితీలకు వర్తిస్తుందా లేక పట్టణాలకే వర్తిస్తుందా అని మా దగ్గర అధికారులకు అనుమానం వచ్చి క్లారిఫికేషన్ హైదరాబాద్‌కు రెఫర్‌చేసారు. కాబట్టి, ఈ జి.ఓ గ్రామ పంచాయితీలకు వర్తిస్తుందా? కేవలం పట్టణ ప్రాంతాలకే వర్తిస్తుందా? సదరు సబ్జెక్ట్ సంబంధించిన మంత్రిగారు ఇక్కడున్నారు కాబట్టి, తొందరగా వివరణనిస్తే, అక్కడ అన్ని కార్యక్రమాలు పూర్తి అయినాయి, scrutiny కూడా చేయడం జరిగింది గాని, అది కాలేదు.

శ్రీ ఆర్.పద్మరాజు (అసెంబ్లి): అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం 2005లో Evacuee Act ను రద్దు చేసిన తరువాత, ఆంధ్రప్రదేశ్‌లో ఉండే ఈ evacuee lands ని రాష్ట్ర ప్రభుత్వపు భూములుగా భావిస్తున్నారా? అదేవిధంగా ఈ విధమైన భూములను జి.ఓ.ఎం.ఎస్.నెం. 166 ద్వారా రెగ్యులరైజ్ చేసే అవకాశం ఏమైనా ఉందా? అయినచో సంబంధిత అధికారులకు మీరు ఆదేశాలను ఇస్తారా అని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

ఉ. 10.40

శ్రీ ధర్మాన ప్రసాదరావు (రెవిన్యూశాఖ మంత్రి):- అధ్యక్షా, గౌరవ సభ్యులు భూపాల్ రెడ్డి గారు అడిగిన శిఖం ల్యాండుకు సంబంధించి శిఖం ల్యాండు చేయడం అనే దాని గురించి సుప్రీం కోర్టు ఆర్డరు ఒకటి ఉన్నది. క్లియర్ డైరెక్షన్స్ ప్రభుత్వానికి ఉన్నాయి. ఇటువంటివి ప్రభుత్వం చేయడానికి అవకాశం లేదు. అయితే

ఇటువంటి కేసులు కొన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చూసి చేయవలసిన అవసరం ఉన్నది. జి.ఓ. 166 లో చేయడానికి ఇది ఎంత మాత్రం అవకాశం లేనటువంటిది. ఇది పర్యావరణం మరియు ఇతర పరిస్థితులకు ఎకలాజికల్ బ్యాలెన్సు దెబ్బ తింటుందని సుప్రీం కోర్టు ఇచ్చిన డైరెక్షన్స్ మేరకు ఇట్లాంటివన్ని బాగా డిస్‌కరేజ్ చేస్తుంది. ఈ కేసు అయితే చాలా జెన్యూయిన్ కేసు. వారు చెప్పినట్లుగా ఇప్పుడు 5,600 ఇళ్లు వచ్చేశాయి అని చెబుతున్నారు. దీని గురించి ప్రత్యేకంగా ప్రభుత్వానికి వారు విజ్ఞాపన పత్రం పంపించినట్లయితే, ఇది క్యాబినెట్ వరకు తీసుకు వెళ్లవలసిన అవసరం ఉంటుంది, ఇతర డిపార్టుమెంట్లతో చూడవలసి ఉంటుంది. కోర్టు పరిధి డైరెక్టన్స్‌కు సంబంధించి ఇది లోబడి ఉందా లేదా అని ఎగ్జామిన్ చేయవలసి వస్తే అది సెపరేట్‌గా చేద్దాం .

రెండవది assigned ల్యాండ్సుకు సంబంధించి 700 అప్లికేషన్స్ పెండింగు ఉన్నాయని చెప్పడం జరిగింది. మనం ఇచ్చినటువంటి జి.ఓ.నం. 166 కేవలం un-assigned government lands, జి.ఓ.నం . 166 క్రింద assigned lands ఏవీ కూడా రావు. ప్రభుత్వం assigned lands లో కూడా ఇళ్ల నిర్మాణం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉన్నది. అసలు నిజానికి ఆ ఉద్దేశ్యంతోనే ఈ రెగ్యులరైజేషన్ టేకప్ చేయడం జరిగింది. హైదరాబాదు చుట్టూ గత నాలుగు అయిదు సంవత్సరాల క్రితం assign చేసినటువంటి భూములు వ్యవసాయం నుంచి పట్టణ ప్రాంతంగా మారిపోయాయి. ఒకప్పుడు అవి అసైండ్ చేయబడ్డాయి. అందులో ఉన్నటువంటి వాటిని POT Act ప్రకారం తొలగించాల్సి ఉన్నది. దీని ప్రకారం తొలగిస్తే వేలాది ఇళ్లు నేల మట్టం చేయాల్సి ఉంటుంది. Moreover ఆ భూమి వ్యవసాయానికి పనికి వచ్చే భూమి. ప్రాక్టికల్ అప్రోచ్‌తో ప్రభుత్వం అది అసైన్ చేయాలి. అసైన్ చేసిన ల్యాండ్సు రెగ్యులరైజ్ చేసి పట్టణ ప్రాంతాలు చేయాలని అనుకుంటే దానికి సంబంధించి సవరణ తీసుకురావడం కూడా జరిగింది. POT Act No.77 ను సవరణ తీసుకువచ్చిన తర్వాత ఇది చేయడానికి ప్రయత్నం చేసినప్పుడు కోర్టు ఈ లెజిస్లేటివ్‌పై ఒక స్టే ఏర్పడితే, ప్రస్తుతానికి దాని గురించి వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఫైనల్ జడ్జిమెంటు వచ్చిన తర్వాత దాని మీద నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది, అంతవరకు వెయిట్ చేయాల్సిందే. 166 క్రింద మాత్రం ఇది కవర్ కాదు. 166 క్లియర్‌గా అది అన్-అసైండ్ ల్యాండ్సుకు మాత్రమే పరిమితమైంది

వెంకట రమణగారు అడిగిన దానికి గ్రామీణ ప్రాంతాలలో కూడా ఇది వర్తిస్తుంది. పట్టణ ప్రాంతాలు అని ఎక్కడా పేర్కొనలేదు, దాన్ని గురించి క్లారిఫికేషన్స్ సంబంధిత అధికారులను అడిగితే సి.సి.ఎల్.ఆర్ లెవల్‌లో గాని, గవర్నమెంటు లెవల్‌లో గాని దాన్ని క్లారిఫై చేయడం జరుగుతుంది. ఎవాక్యు ప్రాపర్టీస్‌కు సంబంధించి 2005లో రిపీల్ అయింది, ఇది సెంట్రల్ యాక్టు, కేంద్ర ప్రభుత్వం ఆ యొక్క భూములన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పజెప్పడం జరిగింది. అయితే ఎవాక్యు ప్రాపర్టీస్‌ను రెగ్యులరైజ్ చేస్తారా లేదా అని అడగడం జరిగింది. రెగ్యులరైజ్ చేయడానికి అవకాశం ఉంది. కాని ఎటువంటివి చేస్తారంటే ఏవైతే క్లెయిమ్స్ ఇంకా సెటిల్ కానటువంటివి, క్లెయిమ్స్ ఉన్నటువంటివి విడిచిపెట్టి ఎలాంటి క్లెయిమ్స్ లేనటువంటివి, క్లియర్‌గా ప్రభుత్వానికి ఉన్నటువంటివి మాత్రం అట్లాంటి అప్లికేషన్స్ ఏవైనా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అది 166 క్రింద కవర్ అవుతుంది. ఇమ్మీడియట్‌గా అధికారులకు దాని మీద ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది.

శ్రీ వి. భూపాల్ రెడ్డి:- అధ్యక్షా, మీ ద్వారా నేను మంత్రి గారిని కోరేది ఏమిటంటే కొంచెం mis-understanding అనిపిస్తుంది. నేను ఏమంటున్నానంటే అమీన్‌పూర్ గ్రామంలోపట గవర్నమెంటు ల్యాండ్సులోనే అందరు గుడిసెలు వేసుకుని రెగ్యులరైజ్ చేసుకున్నారు, సర్పంచులు దాని మీద పర్మీషన్ ఇచ్చారు.

అమీన్‌పూర్ గ్రామంలోపట అటువంటి వాటికి మాత్రమే నేను రెగ్యులరైజ్ చేయమని అడుగుతున్నాను. రామచంద్రాపూరం దగ్గరలో ఉన్న బండ్లగూడ అనే గ్రామం మాత్రం అది నిజంగానే కుంట, శిఖం భూమిలోనే ఉన్నాయి. నేను మీద్వారా మంత్రి గారిని కోరేది ఏమిటంటే రెవెన్యూప్రిన్సిపాల్ సెక్రటరీ గారిని పంపించండి, నిజంగా అక్కడ ఒక కుంట గాని, పార్కు గాని ఉందా లేదా, లేదంటే అక్కడ ఏమైనా నీళ్లు నిలుస్తున్నాయా లేదా అనే మాట కూడా వెరిఫికేషన్ చేసి, నిజంగా ప్రజలంతా పక్కా ఇళ్లు కట్టుకుని, సి.సి రోడ్లు వేసి , కరెంటు మొదలైనవన్ని బిగించిన తర్వాత దాన్ని రెగ్యులరైజ్ చేయకపోవడం న్యాయం కాదని నేను కోరుతున్నాను అధ్యక్షా. ఇందులో చాలా మంది పేదవాళ్లు లాభపడతారు. అందువల్ల దయచేసి మీరు పై అధికారులను ఆదేశించండి. ఎందుకంటే ఇంతకుముందు నేను మండల్ ప్రజా పరిషత్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు కుంట భూమిని, శిఖం భూమిని రెగ్యులరైజ్ చేయించాను. అటువంటి భూమిలో మండల ప్రజాపరిషత్ బిల్డింగు కట్టాము, అంతే కాకుండా ఆఫీసు బిల్డింగులన్ని అక్కడకు రావడం జరిగింది. దయచేసి ఇది కూడా అదే విధంగా చేసి వాళ్లకు రెగ్యులరైజ్ చేయమని కోరుతున్నాను.

MR.CHAIRMAN:- Whatever you want, you give a representation

శ్రీ ధర్మాన ప్రసాదరావుః-అధ్యక్షా, దీంట్లో నేను క్లియర్‌గానే చెప్పాను. ఒకటి శిఖం ల్యాండు అయితే సెక్షన్ 166 క్రింద మాత్రం అది టేకప్ చేయడానికి వీలు పడదు. సెపరేట్‌గా గవర్నమెంటు అది ఎగ్జామిన్ చేయవలసి వస్తుంది. అంతే కాకుండా అది క్యాబినెట్ డెసిషన్ తీసుకోవలసి వస్తుంది. అందుకోసం ఒక సెపరేట్ రిప్రజెంటేషన్ ప్రభుత్వానికి వస్తే అది ఎగ్జామిన్ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటాం. రెండవది విలేజ్ సైట్ అన్నారు, అది 166 క్రింద కవర్ అవ్వకపోతే అధికారులు దీని క్రింద చేయలేరు. వారు చెప్పినటువంటిది మళ్లీ ఒకసారి పరిశీలించమని చెబుతాను. అందులో ఫిటెన్ అయితే తప్పకుండా కన్‌సిడర్ చేస్తారు. ఫిటెన్ అవుతుందా లేదా అనేది వెంటనే నేను హౌజ్‌లో చెప్పలేను. తర్వాత వివరాలు అన్నింటిని క్రింది స్థాయి అధికారులను పరిశీలించమని చెబుతాను.

## హైదరాబాదులో అకడమిక్ క్లబ్బింగ్ కారణంగా పాఠశాలల మూసివేత

ప్రశ్న నెం . 15(2214)
శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడి:

గౌరవనీయులైన పాఠశాల విద్యా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) హైదరాబాదులో అకాడమిక్‌ను క్లబ్ చేసే పేరిట 282 పాఠశాలలను మూసివేస్తున్న విషయం వాస్తవమేనా;

ఆ) ఉపాధ్యాయుల ఆందోళన సందర్బంగా విద్యా శాఖ మంత్రిగారు పాఠశాలలు వేటిని మూసివేయడం లేదన్న వివరణ ఇచ్చిన విషయం వాస్తవమేనా;

ఇ) ప్రజా ప్రతినిధుల సూచనల ప్రకారం అవసరమైన ప్రదేశాలకు పాఠశాలలను మార్చడమవుతుందా;

ఈ) జి.ఓ.ఎం.ఎస్.నెం .76 ప్రకారం ఉన్నత పాఠశాలలోకి 6వ, 7వ తరగతులను మాత్రమే తరలించాలన్న విషయం, ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలనే విషయం వాస్తవమేనా;

అయితే, జి.ఓ.ను అమలు చేయకపోవడానికి గల కారణాలు ఏమిటి?

పాఠశాల విద్యాశాఖ మంత్రి (శ్రీ సి. దామోదర రాజనరసింహ) :

అ) లేదండీ

ఆ) లేదండీ

ఇ) అవునండీ

ఈ) అవునండీ

యుపిఎస్‌లకు చెందిన 6వ, 7వ తరగతులను మాత్రమే తరలించడమయింది. ప్రభుత్వ ఉత్తర్వులను వేటిని ఉల్లంఘించలేదు.

శ్రీ పోచింరెడ్డి సుబ్బారెడ్డి (కడప, అనంతపూర్, కర్నూల్)ః అధ్యక్షా, మంత్రిగారు మరి ఆయన దగ్గర సమాచారం లేకనో, అధికారుల నుంచి సమాచారం అందకనో లేదండీ, లేదండీ, అవునండీ, అవునండీ సమాధానం చెప్పడం చాలా బాగుందండి. దయచేసి దీన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ ప్రశ్నను రెయిజ్ చేయడం జరిగింది. ఈ సమాధానానికి నేను సంతృప్తి చెందడం లేదు. వెయ్యి మురికి వాడలను ఐడెంటిఫై చేసి మంత్రి గారికి సమర్పించారు. వాటిలో కొత్తగా స్కూల్స్ ఓపెన్ చేసేటటువంటి పరిస్థితి ఇంతవరకు లేదు. మూసిన పాఠశాలలను అధికారులు అక్కడ మేం ఓపెన్ చేస్తామని చెప్పారు. కాని ఇంత వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. హైకోర్టులో ప్రజా సంబంధంగా 282 స్కూల్స్ మూసివేసిన సందర్భంగా కేసు వేశారు. అక్కడకు ఇచ్చిన సమాధానం కూడా అధికారులు కౌంటర్ అఫిడవిట్ వేశారు. హైకోర్టులో వేసిన సమాచారం తప్పుడు సమాచారం అన్నమాట వాస్తవమా? నాలుగు నెలలుగా కౌంటర్ ఎందుకు వేయలేదు. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే ఇంకా ఈ స్కూల్స్‌ను మెర్జ్ చేయడం, క్లబ్ చేయడం, మూసివేయడం వలన హైదరాబాదు జిల్లాలో క్వాలిఫైడ్ అయినటువంటి నిరుద్యోగులు ఇతర జిల్లాలకు నాన్-లోకల్‌గా ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. అంటే దాదాపు 2,200 పోస్టులు ఇక్కడ క్రొత్త డి.యస్.సికి రావలసినటువంటివి కేవలం 281 మాత్రమే క్రొత్త డి.యస్.సిలో ఇవ్వడం జరిగింది. అధ్యక్షా, వారి దగ్గర సమాచారం లేకపోతే స్కూలు వారీగా నేను రిపోర్టులు కూడా తెచ్చాను. మంత్రిగారికి మీ ద్వారా నేను అందజేస్తాను. ఇక్కడ క్లబ్బింగ్ చేసేటప్పుడు చాలా దగ్గరగా ఉన్నాయి కాబట్టి దూరంగా ఉన్న వాటికి అని చెప్పారు. నలభై పాఠశాలలు రెంటు కట్టలేక మూసివేశారు. అలాగే 79 పాఠశాలలు అంటే కాంపౌండ్‌లోనే చుట్టు ప్రక్కల్లోనే నాలుగు అయిదు పాఠశాలలు ఎందుకు ఉండాలి, ఒకటిగా క్లబ్ చేస్తే బాగుంటుందన్న ఉద్దేశ్యాన్ని వారు వ్యక్తపరిచారు. కాని మేము డేటా వారికి సమర్పిస్తాము. 2 కిలో మీటర్ల దూరంలో ఉండేటటువంటివి, 1 1/2 కిలో మీటర్ల దూరంలో ఉండేవి, ఒక కిలో మీటరు దూరంలో ఉండేటటువంటివి, అంటే హైదరాబాదు సిటీలో కిలో మీటరు దూరం అంటే పిల్లలు ఒక రోడ్డు నుంచి ఇంకొక రోడ్డు దాటడానికే ఇబ్బందికరమైనటువంటి పరిస్థితులలో 79 పాఠశాలలను, అంటే దూరంగా ఉన్న పాఠశాలలను, అర కిలో మీటరు, కిలో మీటరు, కిలో మీటరున్నర, 100 మీటర్లు, 500 మీటర్లు ఉన్నటువంటి స్కూళ్లను కూడా ఇందులో మెర్జ్ చేయడం జరిగింది. వాటి సమాచారం గురించి మంత్రి గారికి అధికారులు ఏం సమాచారం ఇచ్చినా గాని చాలా సింపుల్‌గా లేదండీ, లేదండీ, అవునండీ, అవునండీ అంటారు. ఇది మంత్రిగారు ఇచ్చినటువంటి సమాధానం. మీకు కావలసినటువంటి సమాధానం నేను మీ ద్వారా మంత్రిగారికి అందజేస్తానని తెలుపుతున్నాను.

శ్రీ పాటూరి సుధాకర్ రెడ్డి:- అధ్యక్షా, హైదరాబాదు నగరంలో బోరబండ ప్రాంతం గురించి ప్రజా ప్రతినిధులందరం గతంలో విద్యాశాఖ మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చాం. అక్కడ ఉర్దూ మీడియం చదువుకునే పిల్లలు ఎక్కువగా ఉన్నారు. అక్కడు పోస్టులు మంజూరు చేయమని కోరాము. హైదరాబాదు పాత నగరంలో ఉన్నటువంటి పోస్టులను వాటికి షిఫ్ట్ చేయమని కోరాము. అయినప్పటికి కూడా ఇంత వరకు షిఫ్ట్ చేయడం జరగలేదు. కాబట్టి ఉర్దూ మీడియం చదువుతామని ముందుకు వస్తున్న పిల్లలందరి గురించి పోస్టులు మంజూరు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదా? ఎందుకంటే టీచర్లు ఉన్నప్పటికీ కూడా ఆ యొక్క టీచర్లను సర్దుబాటు చేయకుండా, ఆ పిల్లలకు న్యాయం జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో స్పష్టపరచవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సి. దామోదర రాజనరసింహ: - అధ్యక్షా, గతంలో కూడా గౌరవ సభ్యులు సుబ్బారెడ్డి గారు మా దృష్టికి ఈ యొక్క అకాడమిక్ క్లబ్బింగ్ అంశాన్ని తీసుకువచ్చారు. ప్రధానంగా జంట నగరాలకు సంబంధించి ఒకే ఆవరణలో యావరేజ్‌గా సగటున మూడు, నాలుగు స్కూల్స్ ఉండటం, సంఖ్య తక్కువ ఉండటం, అయిదు మంది, పది మంది, పదిహేను మంది పిల్లలు, ముగ్గురు టీచర్లు ఉండడము దీనివల్ల మనం పటిష్టపరచలేకపోతున్నామనే ఉద్దేశ్యంతో, సక్సెస్ స్కూల్స్‌ను స్ట్రెంతెన్ చేయాలనే ఉద్దేశ్యంతో ఒకే ఆవరణలో ఉండి, క్లబ్ చేసిన ప్రైమరీ పాఠశాలల సంఖ్య 77, సమీపంలో ఉండి క్లబ్ చేసిన పాఠశాలల సంఖ్య 43, అకాడమిక్ క్లబ్బింగ్ చేసిన మొత్తం ప్రైమరీ పాఠశాలల సంఖ్య 120, ఒకే ఆవరణలో ఉండి క్లబ్ చేసిన హైస్కూల్స్ సంఖ్య 10, సమీపంలో ఉండి క్లబ్ చేసిన హైస్కూళ్ల సంఖ్య 5, అకాడమిక్ క్లబ్బింగ్ చేసిన మొత్తం హైస్కూల్స్ సంఖ్య 15.

ఉ. 10.50

ఆరు, ఏడు తరగతులకు సంబంధించిన సక్సస్ పాఠశాలను సమీపంలో వున్న హైస్కూళ్లకు షిఫ్టు చేయడం జరిగింది. జనరల్‌గా జి.ఓ.యం.యస్. నెంబర్.76 యొక్క ప్రధాన ఉద్దేశమేమిటంటే రెండు కిలోమీటర్ల దూరంలో వున్న అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లోని ఆరు, ఏడు తరగతులను సమీప హైస్కూళ్లకు షిఫ్టు చేయడమేనని, అందులోని ఉద్దేశం అదే కానీ వేరేది కాదని ఈ సందర్భంగా నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని చొప్పున, మొత్తం ఐదు తరగతులకు ఐదు మంది చొప్పున విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ విద్యా బోధనను పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ విషయం ప్రజా ఆమోదం పొందినదా అనే విషయానికొస్తే, ఈ విషయాన్ని హైదరాబాద్‌లో డి.డి.ఆర్.సి. సమావేశంలో కూలంకషంగా చర్చించి, ఆమోదం పొందినదని నేను గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. దీనిపై ప్రత్యేకంగా జిల్లా కలెక్టరు గారు, మా శాఖ జిల్లా విద్యాశాఖాధికారి గారు ప్రతి స్కూల్‌ను పర్యవేక్షించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. రెండవ విషయానికొస్తే, గౌరవ సభ్యుడు, శ్రీ పాటూరి సుధాకర్‌రెడ్డి గారు అడిగినట్టుగా జంటనగరాలకు సంబంధించిన స్కూళ్లలో ఉర్దూ టీచర్ల సంఖ్యను డి.యస్.సి.లో పెంచుతారనే విషయంలో, ప్రభుత్వం వద్ద ప్రతిపాదన వున్నది. త్వరలో జంటనగరాలకు సంబంధించిన పాఠశాలల్లో ఉర్దూ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, యస్.జి.టి.ల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ పోచింరెడ్డి సుబ్బా రెడ్డి : అధ్యక్షా, వారు స్లమ్ ఏరియాల్లో ఇక్కడ మూసివేసినటువంటి స్కూళ్లను పెడతామని అన్నారు. వాటి విషయం మంత్రి గారు చెప్పలేదు. మేము సభా సంఘం ద్వారా వెయ్యి స్కూళ్లను స్లమ్ ఏరియాల్లో గుర్తింపుచేసి ఇచ్చాం. అందుచేత నేను గౌరవ పాఠశాల విద్యా శాఖ మంత్రి గారిని మీ ద్వారా

కోరేదేమిటంటే, సత్వరంగా సంబంధిత విద్యా శాఖాధికారులతో గానీ, యూనియన్ నాయకులతో గానీ మంత్రి గారు ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, దీన్ని పూర్తి సక్సెస్ చేయాల్సిన బాధ్యత గౌరవ మంత్రి గారిపైన వున్నదనే విషయాన్ని మీ ద్వారా వారికి తెలియజేస్తున్నాను.

శ్రీ సి.దామోదర్ రాజనర్సింహ : అధ్యక్షా, సంబంధిత యూనియన్ లీడర్లను సమావేశానికి ఆహ్వానించి, వారితో చర్చలు జరిపిన తరువాత దానిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## ట్రాఫిక్ నియంత్రణ పద్ధతి ఆధునికీకరణ

ప్రశ్న నెం. 16 (2224)
సర్వశ్రీ కసుకుల జనార్ధన్‌రెడ్డి, జి.తిప్పేస్వామి, కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్:

గౌరవనీయులైన హోం శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) యూరోపియన్ దేశాలలో అమలు పరుస్తున్నట్లుగా రాష్ట్రంలో సిగ్నలింగ్, ట్రాఫిక్, వాహన నియంత్రణ విధానాలను అమలు పరచాలని ప్రభుత్వం భావిస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, వాటి విధి విధానాలు ఏమిటి?

ఇ) సదరు ప్రాజెక్టుకు అయ్యే మొత్తం వ్యయం ఎంత?

హోం శాఖ మంత్రి (శ్రీ కె. జానారెడ్డి):

అ) రాష్ట్రంలో అట్టి యూరోపియన్ విధానాన్ని అమలు పరచడం లేదు. అయినప్పటికీ, ప్రభుత్వం, స్థానిక పరిస్థితులు, అవసరాలకు సరిపోయే విధానాన్ని అనుసరిస్తున్నది.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కసుకుల జనార్ధన్ రెడ్డి : అధ్యక్షా, మొదటి ప్రశ్నకు సంబంధించి మంత్రి గారి సమాధానం రాష్ట్రంలో అట్టి యూరోపియన్ విధానాన్ని అమలుపరచడం లేదని అంటున్నారు. సరే అయినప్పటికీ, ప్రభుత్వం, స్థానిక పరిస్థితులు, అవసరాలకు సరిపోయే విధానాన్ని అనుసరిస్తున్నదని చెప్పారు. అంటే ' అవసరాలకు సరిపోయే విధానాన్ని అనుసరిస్తున్నది ' అంటే ఏమిటి ? దాని తరువాత ' ఆ ' ప్రశ్నకు సమాధానం ' ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు ' అని, ' ఇ ' ప్రశ్నకు సమాధానం ' ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు ' అని గౌరవ మంత్రి గారు సమాధానం చెప్పారు. మరి 'అవసరాలకు సరిపోయే విధానాన్ని అనుసరిస్తున్నదనే' విషయాన్ని గూర్చి పూర్తి వివరంగా తెలియజేయవలసిందిగా నేను మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జి. తిప్పేస్వామి (అసెంబ్లి): అధ్యక్షా, హైదరాబాదులో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా వున్నదనే విషయం మీకు కూడా తెలిసిందే. ఉదయాన్నే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి నగరానికి వచ్చే ఆర్.టి.సి. బస్సులు మహాత్మాగాంధీ బస్టాండ్‌లో గంటల కొద్ది బస్సులు అక్కడ నిల్చి స్టక్ అవుతున్నాయి. ఉదయం గం. 5.30 లకు బస్సు వచ్చిననూ కూడా ఉదయం గం. 7.30 - 8.00 అయిననూ అక్కడ ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. ఆ విషయాన్ని కూడా గౌరవ మంత్రి గారి దృష్టికి నేను మీ ద్వారా తీసుకువస్తున్నాను. అదే విధంగా బెంగుళూరు టు హైదరాబాద్ రోడ్డును వైడనింగ్ చేస్తున్నారు. ఆ రూట్‌లో ఏ చిన్న యాక్సిడెంట్ జరిగిననూ కూడా కనీసం ఐదారు గంటలు వాహనాలు నిలబడిపోతూ, స్టక్ అవుతున్నాయి. పెట్రోలింగ్ పార్టీ పోలీసులు పర్యవేక్షిస్తున్నారని అంటున్నారు, కానీ ఎక్కడా కనిపించడం లేదు. మేము కూడా ఆ బారిన పడి, గంటల తరబడి నాలుగైదు గంటలు బస్సులోనే నిద్రపోయి ఉదయం గం. 5.30 లకు రావల్సిన మేము ఉ. గం. 11.00 - 12.00 లకు రావడం జరిగింది. కావున, దయచేసి ఆ యొక్క వ్యవస్థను కూడా సరిచేయవలసిందిగా నేను మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పాటూరి సుధాకర్ రెడ్డి : అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారిని కోరేదేమిటంటే రాష్ట్ర శాసన సభ మరియు శాసన మండలి సభ్యులు, ప్రజలు ఎక్కువగా నిత్యం ప్రయాణించేటటువంటి ప్రాంతాలైన లక్‌డీకాపూల్, రవీంద్రభారతి, అసెంబ్లి ప్రాంగణం, సచివాలయం నందు ఎప్పుడూ కూడ ట్రాఫిక్ జామ్ అవుతున్న విషయం వారికి కూడా తెలిసిందే. కాబట్టి ట్రాఫిక్‌ను నియంత్రించడానికి లక్‌డీకాపూల్ నందు గానీ, రవీంద్రభారతీ ముందుగానీ, లేకపోతే సచివాలయం ముందుగానీ ఏమైనా నియంత్రణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారా అని నేను మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.జానారెడ్డి : అధ్యక్షా, గౌరవ సభ్యులు, కసుకుల జనార్ధన్ రెడ్డి గారి ప్రధానమైనటువంటి ప్రశ్న వినూత్న పద్ధతిలో ట్రాఫిక్ నియంత్రించే విధానాన్ని ఏమైన అవలంభిస్తున్నారా అనేది. అందుకని నా సమాధానం లో 'ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు' అని చెప్పడం జరిగింది. ఆ విధానాన్నే అవలంభించడం లేదనప్పుడు, ఇక తరువాత మీరు వేసిన ప్రశ్నలకు సమాధానం ఏమి వుండదనే విషయాన్ని సభ్యులు గమనించవలసివుంటుంది. కానీ, ఆ యూరోపియన్ విధానాన్ని కాకుండా రాష్ట్రంలో ట్రాఫిక్ నియంత్రణకు అన్ని విధాలుగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలియజేస్తున్నాను. ఏది ఏమైనప్పటికి, ట్రాఫిక్ నియంత్రణ విధానంపై చర్చకు లాగి, అనేక విధాలుగా సమాధానాలు రాబట్టాలనేదే మన సభ్యుల యొక్క ప్రధాన ఉద్దేశం. ట్రాఫిక్‌ను నియంత్రించడానికీ, ఆ తరువాత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కలుగజేసేందుకై సుమారు 25 నుండి 30 అంశాలను అనుసరించడం జరుగుతోంది. వాటిని తమరి దృష్టికి పంపమంటే పంపుతాను. లేకపోతే వాటిని సభ్యుల సమక్షంలో చదువమంటే చదువగలనని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అందులో ముఖ్యంగా యూరోపియన్ విధానమే మన దగ్గర లేదు. అయితే ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ అనేది ఒక్క పోలీసు శాఖకు సంబంధించినదే కాదు. పోలీసు డిపార్టుమెంటు ఎన్‌ఫోర్స్ చేస్తుంది. ఆ విషయంలో ప్రధానంగా రోడ్లు వైడనింగ్ కావాలి. అలాగే రహదారులు భవనాల శాఖ, టెలిఫోన్, మునిసిఫల్ శాఖ మరియు ఇతర అనేక డిపార్టుమెంట్లతో కూడుకుని సమన్వయంతో పనిచేయాల్సి వుంటుంది. ఆ పని చేయడానికి అనేక సమావేశాలు జరిపి, ఆయా డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో మెజర్స్ తీసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని నేను సభకు మీ ద్వారా తెలియజేస్తున్నాను. ముఖ్యంగా సభ్యులు వెలిబుచ్చినట్టుగా రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరుగుతున్న జనాభాతో పాటు పెరుగుతున్న మాట వాస్తవమే. ప్రస్తుతం సుమారు 23 లక్షలకు పైగా వాహనాలు జంటనగరాల్లో రోడ్లపై తిరుగుతున్నాయి. దానికి తగ్గట్టుగా రోడ్లు వైడనింగ్ కావడం

లేదు. ఇది వాస్తవమే. దీన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఒక్కోసారి నియంత్రణ విషయంలో కొంత ఇబ్బందులు జరుగుతాయి. వీటిని కంట్రోల్ చేయడానికి ప్రైవేటు వాహనాలను గానీ, ప్రైవేటు బస్సులను సిటిలోకి ఎంటర్ కాకుండా దినంలో కొన్ని సమయాల్లో నిషేధాన్ని విధించాం. అట్లాగే జంటనగరాల్లో అవసరమైన చోట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే కొన్ని చోట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయి, వాటి మీద వాహనాలు ప్రయాణించుట మూలాన కొంత వరకు ట్రాఫిక్‌ను నియంత్రించడం జరిగిందని, కొన్ని ప్రస్తుతం నిర్మాణ దశలో వున్నాయి, మరికొన్నింటిని అవసరమైన చోట్ల క్రొత్తగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించుటకు గాను ప్రయత్నాలు జరుగుతున్నాయని నేను ఈ సందర్భంగా మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అట్లాగే జంటనగరాల్లో సుమారు 628 జంక్షన్స్‌ను జంటనగరాల్లో ఇంప్రూ చేసి, ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా ముఖ్యంగా వాహన డ్రైవర్స్‌కు స్పీడ్ కంట్రోల్ చేసే విషయంలో, లేక ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నిబంధనలను పాటించే విషయంలో వారి కోసం అవగాహన సదస్సులను ఏర్పాటు చేయడం జరుగుతోంది. అదే విధంగా డ్రంకన్ డ్రైవింగ్ విషయంలో, స్పీడుగా డ్రైవింగ్ చేసే విషయంలో బాధ్యులపై పోలీసులచే యం.వి.యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులను నమోదు చేయడం జరుగుతోంది. అంతే కాకుండా రోడ్డు ప్రక్కనున్న పుట్‌పాత్‌లను అక్రమంగా ఆక్రమించుకునే వారిని ప్రతి రోజు కౌన్సిలింగ్ చేయడం, కొంత మొత్తంలో వారికి జరిమాన విధించి, వారిలో అవగాహన పెంపొందించడానికి ప్రయత్నం జరుగుతోందని, ఈ విధంగా సుమారు 20, 30 మెజర్స్‌ను ప్రభుత్వం తీసుకుందని నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఉ. 11.00

ప్రధానంగా రెండున్నర కోట్ల రూపాయలతో ఈ అవగాహన కలిగించి, నియంత్రణకు సహకరించే విధంగా ప్రయత్నం చేస్తున్నామని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. అలాగే స్కూళ్ల యాజమాన్యాలకు, విద్యార్థులకు అవగాహన తీసుకురావడం, వన్ వే రూటు కొన్ని చోట్ల ఏర్పాటు చేయడం, కొన్ని చోట్ల కేవలం లెఫ్ట్ టర్న్ మాత్రమే కావాలని, రైట్ టర్న్ లేకుండా చేయడం ఇలాంటి అనేక రకాల మెజర్స్‌తో సాధ్యమైనంతవరకు ట్రాఫిక్‌ని కంట్రోలు చేస్తున్నామని నేను గౌరవసభ్యులకు మనవి చేస్తున్నాను. ఇంతేకాక మన ప్రక్కన ఉన్నటువంటి బెంగుళూరు, చెన్నై వీటితో పోల్చుకున్నప్పుడు హైదరాబాద్ నగరంలో నియంత్రణ స్వాధీనంలో ఉందని, ఇంతకంటే మెరుగైన విధంగా చేయడానికి కృషిచేస్తుందని, సభ్యులు ఏదన్న సలహాలు, సూచనలు ఇస్తే వాటిని దృష్టిలో ఉంచుకుని ఇంకా ముందుకు సాగుతామని తెలియజేస్తున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు :- అధ్యక్షా, ఈ ట్రాఫిక్ ఇదివరకటికంటె 2, 3 సంవత్సరాలుగా ఇంకా ఎక్కువగా ఉంటోంది. వాహనాల రాకపోకలు ఎక్కువైపోవడం వలన, ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్ళాలన్నా మినిమం గంట యావరేజ్‌గా ప్రయాణానికి సమయం తీసుకోవడం అవుతున్నది. బొంబాయిలో ఒక సిస్టం ప్రివేల్ అయి ఉన్నది. స్కూల్, ఆఫీస్ టైమ్స్, ఏవైతే ఉన్నాయో, వాటిని స్ప్లిట్ చేస్తున్నారు. వాటిని 9.00 గం.ల నుంచి 9.30 గంటలకు, 9.30 గం.ల నుంచి 10.00 గంటలకు అరగంట తేడాతో స్ప్లిట్ చేసి స్కూల్స్, ఆఫీస్ వర్కింగ్ అవర్స్‌ని స్ప్లిట్ చేయడం జరిగింది. దానివలన ట్రాఫిక్ స్ప్రెడ్ అవుతుంది. బొంబాయి నగరంలో ఉన్నటువంటి సిస్టం హైదరాబాద్ ట్రాఫిక్‌కి కూడా అవసరం వచ్చిందని చెప్పి, అనిపిస్తున్నది. కాబట్టి ఆ విషయాన్ని ఎగ్జామిన్ చేసి, దానిని ప్రవేశపెట్టినట్లయితే, కొంత ట్రాఫిక్‌ని స్ప్రెడ్ చేయడానికి అవకాశం ఉంటుందని నేను మీ ద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ :- ఇది పోయిన సారి చర్చకు వచ్చింది. పరిశీలిస్తామన్నారు.

శ్రీ కె. జానారెడ్డి :– సచివాలయం ముందుగానీ, శాసన మండలి ముందుగానీ, లకడీకపూల్ వైపుగానీ, ట్రాఫిక్ ఒత్తిడి ఎక్కువ ఉన్న విషయం, గౌరవ శాసన సభ్యులు తెలియజేసినారు, అందుకని వీటి ముందు ఎక్కువగా ట్రాఫిక్ పోలీసులను నియంత్రించడం జరిగిందని, అంతేకాకుండా సభలు, సమావేశాలు, లేకపోతే ఈ ప్రక్కన ర్యాలీలు ఎక్కువగా జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో ఇంకా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటున్నామని, లకడీకపూల్‌లో ఇంకా ఫోర్స్‌ని పెట్టి కంట్రోల్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ఇంకా ఎక్కువ చేస్తామని, అలాగే వీరభద్రరావుగారు చెప్పినట్లుగా స్కూలుకు టైమింగ్స్ ఇప్పటికే మార్చామని, ఇంకా మెరుగైన విధంగా స్ప్లిట్ చేసే విధానాన్ని అవలంబిస్తున్నారని, ఇంకా మెరుగైన విధంగా అవలంబించటానికి ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు.

<u>మత్స్యశాఖ కార్యనిర్వాహక ఇంజనీరు చే పనుల నిర్వహణ</u>

Q.No. 17 (2206)

MR. CHAIRMAN : Question No. 17 (2206) is postponed at the request of the Member.

<u>గులాబిరంగు రేషన్ కార్డుల మార్పు</u>

ప్రశ్న నెం. 18 (2331)
శ్రీ గిడుగు రుద్రరాజు,శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్:

గౌరవనీయులైన ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

(అ) ఆదాయ పరిమితిని పెంచడం ద్వారా రాష్ట్రంలో గులాబికార్డు నుండి తెల్లకార్డుగా మార్పు చేసేందుకు ప్రతిపాదించిన రేషన్ కార్డుల సంఖ్య ఎంత, ఇప్పటివరకు మార్పు చేసిన కార్డుల సంఖ్య ఎంత?

(ఆ) కొత్త కార్డుల జారీకి, అర్హతగల వ్యక్తులకు ఒక చోట నుండి మరో చోటికి కార్డుల బదిలీని చేపట్టాలని ప్రతిపాదిత చర్యలు ఏమిటి;

(ఇ) కార్డుల మార్పును ఎప్పటిలోగా పూర్తి చేయడమవుతుంది?

ఆహార, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజి, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ కాసు వెంకట కృష్ణారెడ్డి):

(అ) పెంచిన వార్షిక ఆదాయ పరిమితి ప్రకారం గులాబి నుండి తెల్ల రేషను కార్డులుగా మార్చడం కోసం 14,40,505 దరఖాస్తులు అందాయి. అందులో ఇప్పటివరకు 11,17,739 గులాబి కార్డులను తెల్లకార్డులలోకి మార్పిడి చేయడమయింది.

(ఆ) శాశ్వత డిపిఎల్ఎస్ వద్ద కొత్త రేషను కార్డులను జారీ చేయడమవుతున్నది. అంతేగాక, శాశ్వత డిపిఎల్ కేంద్రాల ద్వారా కార్డులను ఒక చోట నుండి మరో చోటికి మార్చాలని ఉద్దేశించడమయింది.

(ఇ) సాధ్యమయినంత త్వరలోనే ప్రస్తుతం మిగిలిన వాటిని పూర్తి చేయడం జరుగుతుంది.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ (అసెంబ్లి) :– తెల్లరంగు రేషను కార్డులుగా మార్చే ప్రక్రియలో గతంలో బిపిఎల్ కుటుంబాలు ఉన్న వారు కొంతమందికి గులాబి రంగు రేషను కార్డులు రాలేదనేటటువంటి కోరికతోటి, వారడగడంతోటి వారిని కూడా సర్వే చేసి, వారికి తెల్లరంగు రేషను కార్డులు ఇచ్చేటటువంటి ప్రక్రియను ప్రారంభించారు. దానితోపాటు ముఖ్యమంత్రిగారు సాహసోపేతంగా తీసుకున్న నిర్ణయం మేరకు 75,000 రూపాయలు అర్బన్ ఏరియాలో సీలింగ్ పెరగడంతోటి, ఇంకా చాలామంది కూడా తెల్లరంగు రేషన్ కార్డు పరిధిలోకి వచ్చారు. ఈ రకంగా చూసుకున్నప్పుడు రాష్ట్రం మొత్తం మీద మంత్రివర్యులు చెప్పినప్పుడు ఇంకా చాలా ఎక్కువగా తెల్లరంగు రేషన్‌కార్డులలోకి మార్చేటటువంటి అవసరం ఎక్కువగా ఉంది. ఒక్క రాజమండ్రి నగరంలో తీసుకుంటే 20,000 తెల్లరంగు రేషన్‌కార్డులు ఇవ్వవలసినటువంటి అవసరం ఉన్నది. అయితే డిపిఎల్ సెంటర్ల సంఖ్య వచ్చేటప్పటికి రాజమండ్రి నగరంలోనే ఒక డిపిఎల్ సెంటర్‌ను ప్రారంభిస్తే, తర్వాత మా కోరిక మేరకు మరో రెండు ప్రారంభించారు. రాష్ట్రం మొత్తం మీద చూసుకున్నప్పుడు డిపిఎల్ సెంటర్లు పెంచితే కానీ, ఇన్ని లక్షల గులాబీ రంగు రేషన్ కార్డులు తెల్ల రంగు రేషన్ కార్డులుగా ఎన్నికలలోపులోనే మార్చేటటువంటి అవకాశం లేదు కాబట్టి దయచేసి మంత్రివర్యులను కోరేదేమిటంటే, డిపిఎల్ సెంటర్ల సంఖ్యను పెంచి, తెల్లరంగు రేషన్‌కార్డులుగా మార్చేటటువంటి ప్రక్రియను త్వరితగతిన ఇచ్చే ఏర్పాటు చేపట్టవలసిందిగా తమరి ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ జి. తిప్పే స్వామి :– అధ్యక్షా, ఇందిరమ్మ కార్యక్రమంలో ఇండ్లు శాంక్షన్ అయినా కూడా రేషన్ కార్డులు ఉంటేనే ఇస్తామంటున్నారు. ఇంతకు ముందు రేషన్ కార్డులు ఇచ్చినప్పుడు జాయింట్ ఫ్యామిలీలో ముగ్గురు, నలుగురు కలిసి ఒకే ఫ్యామిలీలో ఫోటోలు తీయించుకున్నారు. ఇప్పుడు బైఫర్‌కేషన్ ఆఫ్ కార్డ్స్ కావాలంటే, వాళ్ళు సాఫ్ట్‌వేర్ లేదు, రాలేదని దాదాపు 6 నెలలనుంచి రెవెన్యూ డివిజన్‌లో పెట్టినటువంటి డిపిఎల్ సెంటర్లో చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో పెదగొండ డివిజన్ 30 మండలాలతో కూడుకున్నటువంటిది. అటువంటిచోట ఒకటే రెవెన్యూ డివిజనల్ సెంటర్ ఉంది. అలా కాకుండా దయచేసి కాన్సన్‌ట్రేషన్ పెట్టండి. ఆ తరువాత వైఫర్‌కేషన్ ఆఫ్ కార్డ్స్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్ ఏదైతే ఐ.టి. కంట్రోల్‌లో ఏవైతే పెట్టదలచుకున్నారో అది వెంటనే రిలీజ్ చేస్తే దాదాపు ఇండ్లు శాంక్షన్ పత్రాలు ఇచ్చినా కూడా వాళ్ళు ఇళ్లు కట్టుకోకుండా ఉన్నారు. మంత్రి గారు త్వరలోనే రిలీజ్ చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు :– అధ్యక్షా, ఈ గులాబీ కార్డులను తెల్ల కార్డులుగా మార్చారు. అయితే చాలామంది అనేది ఏమిటంటే మార్చినటువంటి కార్డులకు రేషన్ ఇవ్వడంలేదని చెపుతున్నారు. అసలు ఎందుకు రేషన్ ఇవ్వడం లేదు, ఎప్పటినుంచి రేషన్ ఇస్తారు అనేది ఒక అంశం. రెండవది ఏమిటంటే అసలు ఈ గులాబీ కార్డులు అనేటటువంటిది ఏమైనా ఇస్తున్నారా, ఇస్తే అది షో కేసుల్లో పెట్టుకోవడానికి ఉపయోగపడుతున్నది తప్ప ఏ విధంగానూ ఉపయోగపడడం లేదు. గులాబీ కార్డులకు కూడా ఏమైనా ఇతరత్రా సప్లై చేసేటటువంటి ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఏమైనా ఉన్నదా అని తెలియజేయవలసిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ఆర్. వెంకట రామారెడ్డి (నిజామాబాద్):- అధ్యక్షా, మంత్రిగారిని కోరేదేమంటే ఇంతకు ముందు ఏదైతే ఫోటోలు తీసిన డిపిఎల్ సెంటర్లు ఉన్నాయో ఆయా సెంటర్లలో చాలా చాలా కాలిపోయినాయి. ఆ కాలిపోయిన తరువాత వాళ్ళకి ఆల్టర్‌నేట్ ఎరేంజ్‌మెంట్స్ చేయకుండా ఏమీ ఇవ్వలేదు. కేవలం నెంబర్లు ఇచ్చి సివిల్ సప్లయ్స్ శాఖ నుంచి వాళ్ళకి రేషన్ ఇవ్వడం జరుగుతోంది. రేషన్ ఇవ్వడం జరుగుతోంది కానీ, మిగిలిన వాటికి తప్పనిసరిగా కార్డ్ కావాలని, 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' కానీ, ఇతరమైన వాటికి కూడా కార్డులు తప్పనిసరిగా కావాలని అంటున్నారు. కనుక తమరి ద్వారా కోరేదేమంటే ఆ కార్డులను త్వరగా ఇప్పించవలసిందిగా మీ ద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కాసు వెంకట కృష్ణా రెడ్డి :- అధ్యక్షా , మా ప్రభుత్వం రాకముందు సామాజిక దృక్పథంలో ముఖ్యంగా గ్రామీణ వ్యవస్థలో రైతు, రైతు కూలీ ఆర్థిక వెసులుబాటు లేని పరిస్థితికి వెళ్లినప్పుడు మే 14, 2004న గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొట్టమొదటి మంత్రివర్గ సమావేశంలోనే అర్హత కలిగిన ప్రతివాళ్ళకి తెల్ల కార్డు ఇచ్చి తీరాలి అని నిర్ణయించాం. సామాన్య మానవుడికి ఆహార భద్రత కల్పించడం కనీస ప్రభుత్వ బాధ్యత. జాతి పిత మహాత్మాగాంధి ఈ సమాజానికి రెండుకళ్ళు రైతు, రైతు కూలీ అని చెప్పారు. ఆ వలసలు తగ్గించాలి. ఆ గ్రామాలు వారికి తీసుకురావాలి. తద్వారా పంట పెరగాలి. సమాజం భద్రంగా ఉండాలి అనేటటువంటి ఆలోచనకి పెద్ద ప్రక్రియకు శ్రీకారం చుట్టి, 140 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి, భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఈ ఐరిష్ విధాన ప్రక్రియకు ఈ రాష్ట్రంలో శ్రీకారం చుట్టాము. తద్వారా కోటి 88 లక్షల తెల్లకార్డు దారులు, 39 లక్షల పింకు కార్డుదారులు, వెరసి ఈ రాష్ట్రంలో 2 కోట్ల 27 లక్షల కుటుంబాల వారికి రేషను కార్డులు ఇవ్వడం జరిగింది. గౌరవ సభ్యులు చెప్పినట్లు పింకు కార్డుల వారికి కూడా కొంత సహకారాన్ని అందించాలని అనుకుంటున్నాం. మధ్య తరగతి కుటుంబాలలో ఉన్నటువంటి వారికి ఇంకా ఆర్థిక వెసులు బాటు కలగలేదన్న దృష్ట్యా, 1,783 కేంద్రాలను ప్రారంభించి, మనిషి ఒక్కరికి 5 కేజీలు చొప్పున బిపిటి, సోనా మసూరి బియ్యం ఇచ్చే ఏర్పాట్లను ప్రారంభించాము. సుమారు 3 లక్షల క్వింటాళ్ళ బియ్యాన్ని పంపిణీ చేయడం జరిగింది.

ఉ. 11.10

సుమారు మూడు లక్షల మందికి బియ్యం పంపిణి చేయడం జరిగింది. ఈ మధ్య కాలంలో గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రజల మనిషిగా సమాజంలో ఇందిరమ్మ గృహాలకు సంబంధించి రాజీవ్ పల్లెబాటలో వెళ్లినప్పుడు పేద గృహాలలో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దానికిగాను ఒక ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేసి ఒకేసారి సంవత్సర ఆదాయం రు.24,000 ని రు.74,000 వరకూ చేసిన ప్రక్రియకు శ్రీకారం చేయడం జరిగింది. ఆ తరువాత 100 డిపిఎల్ సెంటర్స్‌ని మొదటి సారిగా దేశంలోనే డివిజిన్ హెడ్‌క్వార్టర్స్‌లో పర్మనెంట్‌గా డిపిఎల్ సెంటర్‌ని పెట్టాలని నిర్ణయించాం దీని వల్ల కార్డ్ లేని వారికి కార్డ్ ఇచ్చే ప్రక్రియ చేకూరుతుంది. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఆ వెసులుబాటు కల్పించాలని ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన మాట వాస్తవం. చిన్న చిన్న టెక్నికల్ ప్రాబ్లమ్స్ కొత్త విధానం కాబట్టి ఉన్నాయి. అందుకుగాను ఇంజనీర్లను అడుగుతున్నాము. ఖచ్చితంగా దానిని సరిదిద్ది సభ్యుల కోర్కె మీద కూపన్స్ ఈ నెలలో ఇస్తున్నాము. కార్డ్ ఇవ్వడం వేరు. కాపీలు ఇవ్వడం వేరు. ఈ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉన్న రాయితీలు అన్నింటికి వర్తిస్తుంది. త్వరలో ఆ ప్రక్రియ జరుగుతుంది.

<u>వంటగ్యాసు కనెక్షన్లు</u>

ప్రశ్న నెం: 19 (2194)
సర్వశ్రీ మసాల పద్మజ, చెన్నాడి సుధాకర్‌రావు, అనుముల రేవంత్ రెడ్డి

గౌ.న ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రంలో వంటగ్యాస్ కనక్షన్ల కోసం ఒక లక్షా పదివేలకు పైగా దరఖాస్తుదారులు వేచిచూస్తున్న విషయం వాస్తవమేనా?

ఆ) సింగిల్ సిలిండర్ ఉన్న 71 లక్షల మంది వినియోగదారులకు రెండవ సిలిండర్‌ను సమకూర్చనందున అసౌకర్యానికి గురవుతున్న విషయం దృష్టికి వచ్చిందా?

ఇ) అయితే, కొత్త కనక్షన్లు ఇవ్వడానికి, సింగిల్ సిలిండర్ వినియోగదారులకు రెండవ సిలిండర్ ఇవ్వడానికి తీసుకున్న చర్యలేమిటి?

ఆహార పౌర సరఫరాల శాఖామాత్యులు (శ్రీ కాసు వెంకటకృష్ణారెడ్డి):

అ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వంట గ్యాస్ కనక్షన్ల కోసం సుమారు 1.00 లక్ష దరఖాస్తులు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

ఆ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం 112 లక్షల ఎల్‌పిజి వినియోగదారులు ఉన్నారు. ఇందులో 34.32 లక్షల దీపం కనెక్షన్‌దారులు ఉన్నారు. వీరికి సింగిల్ సిలిండరును సమకూర్చడమయింది. 79 లక్షల మంది సాధారణ వినియోగదారులకుగాను 37 లక్షల మంది వినియోగదారులకు డబుల్ సిలిండర్లను సమకూర్చడమయింది. అంటే, 42 లక్షల మంది వినియోగదారులు మాత్రమే సింగిల్ సిలిండర్లు కలిగియున్నారు.

ఇ) రిజిస్ట్రేషను చేసుకున్న రెండు నెలల లోపల కొత్త కనక్షన్లను సమకూర్చడానికి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ఏర్పాట్లు చేస్తున్నాయి అయితే, దీపం కొత్త కనక్షన్లకు ప్రాధాన్యతను ఇస్తున్నందున పరిమిత పరికరాల లభ్యత మూలంగా డబుల్ బాటిల్ కనక్షన్ల విడుదలను పరిమితం చేయడమయింది.

డా. మసాల పద్మజ (అసెంబ్లి): 2007 జూలైలో గుంటూరు ప్రయాణంలో ఉన్నప్పుడు గౌరవ ముఖ్యమంత్రిగారు నా తెలుగు చెల్లెళ్ల కళ్లల్లో కన్నీళ్లు చూడకూడదనేది నా జీవితాశయమని అన్నారు. ఆ విధంగా కేంద్ర పెట్రోలియం శాఖామంత్రిని 30 లక్షల కనెక్షన్స్ ఇవ్వమని అడిగితే కేవలం మూడు లక్షల కనెక్షన్స్ మాత్రమే ఇవ్వడానికి ఒప్పుకున్నారు. చమురు కంపెనీ వారిని ఐదు లక్షల కనెక్షన్స్ ఇవ్వమంటే కేవలం మూడు లక్షలు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. అందులో ఒక లక్ష కనెక్షన్స్ శాంక్షన్ చేశారు. మొదటి ప్రశ్నకు ఒక లక్ష కనెక్షన్స్ పెండింగ్‌లో ఉన్నాయి, అవి ఇస్తామన్నారు. ఎప్పటిలోగా ఇవ్వడానికి చర్యలు తీసుకుంటారు. దాదాపు 42 లక్షల వినియోగదారులు సింగిల్ సిలెండర్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి రెండు నెలల్లో

ఇస్తామంటున్నారు. దీపం కనెక్షన్స్ ఉన్నవారికి ప్రియారిటి ఇచ్చి వారికి ఇస్తున్నామని అంటున్నారు. సింగిల్ సిలెండర్ వారిని ప్రియారిటి బేసిస్‌లో తీసుకొని రెండు సిలిండర్లు మంజూరు చేసి వీలయినంత త్వరగా చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

(అంతరాయం)

వంట గ్యాస్ సిలెండర్ మీద దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వనన్నట్లు కేంద్ర ప్రభుత్వం సిలెండర్ మీద రు.25 తగ్గించినా వినియోగదారులకు చెందడం లేదు. గతంలో కూడా రు.100 సబ్సిడీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు. ప్రతీ మీటింగ్‌లో ముఖ్యమంత్రి నా అక్కలు, నా చెల్లెళ్లని ప్రసంగాన్ని ప్రారంభించిన వారు చెల్లెళ్ల కన్నీళ్లు తుడచడానికి ఏమి చర్యలు తీసుకున్నారని ప్రభుత్వాన్ని తమ ద్వారా అడుగుతున్నాను.

శ్రీమతి సిహెచ్. గంగాభవాని (పశ్చిమగోదావరి)ః అక్కలు, చెల్లెళ్లు అంటే నిజమయిన ఆడపడుచుల పాలిట ఆప్తబంధువు మా ప్రియతమ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు. ఒక చిన్న విషయం తమ ద్వారా సభకు చెప్పదలచాను. 1994లో మేము అధికారం కోల్పోయినప్పుడు వంటగ్యాస్ ధర రు.108 మాత్రమే. మేము అధికారంలో ఉన్నప్పుడు విజయభాస్కరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1994లో తెలుగుదేశం పార్టీకి అధికారాన్ని ఇచ్చినప్పుడు రు.108 ఉన్న గ్యాస్ ధర 2004లో వారు అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండింతలు పెంచిన ఘనత వారికే చెందింది. కేవలం 2004 నుండి 2009 వరకూ గ్యాస్ ధర చూస్తే రు.305 ఉంది. అంటే, రు.50 దేశ వ్యాప్తంగా పెరిగితే ప్రియతమ ముఖ్యమంత్రి ఆడపడుచుల పాలిట నిజమయిన ఆప్తబంధువు కాబట్టి నా అక్కలు, చెల్లెళ్లు రు.50 అదనంగా చెల్లించకూడదని దేశ వ్యాప్తంగా ఆడపడుచులు రు.50 చెల్లిస్తున్నా కూడా రు.50 తగ్గించి కేవలం రూ.305 లకు గ్యాస్ సిలెండర్ ఇచ్చిన ఘనత వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారికే చెందిందని సభాముఖంగా చెబుతున్నాను. తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో రెండింతలు పెంచారు. రు.280 వరకూ పెంచిన ఘనత చంద్రబాబునాయుడుగారికే దక్కుతుంది.

(అంతరాయం)

శ్రీ కాసు వెంకట కృష్ణారెడ్డిః ఇద్దరి ఆడవారి మధ్యన నేను హెల్ప్‌లెస్.

శ్రీ అనుముల రేవంత్‌రెడ్డిః గంగమ్మ గారికి చాలా ప్రశ్నలు వస్తున్నాయి. సమాధానాలకు ఇంకా రెండు నెలలు ఆగాలి. ఎందుకంటే రాజకుమారి అక్కను తెస్తున్నాము. తాను సమాధానం చెబుతుంది. తప్పకుండా కొంచెం ఓపిక పట్టమనండి.

శ్రీమతి సిహెచ్. గంగాభవానిః 100 మంది అక్కలు ఉన్నా ఈ చెల్లి సమాధానం చెబుతుంది.

శ్రీ బి. చెంగల్‌రాయుడుః (*)

(అంతరాయం)

శ్రీ బొమ్మిడి నారాయణరావుః అధ్యక్షా, ఆ పదాన్ని రికార్డ్ నుండి తొలగించండి. ఆ పదం బాగా లేదు.

---

**(*)** Expunged as ordered by the chair.

MR. CHAIRMAN: I will verify it. I will look into the records.

శ్రీ అనుముల రేవంత్ రెడ్డిః అధ్యక్షా, వచ్చే సమావేశానికి మధ్యలో ఫెన్సింగ్ వేయవలసి వస్తుంది. తమ ద్వారా సూటిగా అడుగుతున్నాను. 2004 నుండి ఇప్పటి వరకూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీపం కనెక్షన్స్ ఎన్ని ఇచ్చారు? రెండవది, రు.304 ఉన్న సిలెండర్ ధరని కేంద్ర ప్రభుత్వం రు.25కి తగ్గించింది. అది వినియోగదారులకు పాసాన్ అవుతుందా? దానికిగాను ఈ ప్రభుత్వం మీద ఎంత భారం అవుతుంది? పాసాన్ చేస్తారా లేదా చేస్తే ఎప్పటిలోగా చేస్తారో చెప్పమనండి.

శ్రీ కాసు వెంకట కృష్ణారెడ్డిః గ్యాస్ సిలెండర్‌కి సంబంధించి చూసినట్లయితే, గౌరవ అధ్యక్షులుకానీ, మన సభ్యులు, అందరికి కూడా ఆహారం కావాలంటే ఇళ్లల్లో ఆడపడుచులు వంట వండాలి. గౌరవ చెల్లెలు మసాల పద్మజ చాలా చక్కగా చెప్పారు. గుంటూరులో ఒక బస్సు ప్రయాణంలో ముఖ్యమంత్రిగారు ఉన్నప్పుడు, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉన్న ఆయిల్ కంపెనీ వారు ఒకసారి క్రూడ్ ఆయిల్ ఇంటర్నేషనల్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని గత్యంతరం లేక రు.50 పెంచినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ ధరను పెంచినప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం తెలుగింటి ఆడపడుచుల మీద ఈ భారం పడరాదని జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రిగారితో మాట్లాడి, సంబంధిత మంత్రులతో మాట్లాడి, సివిల్ సప్లైస్ ప్రిన్సిపల్ సెక్రటరి, కమీషనర్ మాలకొండయ్యగారితో ఫోన్‌లో మాట్లాడి అక్కడిక్కడే రు.50 తగ్గించిన మాట వాస్తవమని పద్మజగారు ఒప్పుకున్నారు. చాలా సంతోషం. అందుకుగాను వారికి ధన్యవాదాలు.

ఉ. 11.20

దీని వల్ల మొత్తం దేశంలో పెరిగినా మన రాష్ట్రంలో మాత్రం రూ.304.43 పైసలకు వంట గ్యాస్ విక్ర యించడం జరిగింది. ఈ మధ్య కాలంలో ప్రపంచంలో క్రూడ్ ఆయిల్ తగ్గితే, తద్వారా గ్యాస్ కంపెనీల వారు ప్రభుత్వంతో చర్చలు చేసుకుని, రూ.25 తగ్గించిన మాట వాస్తవం. కాని ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ రూ.220 కోట్లు ఈ రాష్ట్ర ప్రభుత్వం తెలుగింటి ఆడపడచులకు కోటి 12 లక్షల కుటుంబాల వారికి ఆ భారం తొలగించిన మాట వాస్తవం కాదా ? గతంలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? అప్పుడు పెరిగింది కాబట్టి సబ్సిడీ ఇచ్చాము. ఇప్పుడు తగ్గింది కాబట్టి సబ్సిడీ తీసివేయాలి. కాని తెలుగింటి ఆడపడచుల మీద భారం పడకూడ దని, చుట్టు ప్రక్కల రాష్ట్రాలలో ఎక్కువ వున్నా మన రాష్ట్రంలో మాత్రం రూ.25 సబ్సిడీ ఇస్తూ, ఇప్పటి వరకూ రూ.304 కంటిన్యూ చేస్తున్నాము. దానికి ప్రతిపక్షం వారు సంతోష పడతారని ఆశిస్తున్నాను. అందరికీ చెబుతా రని నా హృదయ స్పందన ద్వారా వారికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అలాగే రేవంత్‌రెడ్డి గారు అడిగిన దానికి సమాధానం – ఏ ప్రక్రియ అయినా ప్రారంభమైన పుడు అన్నీ ఇవ్వడానికి మనం ప్రయత్నం చేస్తాము. 1999 లో ప్రారంభమైన ఈ ప్రక్రియ ఈవేళ ఈ రాష్ట్ర ప్రభుత్వం వచ్చేక 4 లక్షల 3 వేల మంది ఆడపడుచులకు అందించడం జరిగింది. ఈ సంవత్సరం ఆయిల్ కంపెనీ వారు స్టీలు రేటు పెరిగిపోయి, ప్రపంచం మొత్తం మీద సిలిండర్ కంపెనీలు మూత పడితే, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అధీనంలో వున్న ఆయిల్ కంపెనీలు సహకారం అందించకపోతే కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు చొరవ తీసుకుని ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వారిని నొప్పించి, మెప్పించి, ఆ శాఖ మంత్రిని కలిసి, ప్రధాన మంత్రి గారిని కలిసి 2,66,344 కొత్త కుటుంబాల వారికి ఈ ప్రక్రియను ఇవ్వడానికి ప్రణాళికను సిద్ధం చేశారు. ఇప్పటికే 80 వేల మందికి ఇవ్వడం జరిగింది. ఫిబ్రవరిలో ఒక లక్ష, మార్చిలో ఒక లక్ష కొత్త కనెక్షన్సు ఇస్తున్నామని తెలియజేస్తున్నాను.

డా. మసాల పద్మజ : అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.25 తగ్గింపు వినియోగదారులకు ఇస్తే సిలిండరు రేటు చాలా తక్కువ అవుతుందని ఆశ పడిన మహిళలు నిరాశకు గురయ్యారు. ఎన్నో వేల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ఈ ప్రభుత్వం కేవలం రూ.156 కోట్ల భారం మాత్రం పడే దానిని భరించడానికి ఏమి ఇబ్బంది? ఆ భారం మోసి, కనీసం మహిళల కన్నీళ్లను తుడిచి రూ.25 తగ్గింపును వినియోగదారులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ కాసు వెంకట కృష్ణా రెడ్డి : అమ్మా పద్మజ గారూ, నేను ముందే మనవి చేశాను. ఈ రూ.50ల సబ్సిడీ రేటు పెరిగినపుడు ఇచ్చాము. ఆ సబ్సిడీ తీసి వేస్తే ఇతర రాష్ట్రాలలో రూ.329.43 అయింది. ఈ రాష్ట్రంలో కూడా అదే రేటుకి విక్రయించాలి. కాని మా ప్రభుత్వానికి మనసుంది కాబట్టి, పేద వర్గాల సంక్షేమం చేయాలనుంది కాబట్టి, వారి హృదయ ఘోష మాకు తెలుసు కాబట్టి, తక్కువ రేటుకి, అనగా రూ.304కి ఇతర రాష్ట్రాలలో కంటే తక్కువకి ఇస్తున్నాము.

<u>ఎయిడ్స్ సోకిన పిల్లలకోసం బ్రిడ్జి పాఠశాలలు</u>

ప్రశ్న నెం.20 (2226)

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్, శ్రీ జి. తిప్పేస్వామి:

గౌరవనీయులైన సర్వశిక్షా అభియాన్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;

అ. రాష్ట్రంలో ఎయిడ్స్ బారిన పడినట్టి బాలల కోసం బ్రిడ్జి పాఠశాలలను నెలకొల్పే ప్రతిపాదన ఏదైనా వుందా;

ఆ. అయినట్లయితే, అందుకు సంబంధించిన విధి విధానాలేమిటి;

ఇ. ఎయిడ్స్ వున్నట్లు గుర్తించబడినట్టి బాలల సంఖ్య ఎంత?

సర్వశిక్షా అభియాన్, వయోజన విద్య, పౌర గ్రంథాలయాలు, ఎస్ఐఇటి శాఖ మంత్రి (శ్రీ ఎమ్. హనుమంత రావు) :

అ. అవునండీ.

ఆ. ఇంతవరకు ఎప్పుడూ పాఠశాలకు వెళ్లని, పాఠశాలకు వెళ్లకుండా మధ్యలో మానివేసినట్టి, సాధారణంగా 9-14 సంవత్సరాల వయోవర్గం లోని పిల్లల కోసం సర్వ శిక్షా అభియాన్ కార్యక్రమం కింద రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సులను (ఆర్.బి.సి.లు) నడపడమవుతున్నది. ఈ కేంద్రాలను బాల కార్మికులు, వీధి బాలలు, అనాథలు లేదా వారి కుటుంబాల నుండి పారిపోయి వచ్చిన ఇతర పిల్లలు లేదా ఆశ్రయం లేని పిల్లలు వంటి వారి

కోసం నడపడమవుతున్నది. రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సుల అంశం క్రింద హెచ్.ఐ.వి. (ఎయిడ్సుకు గురైన) పాజిటివ్ బాలల కోసం కూడా రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సులను నడపడమవుతున్నది. రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సు లకు యూనిటు వ్యయం ఏడాదికి ఒక్కొక్క విద్యార్థికి రూ.10,000 అవుతుంది. రెసిడెన్షియలు బ్రిడ్జి కోర్సు సాధారణ కాల అవధి 10 నెలలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంఘం సంరక్షణ క్రింద ప్రభుత్వే తర సంస్థల (ఎన్‌జివోలు) ద్వారా నడపబడుతున్న యాంటీ రెట్రో వైరల్ థెరపీ (ఎఆర్‌టి) కేంద్రాలతో సంయు క్తంగా కలిసి హెచ్ఐవి పాజిటివ్ (ఎయిడ్స్‌కు గురైన) బాలలకు వైద్య సాయాన్ని అందించడమవుతున్నది. హెచ్ ఐవి పాజిటివ్ కలిగిన బాలల కోసం ఈ రెసిడెన్షియల్ బ్రిడ్జి కోర్సులను ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జీవోల) ద్వారా నడపడమవుతున్నది.

ఇ. 2008-09 సంవత్సరంలో నాలుగు జిల్లాలు అంటే, కృష్ణా, కడప, కర్నూలు, వరంగల్‌లలో 276 మంది బాలలను చేర్చుకోవడ మయింది.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ : అధ్యక్షా, ఈ హెచ్ఐవి పాజిటివ్ పిల్లలను మనం ఎఫెక్టెడ్, ఇన్‌ఫెక్టె డ్‌గా రెండు రకాలుగా సెగ్రిగేట్ చేసుకోవలసి వస్తుంది. ఎవరైతే తల్లి గర్భం నుంచి ఇన్‌ఫెక్ట్ అవుతారో ఆ పిల్లలు ఇన్‌ఫెక్టెడ్ కిందకి వస్తారు. ఎవరి తల్లిదండ్రులు హెచ్ఐవి సోకి, ఎయిడ్స్‌గా రూపాంతరం చెంది చనిపోతారో, ఆ అనాథలైన వారి పిల్లలు ఎఫెక్టెడ్ అవుతారు. వారు హెచ్ఐవి పాజిటివ్ కానక్కర లేదు. కాని తల్లిదండ్రుల వల్ల ఎఫెక్ట్ అయ్యారు. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడం వల్ల అనాథలయ్యారు. ఇలా మనం సెగ్రిగేట్ చేసుకుని హెచ్ ఐవి ఎఫెక్టెడ్, ఇన్‌ఫెక్టెడ్‌గా సెపరేట్‌గా పెట్టే ఏర్పాటేదైనా మనం చేసుకుంటున్నామా?

రెండవది, యాంటీ రెట్రోవైరల్ థెరపీ గురించి మాట్లాడేరు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవ హారం. అయితే ఎవరైతే హెచ్ఐవి పాజిటివ్ పిల్లలున్నారో వారందరూ ఎయిడ్స్ పిల్లలుగా మనం చెప్పడానికి వీలు లేదు. హెచ్ఐవి పాజిటివ్ నుంచి ఎయిడ్స్‌గా రూపాంతరం చెందడానికి చాలా టైము పడుతుందని వైద్య వర్గాల వారు చెబుతున్నారు. ఇలా రూపాంతరం చెందే లోపు దానిని ఆపడానికి సిరీస్ ఆఫ్ కౌంట్స్ తీసుకుని, యాంటీ రెట్రోవైరల్ థెరపీ స్టార్టు చేయడం జరుగుతుంది. దీనికి సంబంధించి హెచ్ఐవి పాజిటివ్ పిల్లలు ఎంతమంది ఉన్నారు? వారిలో ఎయిడ్స్‌గా రూపాంతరం చెందిన వాళ్లెంతమంది ఉన్నారు? యాంటీ రెట్రో వైరల్ థెరపీ స్టార్టు చేసిన వారెంత మంది ఉన్నారు? అది అవసరం లేకుండానే ముందు అవకాశవాద జబ్బులేవైతే వస్తాయో వాటికి మందులు వాడుతున్న వారెంతమంది ఉన్నారు? ఈ రకమైన క్లియర్‌కట్ ఇన్ఫర్మేషనుతో వెడితేనే, ఇబ్బందులు లేని పరిస్థితులు వస్తాయి గానీ, హెచ్ఐవి పాజిటివ్ వారినందరినీ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుగా భావించినా అది ప్రమాదకరం అవుతుంది. అలాగే ఇన్‌ఫెక్టెడ్, ఎఫెక్టెడ్ పిల్లల్ని ఇద్దరినీ కలిపినా ప్రమాదకరమైన పరిస్థితి వస్తుంది. కాబట్టి దీని మీద మెటిక్యులస్ పరిశీలన చేస్తే గాని సక్రమమైన ఫలితాలనివ్వలేదనే ఆలోచనే దైనా ప్రభుత్వం చేస్తుందా? ఆ రకమైన విధానం ప్రకారం మనం వెడుతున్నామా అనే విషయాన్ని తెలియజేయా లని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పోచిరెడ్డి సుబ్బారెడ్డి : మీ ద్వారా గౌ. మంత్రి గారిని అడిగేది, ఎన్‌జీవోల ద్వారా ఆర్‌బిసిలను నడు పుతున్నామన్నారు. ప్రభుత్వపరంగా నడిపే అవకాశం ఏదైనా వున్నదా? ఇందులో ఎయిడ్స్ వ్యాధి సోకిన, తల్లి దండ్రులు చనిపోయిన పిల్లలు అందరినీ కలిపి ఒకే బ్రిడ్జి కోర్సు పెడతారా లేక సెపరేట్‌గా పెడతారా? ఈ నాలుగు జిల్లాలను ఐడెంటిఫై చేశామన్నారు, వీటిల్లో ఎన్ని సెంటర్సున్నాయి? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి?

శ్రీ జి. తిప్పేస్వామి : అధ్యక్షా, ఈ సందర్భంలో మంత్రి గారిని కోరేది, అనంతపురం జిల్లాలో ఇటువంటి బ్రిడ్జి స్కూల్సు పెట్టాల్సిన అవసరం ఉంది. దానితో బాటు బిల్డింగ్సు లేని స్కూళ్లు ఉన్నాయి. సర్వశిక్ష అభియా న్‌కి నిధుల సమస్య లేదు. దీనితో బాటు స్కూలు బిల్డింగ్సు కూడా మంజూరు చేయాలని కోరుతున్నాను.

శ్రీ ఎం. హనుమంతరావు : రాష్ట్రంలో మొత్తం 50 వేల మంది పిల్లలు ఎయిడ్స్ సోకిన వారుగా ఉన్నారని లెక్కలు ఉన్నాయి. టోటల్‌గా పిల్లలు గాని, పెద్దలు గాని 5 లక్షల 40 వేల మంది ఎయిడ్సు సోకిన వారున్నట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. ఎయిడ్సు పిల్లల కోసం మెడికల్ అండ్ హెల్తు వారు ఒక కార్యక్రమాన్ని నడుపుతు న్నారు. మొత్తం 20 వేల మంది పిల్లలు ఎయిడ్సు సోకిన వారు గాను, 30 వేల మంది ఎయిడ్సు సోకినట్లుగా నిర్ధారణ సరిగా లేనటువంటి వారు ఉన్నారు. ఇది క్లియర్‌గా మెడికల్ అండ్ హెల్తు వారికి సంబంధించిన ప్రశ్న. సర్వశిక్ష అభియాన్‌లో మొత్తం మేమయితే ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగింది. కృష్ణా జిల్లాలో ఎయిడ్సు పాఠశాల ప్రత్యేకంగా నూజివీడులో ఉంది. 50 మంది పిల్లలు అందులో ఉన్నారు. అట్లాగే కడపలో ప్రజా చైతన్య సేవా సంఘంలో 93 మంది పిల్లలున్నారు. అట్లాగే కర్నూలులో మెర్సీహోం అని ఆర్‌బిసి ఉంది. హెచ్‌ఐవి పిల్లలు 46 మంది వరకూ అందులో ఉన్నారు. వరంగల్‌లో లోధి ఆర్గనైజేషన్ కరుణపురంలో 52 మంది పిల్లలున్నారు.

ఉ. 11.30

ఈ మొత్తం 276 మంది హెచ్ ఐ.వి. సోకిన పిల్లలకు ఈ సెంటర్స్‌లో ప్రత్యేకంగా వీరికి వైద్య సదుపా యాలు కల్పించి చదువు చెప్పే కార్యక్రమం చేస్తున్నాము.

డా. కోల రాజ్యలక్ష్మి (నామినేటెడ్): అధ్యక్షా, నల్గొండ జిల్లాలోని యాదగిరి గుట్ట దగ్గర, పోలీసు శాఖ ద్వారా కొంత మంది ఎయిడ్స్ పాజిటీవ్ పిల్లలను గుర్తించి వారికి చదువు చెప్పించే నిమిత్తం బ్రిడ్జ్ స్కూల్ ని ఏర్పాటు చేశారు. దాన్ని సర్వ శిక్షా అభయాన్ కార్యక్రమం ద్వారా నడిపించారు. ఒక సంవత్సర కాలం జరిపిన స్కూల్లో ఎయిడ్స్ సంక్రమించిన పిల్లలతోబాటు, చుట్టు ప్రక్కల ఉన్న మిగతా పిల్లల్ని కూడా కలిపి చదువు చెప్పడం జరిగింది. అదే విధంగా మిగతా జిల్లాల్లో కూడా చేస్తే బాగుంటుంది. మెడికల్ అండ్ హెల్త్ శాఖ ద్వారా రిట్రోవైరల్ డ్రగ్స్‌ని వాడడం జరుగుతోంది. బ్రిడ్జ్ స్కూల్స్ సర్వశిక్షా అభయాన్ ద్వారా పెట్టడానికి అవకాశం ఉంది. నెల్లూరులో ఏర్పాటు చేసినందుకు అభినందిస్తున్నాను. ఆ స్కూల్‌ని పెట్టినందుకు హోం శాఖ వారికి ప్రైజ్ కూడా వచ్చింది. అదే విధంగా మిగతా జిల్లాల్లో కూడా సర్వ శిక్షా అభయాన్ ద్వారా పెడితే మరికొంత మంది పిల్లలు పాఠశాల విద్య అందించే వీలు కలుగుతుందని తెలియజేస్తున్నాను.

శ్రీ ఎమ్. హనుమంతరావు : తల్లిదండ్రులు ఉన్న పిల్లల్ని ఎవరూ కూడా ఈ బ్రిడ్జ్ స్కూల్స్‌లో చేర్చడం లేదు. ఎయిడ్స్ సోకి, దిక్కు లేని పిల్లల్ని మాత్రమే ఈ ఆర్.బి.సి.లో చేర్చడం జరుగుతోంది. మెడికల్ అండ్ హెల్త్ శాఖ, మా శాఖ కలిసి దీనిపై పునరాలోచన చేసి తప్పని సరిగా ఈ ఎయిడ్స్ సంక్రమించిన పిల్లలకు విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకొంటున్నామని తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: There are some announcements to be made. Let me read them out.

<u>ప్రకటనలు</u>

**i) ప్యానల్ వైస్ ఛైర్మన్ నియామకం గురించి**

I am to announce to the House that I have nominated the following Members to be on the Panel of Vice-Chairmen for the Seventh Session:

1. Sri Vasireddy Varada Rama Rao
2. Sri B.Kamalaker Rao
3. Sri Dr. Rayapati Srinivas
4. Dr. Masala Padmaja.

**ii) 2.2.2009 న జరిగిన శ్రీ జల్లి విల్సన్ అరెస్టు మరియు విడుదల గురించి**

I am to announce to the House that Sri Jalli Wilson along with others was arrested at 12.45 Hours on 2.2.2009 in Crime No. 32/2009 Under Section 151 Cr.P.C. of Gandhinagar Police Station, while they organized a public meeting at Indira Park and tried to proceed towards Andhra Pradesh Legislative Assembly. Later, he was released on bail on the same day".

**iii) గవర్నరు గారి ప్రసంగపు నిజ ప్రతిని సభా సమక్షంలో ఉంచడం గురించి**

"I have to acquaint the House that on 2nd February, 2009, the Governor was pleased to address the Members of both the Houses of Legislature and a true copy of the Address has been laid on the Table of the House".

**iv) గవర్నరుగారి ప్రసంగపుము పట్ల ధన్యవాదాలు తెలిపే ప్రతిపాదనకు సవరణల గురించి**

"I am to announce to the House that amendments to the Motion of Thanks to the Address by the Governor will be received by the Secretary to State Legislature up to 2.00 P.M. on 5th February, 2009".

**v) గౌరవ ముఖ్యమంత్రికి మరియు గౌరవ అబ్కారి శాఖామంత్రికి చెందిన కార్యక్రమ ప్రదానము గురించి**

I am to announce to the House that the Business in the Legislative Council standing in the name of the Chief Minister will be attended to by the following Ministers during the Seventh Session of the Legislative Council:

| | | | |
|---|---|---|---|
| 1. | Sri K.Jana Reddy,<br>Minister for Home | : | Law and Order<br>Service matters,<br>Implementation of G.O.610, |

| | | | |
|---|---|---|---|
| | | | and other issues of G.A.D. |
| 2. | Sri Mohd. Fareeduddin,<br>Minister for Co-operation | : | Public Enterprises |
| 3. | Sri Mohd. Ali Shabbir,<br>Minister for Energy,<br>Minorities Welfare and Wakf | : | N.R.I. issues & Gulf victims |
| 4. | Sri N.Raghuveera Reddy<br>Minister for Agriculture | : | Marketing & Warehousing |
| 5. | Sri P.Lakshmaiah,<br>Minister for Major & Medium<br>Irrigation<br>Ground | : | Minor Irrigation, APIDC,<br>Lift Irrigation, APWRDC<br>WALAMTARI,<br>Water. |

I am to further announce that the Hon'ble Chief Minister has delegated the subjects of Sri Jakkampudi Ramamohana Rao, Minister for Excise & Prohibition to Sri Konathala Ramakrishna, Minister for Commercial Taxes as he has been undergoing medical treatment.

MR.CHAIRMAN: All the Papers are deemed to have been laid on the Table of the House.

<u>సభాసమక్షంలో ఉంచిన పత్రములు</u>

1. A copy of the 36th Annual Report of the Andhra Pradesh State Police Housing Corporation Limited for the year 2006-2007, as required under Section 619-A (3) of the Companies Act, 1956,

2. A copy of the Eighth Annual Report of the Central Power Distribution Company of Andhra Pradesh Limited for the year 2007-2008, as required under Section 619-A Companies Act, 1956,

3. A copy of the Report and Accounts of the Andhra Pradesh State Minorities Finance Corporation Limited for the year 2004, as required under Section 619-A(3) of the Companies Act, 1956, along with reasons for delay, and

4. A copy of the Andhra Pradesh Excise (Possession, Import, Export, Transport of Molasses - Conditions of Licence and Permits) Rules, 2008 issued in G.O.Ms.No. 1292, Revenue (Ex.III) Department, dated 10.11.2008 under the Andhra Pradesh Excise Act, 1968 (Act No. 17 of 1968) as required under Sub-Section 4 of the Section 72of the said Act.

<u>సభా సమక్షంలో పెట్టిన పత్రము</u>

A copy of the report on the decisions of the Business Advisory Committee taken at its meeting held on 2nd February 2009.

MR.CHAIRMAN: Now the House is adjourned for tea break for Fifteen minutes.

(The House then adjourned at 11.35.A.M. for tea break for Fifteen minutes).

మ. 12.10

(టీ విరామానంతరం సభ మధ్యాహ్నం 12.10 నిమిషాలకు సమావేశమైంది.
గౌ. ఛైర్మన్ గారు అధ్యక్ష స్థానంలో వున్నారు.)

<u>అర్జీల సమర్పణ</u>

శ్రీ పోచింరెడ్డి సుబ్బా రెడ్డి : అధ్యక్షా, ఈ రాష్ట్రంలో దాదాపు ఎయిడెడ్, డిగ్రీ, జూనియర్ కాలేజీలకు సంబంధించినటువంటి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల మీద అంటే అన్ ఎయిడెడ్ సర్వీసెస్ వాటి పరిష్కారం , జీవో 30 రద్దు , ఖాళీలను నింపడంపై పరిష్కారాన్ని కోరుతూ, ఎంప్లాయీస్ అందరూ నన్ను రిక్వెస్ట్ చేయడం జరిగింది. వాటిని పిటిషన్‌గా స్వీకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

రెండవ విషయం. కడప జిల్లా, కడప షుగర్ ఫ్యాక్టరీలో రిటైర్ అయిపోయిన వారు, చనిపోయిన వారికి సంబంధించిన వారికి వచ్చే పెన్షన్స్ మనం చూసినట్లైతే చాలా తక్కువగా వుంది. అది చాలా దారుణంగా వుంది. ఈనాడు వారికి వచ్చే మినిమం పెన్షన్ రూ. 370 లు మాత్రమే వస్తున్నాయి. అంటే అది వృద్ధులకు వచ్చే దానికంటే చాలా తక్కువగా వస్తున్నది. అది చాలా దారుణంగా రూ. 370 మాత్రమే వస్తున్నది. దానితో వారు బ్రతుకు వెళ్లదీస్తున్నారు. వారికి రివైజ్డ్ పి ఆర్ సి, పెన్షన్నుకు సంబంధించిన రాయితీల మీద రిక్వెస్టు చేయడం జరిగింది. దానిని మీరు పిటిషన్‌గా స్వీకరించాలని కోరుతున్నాను.

(గౌ. ఛైర్మన్ గారికి పిటిషన్ అందజేయబడింది.)

శ్రీ ఎమ్. వెంకట శివా రెడ్డి (కడప, అనంతపూర్, కర్నూల్) : అధ్యక్షా, శ్రీశైలం హైడల్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి సీనియర్ ఎంప్లాయీస్ 126 మెంబర్స్ రెగ్యులరైజేషన్ ప్రాసెస్ కింద ఎపి జెన్కోకు పిటిషన్ సబ్మిట్ చేయడం జరిగింది. ఆల్‌రెడీ వాళ్లు 15 నుంచి 20 సంవత్సరాలుగా కాంట్రాక్టు సర్వీసు కింద వాళ్లకంటే ఎంతో జూనియర్సును 111 మెంబర్సును రిక్రూట్‌మెంట్ చేసుకోవడం జరిగింది. కాబట్టి ఈ పిటిషన్‌ను యాక్సెప్ట్ చేయవలసిందిగా కోరుతున్నాను.

( గౌ. ఛైర్మన్ గారికి పిటిషన్ అందజేయబడింది. )

SRI B. CHANGAL RAYUDU: Sir, through you, I am presenting to the House a petition submitted by leprosy affected persons requesting for issuance of bus passes. That is the first petition. I am also presenting another petition with regard to provision as pension for these people. I humbly submit that these petitions be referred to the Petitions Committee.

(Petitions were presented to the Hon'ble chairman)

గవర్నరు ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం మరియు చర్చ

SRI SHAIK HUSSIAN (Nominated): Sir, I beg to move:

"That an address be presented to the Governor as follows:

That the Members of APLC assembled in this Seventh Session are deeply grateful to the Governor for the Address which he has been pleased to deliver to the Legislative Council on 2.2.2009.

SRI KANDULA LAXMI DURGESH PRASAD: Sir, I am secondling the motion.

MR. CHAIRMAN: Motion moved. Now discussion on the motion.

శ్రీ షేక్ హుస్సేన్ : అధ్యక్షా, ఆంధ్ర ప్రదేశ్ 7 వ శాసన పరిషత్తు సమావేశంలో ఉభయ సభలను ఉద్దేశించి మాన్యులు గౌరవనీయులు గవర్నరు గారు చేసినటువంటి ప్రసంగానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరి ఆ ప్రసంగాన్ని నేను సమర్థిస్తూ, ఈ రోజు నా ప్రసంగాన్ని కొనసాగిస్తున్నాను.

అధ్యక్షా, నాకు గవర్నరు గారు చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పేటువంటి అవకాశాన్ని యిచ్చినందుకు నేను ముందుగా మీకు నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు అనేక పార్టీలు వస్తాయి. అనేక మ్యానిఫెస్టోలు , అనేక వాగ్దానాలు చేస్తాయి. అనేక మ్యానిఫెస్టోలు, అనేక వాగ్దానాలతో ప్రజలను ఒప్పించి, మెప్పించి తాము ఎన్నికలలో గెలవడానికి ప్రయత్నం చేయడం జరుగుతుంది. కానీ ప్రజలు దీనిని నిశితంగా గమనిస్తూ వున్నారు. గమనిస్తూ వుంటారు కూడా. ఒకటి ఏమిటంటే ఎవరు వాగ్దానాలను నెరవేర్చారు? ఎవరు తమ మ్యానిఫెస్టోలో పేర్కొన్నటువంటి అంశాలను ఖచ్చితంగా అమలులోకి తీసుకు వచ్చారు అనేటటువంటి విషయాలను బాగా గమనిస్తూ వుంటారు. అటువంటి వాళ్లకు తిరిగి అవకాశాలు కల్పించేటువంటి పర్థితులు కూడా వుంటాయని నేను మీకు మనవి చేస్తున్నాను.

ఇటీవల జనవరి 31 వ తేదీన రామదేవ్ గారి యోగా శిక్షణా శిబిరానికి హాజరైనటువంటి చంద్రబాబు నాయుడు గారు మాట్లాడుతూ ఒక సత్యాన్ని బహిర్గతం చేయడం జరిగింది. అధ్యక్షా, పెద్దలు అంటూ వుంటారు' బుద్ధి కర్మాను సారిణి' అని. మనం ఎంత దాచిపెట్టుకోవాలనుకున్నా మన ఆంతర్యంలో వున్నటువంటి విషయం ఎప్పుడో ఒకసారి మన నోటితో బయటకు రావడం అన్నది జరుగుతూ వుంటుంది. మరి అదేమిటి అంటే, నేను ఆయన చెప్పినటువంటి విషయాన్ని నేను మీకు కొటేషన్సులోనే చెబుతాను.

''మేము అంటే రాజకీయ నాయకులం క్యారెక్టర్ మెయిన్టెయిన్ చేయలేము. అందువల్లనే మేము ప్రజలకు ఆదర్శప్రాయులం కాబోము'' అని అన్నారు. అంటే మేం యిచ్చినటువంటి ఏ వాగ్దానమూ మేం ఖచ్చితంగా నెరవేర్చడానికి కట్టుబడి వుండము. కాబట్టి మేం రాజకీయనాయకులము అన్నారు. అది రాజకీయ నాయకులము అన్నది తనవరకూ అనుకోమనండి. అందరు రాజకియ నాయకులూ వుండరు అని ఉద్దేశించి చెప్పేటువంటి హక్కు ఆయనకు ఎక్కడుంది? నేను కొటేషన్సులో చెబుతున్నానండీ, నేను వక్రీకరించి చెప్పేటువంటి పరిస్థితిలోకి పోనేపోను.

( తెలుగు దేశం పార్టీకి చెందిన సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, వక్రీకరించి చెప్పాల్సిన అవసరం నాకు లేనేలేదు. నేను మరొకసారి ఆయన చెప్పిన దానినే చదువుతున్నాను. 'మేము అంటే రాజకీయ నాయకులం క్యారెక్టర్ మెయిన్టెయిన్ చేయలేము. అందువల్లనే మేము ప్రజలకు ఆదర్శ ప్రాయులము కాబోము ' అని వారు చెప్పడం జరిగింది. ఇది నగ్న సత్యమని కూడా నేను మనవి చేస్తున్నాను. అధ్యక్షా, నేను ఇంకొక విషయాన్ని కూడా మనవి చేస్తున్నాను. మా పార్టీ ప్రజలకు ఏవైతే వాగ్దానాలు చేసిందో , మాపార్టీ ప్రజల కోసం మ్యానిఫెస్టోలో ఏదైతే పేర్కొనడం జరిగిందో వాటిని తూచా తప్పకుండా ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో , కేవలం మ్యానిఫెస్టోలో పేర్కొన్న విషయాలు, సమస్యలే కాదు, ప్రజలకు అవసరం అయితే, ఖచ్చితమైతే, అగత్యం వుంటే పేర్కొననటువంటి వాటిని కూడా డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు, మా ముఖ్యమంత్రి గారు నెరవేర్చడం జరిగింది.

నేను ఇంకొక విషయం కూడా మనవి చేస్తున్నాను అధ్యక్షా. 2004-08 సంవత్సరాల మధ్య కాలంలో రాష్ట్రంలో సగటున 8.96 శాతం ఆర్థిక అభివృద్ధిని సాధించాం. 2007-08 లో 10.64 శాతం ఆర్థికాభివృద్ధి రేటు నమోదు అయింది. 1994 నుంచి 2004 మధ్య కాలంలో 5.75 శాతం సగటు ఆర్థిక వృద్ధి రేటు నమోదు అయింది. ఇది వాస్తవం కాదాని నేను అడుగుతున్నాను. తద్వారా ప్రజలలో రాజకీయ నాయకుల పట్ల విశ్వసనీయతను ముఖ్యమంత్రి గారు పెంచారని నేను ఈ సందర్భంగా అభిప్రాయపడుతున్నాను. మా ప్రభుత్వం పట్ల మరింత గౌరవం పెరిగేలా వారు చేశారు. ప్రజా సంక్షేమ అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారు.

అధ్యక్షా, వాస్తవాలను గుర్తించినందుకు గవర్నరుగారికి నేను మరొక్కసారి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా ఒక్కసారి కూడా తాజా పన్నులు విధించలేదు. అలాగే వినియోగ దారులకు ఏ తరగతి వారికీ కూడా విద్యుత్ టారిఫ్ పెంచకుండా గత 5 సంవత్సరాలలో తమ రాబడులును అసాధారణంగా పెంచుకోవడం జరిగిందని గమనించడం సంతోషదాయకం అధ్యక్షా. మరి ఈ విధమైన పరిస్థితులలో ప్రజా సంక్షేమ ప్రభుత్వాన్ని, ప్రజలకు అండదండలు కల్పిస్తున్న ప్రభుత్వాన్ని ఓడించి, ప్రజా కంటకులను అధికారంలోకి తీసుకురావాలని ఓ వైపు పరస్పర విరుద్ధ శక్తులైన మహా కూటమి, దగా కూటమి మరొక వైపు మెగా కూటమీ పోటీ పడుతున్నాయి అధ్యక్షా. కాని ప్రజల అండ దండలున్నటువంటి రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వాన్ని ...........

(తెలుగు దేశం పార్టీకి చెందిన గౌరవ సభ్యుల నుంచి అంతరాయం)

పోనీ మాయా కూటమి లెండి. దగా కూటమి అంటే కాదండీ, మాయా కూటమి అందాము. అధ్యక్షా, ఈ కూటములు పోటీ పడుతున్నాయి. కాని ప్రజల అండదండలున్న రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వాన్ని ఏ కూటమీ కూడా ఏమీ చేయలేదని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

(అంతరాయం)

మ. 12.20

శ్రీ పి.యాదగిరి (అసెంబ్లి): అధ్యక్షా, దగా కూటమని సభ్యులు అన్నారు, ఎట్లా అంటారు అధ్యక్షా, దగా కూటమని? ఆ మాటలను రికార్డుల నుండి తొలగించాలి.

శ్రీ షేక్ హుస్సేన్: దగా కూటమీ కాదంటే, మాయా కూటమి అని అందాంలెండి.

(ప్రతిపక్ష నాయకుల నుండి సభకు అంతరాయం)

శ్రీ చేరుపల్లి సీతారాములు: మీ గురించి మీరు చెప్పుకోండి సార్, కాని మాయా కూటమీ అంటే ఎట్లా సార్.

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు అధికారంలో ఉండగా, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది.

(అంతరాయం)

(ప్రతిపక్ష నాయకులను ఉద్దేశించి) తరువాత మీరు నాకు సమాధానం చెప్పండి. అధ్యక్షుల వారికి సమాధానం చెప్పండి. నన్ను మాట్లాడించకపోయినంత మాత్రానా, ఇక్కడ నుంచి వెళ్లి నేను ప్రజలలోకి పోయి మాట్లాడుతాను కదా! అప్పుడైనా మీరు ఇబ్బంది పడాల్సి వస్తుంది కాదా! దయచేసి నన్ను మాట్లాడనియ్యండి, రేపు మీరు కూడా మాట్లాడేటప్పుడు మీ సమాధానాన్ని నిర్ద్వందంగా చెప్పండని నేను మీకు మనవిచేస్తున్నాను.

శ్రీ పి.యాదగిరి: ఎవరి పార్టీ గురించి వాళ్లు చెప్పుకోవచ్చు, దగా కూటమని మీరు ఎట్లా అంటారు?

శ్రీ షేక్ హుస్సేన్: మంచిదండీ, ఒ.కే.

(అంతరాయం)

అధ్యక్షా, ఈ రాష్ట్రంలో అధిక సంఖ్యాకులు రైతులున్నారు.

శ్రీమతి సిహెచ్.గంగాభవాని: 1994లో సంపూర్ణ మధ్యపాన నిషేదమని, మొట్టమొదటి సంతకం పెట్టి దగా చేయలేదా? దగా కూటమి కాదా !

(ప్రతిపక్ష నాయకులచే సభకు అంతరాయం)

శ్రీ షేక్ హుస్సేన్: శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అధికారంలో ఉండగా, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైయింది. ఆకలి చావులు, ఆత్మ హత్యలు అప్పుడు నిత్యకృత్యమైనాయి. కరువు కరాళ నృత్యం చేసింది. ఆహార ధాన్యాల దిగుమతి పడిపోయింది. రాష్ట్రంలో నికర సాగు విస్తీర్ణం 110 లక్షల హెక్టార్లు

ఉండాల్సి ఉండగా, 2002-03 నాటికి 97.30 లక్షల హెక్టార్లకు పడిపోయిన మాట వాస్తవం కాదా? ఇది 2007-08 Economic Survey పేజీ నెం.2012 ప్రకారం నేను మీకు మనవిచేసుకుంటున్నాను. ఆహార ధాన్యాల దిగుబడి ఆ ఏడాది 106.55 లక్షల టన్నులకే పరిమితమైయ్యింది.

(అంతరాయం)

శ్రీ పి.యాదగిరి: అధ్యక్షా, రికార్డుల నుండి దగా కూటమి అనే పదాలను తీసేయాలి.

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, నికరంగా 110 లక్షల హెక్టార్లలో పంటలు పండిస్తూ ఉండగా, 2002-03లో కేవలం రూ.95 లక్షల హెక్టార్లలోనే పంటలు సాధ్యమైనాయి. రాష్ట్రంలో రబీ సీజన్లో అప్పట్లో వరి పంట 13 లక్షల హెక్టార్లలో పండించాల్సి ఉండగా, కేవలం 7 లక్షల హెక్టార్లలోనే పండించారు.

(అంతరాయం)

శ్రీమతి సిహెచ్.గంగాభవాని: అప్పట్లో, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిని ప్రపంచ బ్యాంకు జీతగాడని కమ్యునిస్టులు అనలేదా, ఈరోజు మరలా కూటమిగా ఎలా కలిసారు?

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, అప్పుడు, ఆహార ధాన్యాల దిగుబడి గణనీయగా 106 లక్షల టన్నులకు పడిపోయింది. మా ప్రభుత్వం తీసుకున్న అన్ని చర్యల వల్ల 2007-08లో 198.17 లక్షల టన్నుల దిగుబడి సాధ్యమైయ్యింది. గత నాలుగేళ్లలో సగటున ఏటా 47 శాతం వృద్ధి నమోదైయ్యింది. రాష్ట్రం సుభిక్షాసమన్వితంగా ఉండడంతో ప్రజలముందు తాము గెలవలేమని భావించిన టి.డి.పి తనకు వైరుధ్యం ఉన్నప్పటికీ సి.పి.ఎం, సి.పి.ఐ, టి.ఆర్.ఎస్‌లతో పొత్తుపెట్టుకుంటుంది. అధికారమే లక్ష్యంగా, అధికారమే పరమావధిగా, రాష్ట్రవిచ్ఛిన్నమే తన మార్గమంటూ, గతంలో పుస్తకాలు ద్వారా విస్తృతంగా ప్రాచారం సాగించిన టీడీపీ తాజాగా ఇప్పుడు టీ.ఆర్.ఎస్‌తో చేతులు కలిపింది. అలాగే, ప్రపంచ బ్యాంకు జీతగాడు, ప్రజావ్యతిరేకి అంటూ, నారా చంద్రబాబు నాయుడుగారిని తూర్పారపట్టిన కమ్యూనిస్టులు ఆయనతోనే చేతులు కలిపేటటువంటి దురుదృష్టకర పరిస్థితులు దాపురించాయి.

(వామ పక్ష సభ్యుల నుండి సభకు అంతరాయం)

శ్రీ బొమ్మిడి నారాయణరావు: సభ్యులు సబ్జెక్ట్ దాటి బయటకు వెళ్లుతున్నారు.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు: అధ్యక్షా, ఈ హౌస్ దాదాపు ఒక సంవత్సరం, పది నెలల కాలం నుంచి నడుస్తూవుంది. మళ్లీ రేపు మార్చి 30 వస్తే, రెండు సంవత్సరాలు అవుతుంది. అవతల ఉన్న చిన్న హౌస్‌లో ఏమిజరిగినా సరే, దానికి అతీతంగా ఇక్కడ కొంత చర్చలు జరపడానికి, ప్రభుత్వం తన విధానాన్ని చెప్పుకోవడానికి, ప్రతిపక్షం సభ్యులు ఇక్కడ ఉన్న పరిస్థితులను విశదీకరించడానికి మీరు అవకాశాలు కల్పిస్తొవచ్చారు. సభ్యులు శ్రీ షేక్ హుస్సేన్ గారంటే నాకు గౌరవముంది.

మిస్టర్ ఛైర్మన్: ఆయన భాషా పండితుడు.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు: అధ్యక్షా, నాకు తెలుసు ఆయన భాషా పండితుడే. ఆయన తన బాధ్యతలను నిర్వర్తించడంలో కృతకృత్యులు కావాలనే మేము భావిస్తున్నాం. ఎందుకంటే తీర్మానాన్ని బలపరుస్తొ మీరు మాట్లాడుకోవాలి, మీ పాయింట్స్ మీరు చెప్పుకోవాలి. కాని అదే సందర్భంలో మీరు యాస్పర్షన్స్ ఇతరుల మీద చేయడం న్యాయం కాదు. ఒక వేళ అటువంటి పరిస్థితి వచ్చింది అనుకోండి. వస్తే ఇక్కడ కూడా మళ్లీ అదే రకమైన వాతావరణం సృష్టించబడుతుంది. నిజమే 2004 ఎన్నికలలో ఆ నాడు దేశంలో ఉన్న పరిస్థితులలో దేశంలో మతోన్మాదాన్ని ఓడించడానికి, దేశంలో ప్రపంచ బ్యాంకు పోకడలను ఓడించడానికి, ఆనాడు కాంగ్రెస్‌తోటి పరిమితమైన అవగాహనైనా సరే కలిగి సి.పి.ఐ, సి.పి.ఎం ....(మైక్ కట్ అయ్యింది)

మిస్టర్ ఛైర్మన్: మీకు సమయం ఇస్తాను కదండి, అప్పుడు చెప్పండి.

SRI PUVVADA NAGESWARA RAO: I am not disputing with what my friend Sri Shaik Hussain is telling. అధ్యక్షా, ఇంకా వారు బాగా చెప్పాలనే ఉద్దేశంతో చెబుతున్నాను. ఇంకా బాగా చెప్పాలి, విశదీకరించాల్సిందే. కాని, ఆయన ప్రారంభించడమే అది ఒక కూటమీ అని ప్రారంభించారు. అది మోగా కూటమి, దగా కూటమి, మహా కూటమి, ఏ కూటమని ఆయన కోరుకుంటునట్లే, ఇంకొక్క వంద రోజుల లోపల అందరం కలిసి ప్రజల దగ్గరకు వెళ్లుతున్నాం. ప్రజా కూటమి అక్కడ బయట ఉంది. 70 days or 80 days whatever, it is before April 20th or April 25th ఏదో డేట్ వస్తుంది. Election Commission is on the Job, definite గా మీరు కోరుకున్నట్లుగా ఇంకా ముందువస్తే ఇంకా మంచిదే. ఇంకా కొన్ని రోజుల లోపల ప్రజల దగ్గరకు మీరు మేము పోతున్నాం. ఆనాడు మేము నమ్మకంతోటి మిమ్మల్ని బలపరచడానికి వారిని ఓడించడానికి మీతో కలిసి ఉన్నాం. కాని మేము మోసగించబడ్డాం. మీరూ మోసం చేసారని....(మైక్ కట్ అయ్యింది)

(అధికార పార్టీ సభ్యుల నుండి సభకు అంతరాయం)

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు: అధ్యక్షా, అప్పుడు టీ.డీ.పీ వాళ్లు పరిపాలన చేసారు. 2004 నుంచి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు, కాంగ్రెస్ పార్టీవారు పరిపాలనచేస్తున్నారు. వారు ఎంతమంచి కూటమో, వీరెంత మంచి కూటమే వాళ్లకు వాళ్లు చెప్పుకోవచ్చు, మాలాంటి వాళ్లం పార్టిసిపేట్ చేస్తాం. కాని, ఆ కూటమిలో ఆనాడు భాగస్వాములు. కూటమనకపోయిన, సర్దుబాటుచేసుకొని భాగస్వాములం మేము, మేము ఒక లక్ష్యంతోటి బలపరిచాం. 80 ఏళ్ల నుండి దెబ్బలాడుతున్న కాగ్రెస్ కమ్యూనిస్ట్‌ల మధ్య మొదటిసారి దేశవ్యాప్తమైన సర్దుబాటు వచ్చి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేంద్రంలో బలపరిచాం. It is only to defeat BJP.

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, నా టైం సార్ అది.

శ్రీ పొగాకు యాదగిరి: దగా కూటమి కాదు, అమెరికా సామ్రాజ్య వాదానికి, జార్జ్.డబ్ల్యు. బుష్‌కి లొంగిపోయి, మీరు మోసం చేసారు.

(అంతరాయం)

మ. 12.30

శ్రీ షేక్ హుస్సేన్:- అధ్యక్షా, డా.వై.యస్.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి వ్యవసాయ రంగానికి, రైతాంగానికి..........................

(అంతరాయం)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విజయం సాధిస్తున్నాయి. అందులో భాగంగానే తాజాగా ఋణ బకాయిల రద్దును రూ.71,600 కోట్లకు పెంచడం జరిగింది. ఇది చారిత్రాత్మకమైనటువంటి నిర్ణయం, హర్షనీయం, సమర్థ పాలనకు, ప్రజా సంక్షేమం, రైతాంగ శ్రేయస్సుకు అద్దం పడుతుంది. ఋణ బకాయిల వసూలు రద్దు నిర్ణయం కేవలం రైతులకు మాత్రమే కాకుండా మొత్తం జాతి అభివృద్ధికి, జి.డి.పి ప్రగతికి దోహదపడుతుంది, ప్రగతి బాటలు వేస్తుంది. ఆధునిక యుగంలో ఈ శతాబ్దపు అతి గొప్ప మంచి పనిగా ఋణ బకాయిల రద్దును కీర్తించాలి. సమస్యలను పరిష్కరించడం ఈ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని మరొక్కసారి నిరూపణ అయింది. సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకోవడం మా ప్రభుత్వానికే సాధ్యమవుతుందని నేను మనవి చేస్తున్నాను.

కేంద్ర ప్రభుత్వం ఋణ మాఫీ పథకాలను విస్తరించడం వల్ల రాష్ట్రంలో ప్రయోజనం పొందే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. తొలుత ఆ పథకాన్ని ప్రకటించినప్పుడు రాష్ట్రంలో 63 లక్షల మంది రైతులకు రూ.11,353 కోట్ల మేర లబ్ది కలిగింది. ఆ ప్యాకేజీ క్రింద ఋణాలు రద్దు కాని వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు ప్రోత్సాహకాలను అందించింది. ఆ విధంగా 36 లక్షల మంది రైతులకు రూ.1800 కోట్లు అందించాము. ఈ విధంగా టి.డి.పి పాలనలో వ్యవసాయ సంక్షోభం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎందుకు చేయలేకపోయారు అని నేను ప్రశ్నిస్తున్నాను. రైతాంగం అధికంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు గుర్తించిన జిల్లాలతోపాటు డి.పి.ఇ.పి, డి.టి.పి జిల్లాల్లోను పెద్ద రైతులకు కేంద్ర ఋణ మాఫీ పథకం వర్తించే విధంగా పథకాన్ని మరింత సరళీకరించడం హర్షనీయం. ఇందుకు ప్రయత్నం చేసిన ముఖ్యమంత్రితోపాటు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ప్రధాన మంత్రి డా.మన్మోహన్‌సింగ్ వంటి ఆర్థిక మంత్రి చిదంబరంను కూడా నేను అభినందిస్తున్నాను. రైతుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నాను అధ్యక్షా. ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్న పదహారు జిల్లాలలో రూ. 9, 650 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ అమలవుతుంది. దీనిలో భాగంగా 45 లక్షల మంది రైతులకు రూ.1,963 కోట్ల వడ్డీ మాఫీ చేసిన ఘనత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే దక్కుతుంది. గ్రామాల వారీగా ఇప్పటి వరకు ఋణాలు తీసుకుని రైతుల జాబితాలను సేకరించి ఆ జాబితాలను బ్యాంకులకు పంపి వారందరికీ ఋణాలు అందజేయడానికి ప్రణాళికను సిద్ధం చేసిన ప్రభుత్వం మాది. రైతులకు ఋణ సదుపాయం చాలా ప్రధానం అని గుర్తించి ఈ నాలుగు సంవత్సరాలలో బ్యాంకుల ద్వారా ఋణాలను రెట్టింపు చేయించింది. 2008-2009లో ఈ రంగానికి బ్యాంకుల ద్వారా రూ.26,000 కోట్ల ఋణాలను అందించడానికి బ్యాంకులు ముందుకు రావడం వెనుక ప్రభుత్వం కృషి చాలా ఉంది. ప్రభుత్వ చొరవ వల్ల వ్యవసాయ ఋణాలపై వడ్డీ రేట్లు గణనీయంగా తగ్గాయి. సహకార బ్యాంకుల ద్వారా 5% వడ్డీనే వసూలు చేస్తున్నారు. 2003-2004లో రాష్ట్రంలోని బ్యాంకులు కలిపి వ్యవసాయ రంగానికి రూ.9,019 కోట్ల ఋణాలు 59 లక్షల మంది

రైతులకు ఇవ్వగా 2008-2009 సంవత్సరంలో 89 లక్షల మంది రైతులకు రూ.22,500 కోట్ల ఋణాలను ఇప్పించినటువంటి ఘనత డా.వై.యస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వానిదే.

అధ్యక్షా, ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన క్షణమే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించే ఫైలు పైననే తొలి సంతకం చేశారు. ఆ నాటి నుంచి నేటి వరకు వేల కోట్ల రూపాయలు ఖర్చు అయినా కూడా వెరవకుండా రైతులకు ఉచిత విద్యుత్‌ను మా ప్రభుత్వం అందజేస్తుంది. రూ.1200 కోట్లు రైతుల విద్యుత్ బకాయిలను రద్దు చేశారు. ఉచిత విద్యుత్ వల్ల 2007-2008 సంవత్సరంలో రూ.5,700 కోట్లు వ్యయం చేయగా 2008-2009 సంవత్సరంలో రూ.6,500 కోట్లు ఖర్చు చేశాము. వివిధ రంగాల ద్వారా 2008-2009 లో రైతులకు రూ.32,076 కోట్ల బడ్జెట్ కేటాయింపు ఈ నాలుగు సంవత్సరాలలో 30 లక్షల మంది కొత్త కౌలు రైతులకు ఋణాలు, వ్యవసాయానికి ప్రాణాధారం సాగునీరు అని గుర్తించి రాష్ట్రంలోని అన్ని పెండింగు ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టాం . 77 ప్రాజెక్టుల ద్వారా కోటి పది లక్షల ఎకరాలు సాగులోకి తీసుకువస్తున్నాం. మూడు కోట్ల మందికి సురక్షిత సాగునీరు అందించాం. ఇప్పటికే పన్నెండు ప్రాజెక్టులను పూర్తి చేసి మరో పదమూడు ప్రాజెక్టులను పాక్షికంగా పూర్తి చేసి ఆయకట్టుకు నీటిని విడుదల చేయించిన ఘనత మా ప్రభుత్వానిదే అధ్యక్షా. తెలంగాణ ప్రాంతంలో సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు సుమారు రూ.38,500 కోట్ల వ్యయంతో ప్రతిష్టాకరమైనటువంటి ప్రాణాహిత, చేవెళ్ల సాగునీటి ప్రాజెక్టులను కూడా మా ప్రభుత్వమే చేపట్టింది అధ్యక్షా.

(మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

జలయజ్ఞంలో భాగంగా మా ప్రభుత్వం 21.75 లక్షల ఎకరాలకు సాగునీటి సరఫరాను స్థిరీకరించడంతోపాటు 100.38 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.1,50,194.48 కోట్ల పెట్టుబడి వ్యయంతో డెల్టాల ఆధునీకరణ, వరద గట్లకు అభివృద్ధి పనులతోపాటు 42 భారీ సాగునీటి ప్రాజెక్టులు, 28 మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులను మా ప్రభుత్వం చేపట్టింది. అంతేగాక అనేక మునిసిపాలిటీలకు నీరు అందించడం, పారిశ్రామిక అవసరాలను తీర్చడంతోపాటు రాష్ట్రంలోని 192 మండలాలలోని 6,553 గ్రామాలలో 2.54 కోట్ల జనాభాకు త్రాగునీటిని అందించినటువంటి సుస్థిరమైన ప్రభుత్వం డా.వై.యస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వం. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇదివరకటి పది సంవత్సరాల కాలంలో సాగు నీటి ప్రాజెక్టులపై ఖర్చు చేసిన రూ.10,392 కోట్లతో పోల్చి చూడగా 2004 మే 14వ తేదీ నుంచి 2008 డిసెంబరు 31వ తేదీ వరకు రూ.37,538.66 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేసింది రాష్ట్రంలో అమలవుతున్న సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి అయ్యే నాటికి దేశంలో ఆంధ్ర ప్రదేశ్ ఆహార భాండాగారంగా రూపుదిద్దుకుంటుంది, ఇది నగ్న సత్యం అని నేను మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, నేను ఇంకొక విషయం మీకు మనవి చేస్తున్నాను గతంలో తెలుగు దేశం పార్టీ పరిపాలనలో ప్రాజెక్టులను పునాదులకే పరిమితం చేయడం జరిగింది. ఇది దాచేస్తే దాగని సత్యం అధ్యక్షా. ఒక కవి అంటారు అధ్యక్షా, కల్పితాలకు కథల మాటున వాస్తవాలను దాచగలమా, అందమగు కాగితపు పువ్వులు పరిమళం వెదజల్లగలవా.

హంద్రీ నివాస పథకానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు 1996 మార్చి పదకొండవ తేదీన ఒకసారి, 1999 జూలై పదమూడవ తేదీన మరొక్కసారి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకోలేదా? కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి చంద్రబాబునాయుడు 1999లో ఎల్లూరు మండలంలోని రేగువానుగట్ట గ్రామం వద్ద శంకుస్థాపన చేసి చేతులు దులుపుకోలేదా? శ్రీరాంసాగర్ రెండవ దశ పనులకు 4.5.1984లో నాటి ముఖ్యమంత్రి N.T.Rama Rao గారు శంకుస్థాపన చేశారు. చంద్రబాబునాయుడు గారు 6.3.1996లో మళ్లీ శంకుస్థాపన చేయడమే కాకుండా 9.5.2002 లో మరొక్కసారి శంకుస్థాపన చేశారు. 1996 లోక్‌సభ ఎన్నికలలో వెలిగొండ, గాలేరు నగిరి తదితర పథకాలకు శంకుస్థాపన చేసి ఆ తర్వాత పనులు ఏ మాత్రం చేపట్టకుండా నిర్లక్ష్యం చేసినటువంటి ఘన త తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిది కాదా అధ్యక్షా?

మ. 12. 40

అదే ఎన్నికల సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం, ఎల్లంపల్లి, ఇచ్చంపల్లి మరియు పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏమైనాయని నేను ఈ సందర్భంగా వారిని ప్రశ్నిస్తున్నాను. ఎన్నికలయ్యాక వాటిని పూర్తిగా విస్మరించారు. అనుమతులు లేకుండానే పులిచింతల ప్రాజెక్టుకు పునాది రాయి వేసి, చేతులు దులుపుకున్న ఘనత మీదే కదా బాబు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎన్నికలకు ముందు ఒక విధంగానూ, ఆ తరువాత మరొక విధంగానూ వ్యవహరించింది మీరు కాదా?

(అంతరాయం)

బాబు అంటే మిమ్ములను. చంద్రబాబు గారిని కాదు. నేను వారిని చాలా గౌరవంగానే మాట్లాడుతాను. రైతులు వాణిజ్య బ్యాంకుల ద్వారా పొందే ఋణాలపై వడ్డీని ఏడు శాతానికి ప్రభుత్వం తగ్గించింది. ఇది కూడా చాలా భారమని భావించరాదు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ఈ ఖరీఫ్ నుంచి రైతులకు పావలా వడ్డీకి పంట ఋణాలను ఇవ్వాలని నిర్ణయించారు. (సభలో చప్పట్లు) ఈ మేరకు బడ్జెట్‌లో పావలా వడ్డీ పథకానికై రూ.310.00 కోట్లు కేటాయించారు. ఆ పథకాన్ని ఈనెల ఏడవ తేదిన ప్రారంభించి, అమలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి చెల్లించే నష్టపరిహారాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ నాలుగేళ్లల్లోనే భారీగా పెంచారు. వరి విషయాన్ని తీసుకుంటే 2003వ సంవత్సరంలో ఎకరానికి రూ.600.00లు వున్న నష్టపరిహారాన్ని రూ.1800.00లకు నేడు పెంచడం జరిగింది. (సభలో చప్పట్లు) ఇన్‌పుట్ సబ్సిడి 2003వ సంవత్సరంలో ఎకరానికి రూ.500.00లు, రూ.600.00లు వుంటే, నేడు అది రూ. 1500.00ల నుండి రూ.1800.00లకు పెరిగింది. ఈ నాలుగేళ్లల్లో రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధరలు కూడా బాగా పెరిగాయి. ఈ విధంగా రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వంగా కీర్తించాలి మా ప్రభుత్వాన్ని. గ్రామం యూనిట్‌గా పంటల భీమ పథకం అమలులోకి తెచ్చిన ఘనత కూడా మా ప్రభుత్వానికే దక్కిందని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

శ్రీ పొగాకు యాదగిరి: అధ్యక్షా, వరకి మద్దతు ధర వెయ్యి రూపాయలు చేయాలని రెజల్యూషన్ కూడా పాస్ చేసారు కదా, మరి ఆ విషయం ఏమైందో తెలియజేయాల్సింది కోరుతున్నాం.

మిస్టర్ డిప్యూటి ఛైర్మన్: ఆ విషయాలు మాట్లాడడానికి మీకు అవకాశం ఇచ్చినప్పుడు మాట్లాడండి.

(అంతరాయం)

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, గత ప్రభుత్వం అటక ఎక్కించినటువంటి రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని, మా ఎన్నికల మ్యానిఫెస్టోలో లేకపోయినా, తిరిగి, నిరు పేదలు ఆకలి, దప్పులతో అలమటిస్తుంటే, మూడు పూటల వారు సంతృప్తిగా భోంచేసి ఈ రాష్ట్రం 'నిత్య కళ్యాణం పచ్చ తోరణం' గా వుండాలని హరితాంధ్రప్రదేశ్‌ను సాధించే ధ్యేయంతో మన ముఖ్యమంత్రి గారు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. (సభలో చప్పట్లు) ఈ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినప్పటికీ అమలు చేస్తున్నటువంటి మరో ముఖ్యమైన పథకమే 'రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం'. ఈ రోజు ఆ పథకం ద్వారా రాష్ట్రంలో ఒక కోటి ఎనభై ఏడు లక్షల కుటుంబాలకు మేలు జరుగుతోందని తెలియజేస్తున్నాను. రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం ద్వారా ఇచ్చే బియ్యమే కాకుండా, ధరల పెరుగుదల ప్రభావం నుంచి సుమారు ఎనభై శాతం రాష్ట్ర ప్రజానీకాన్ని ఆ భారీ నుండి తప్పించేందుకు నిత్యావసర సరుకులైన పప్పులు, కూరగాయలు, వంట నూనెలు, ఇతర సరుకులను కూడా సబ్సిడీకి ఇవ్వడం జరుగుతోందనే విషయం గౌరవ సభ్యులకు తెలిసిందే.

(అంతరాయం )

ఆ పథకాన్ని తెలుగు దేశం పార్టీ గొప్పలుగా చెప్పుకుంటున్నది. స్వర్గీయ శ్రీ యన్.టి.రామారావు గారు వారి ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు వారు చేపట్టినటువంటి ఆ పథకాన్ని తుంగలోకి త్రొక్కింది ఆయనే. శ్రీ యన్. చంద్రబాబు నాయుడు గారు దాదాపు తొమ్మిదేళ్లపాటు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ఎవరు అమలు చేయొద్దన్నారు? ఆ విషయాన్ని తెలుగు దేశం పార్టీ వారు స్పష్టం చేయాలని నేను కోరుతున్నాను.

(అంతరాయం )

అధికారంలో వున్నంత కాలం బియ్యం పథకాన్ని అమలు చేయకపోవడమే గాక, వ్యతిరేకంగా, ఆ పథకం యొక్క కోటాను తగ్గించి పేదలు ఆకలితో అలమటించిపోయే విధంగా వారు చేయడం జరిగింది. ఆ పాపాలకు బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పినప్పటికి కూడా తెలుగు దేశం పార్టీకి ఈ పథకం గురించి మాట్లాడే అర్హత అసలుకే లేదని తెలియజేస్తున్నాను. శ్రీ చంద్రబాబునాయుడు గారు మాట్లాడినట్టుగానే సంపూర్ణ మద్యపాన నిషేధం గురించి 1996వ సంవత్సరంలో లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు వారు చిలక పలుకులు వల్లించారు. తీరా, ఆ అవసరం తీరిపోయాక 1996 వ సంవత్సరం ఆగష్టు మాసంలో ధర పెంచి కోటా తగ్గించేశారు. మళ్లీ 1999వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు గుప్పించి, పార్టీ అధికారంలోకి వచ్చాక మరొకసారి శ్రీ యన్.చంద్రబాబునాయుడు గారు ప్రజలను వంచించారు. 2000వ సంవత్సరం ఏప్రిల్ మాసంలో మరొకసారి బియ్యం ధరను కిలో ఐదున్నర రూపాయలకు పెంచారు. పేదలు, గ్రామీణులు ఆకలి చావులకు గురైనారు. ఆకలి చావులకు గురైనా, ఉపాధి లేక వేరే ప్రాంతాలకు వలస పోయినా, ఆహార భద్రత గురించి పట్టించుకోకపోగా, సబ్సిడి బియ్యం పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది శ్రీ యన్. చంద్రబాబునాయుడు గారు కాదా అని నేను ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నాను. అసలు అప్పుడు బియ్యాన్ని సబ్సిడిపై ప్రజలకు అందించవద్దని, నాటి శ్రీ యన్.చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వానికి ఎవరు సూచించారు. ఎవరు సలహా ఇచ్చారో ఆ పార్టీ వారిని స్పష్టం చేయమని నేను కోరుతున్నాను. మీరు అధికారంలో వున్నప్పుడు, ఆ పథకాన్ని

అమలు చేయవద్దని మా పార్టీ వారు గాని, మరెవరైనా గాని ఏమైనా సలహా చెప్పారా ? ఆయన ' తన మనసు లోని మాట ' అనే పుస్తకంలో సంక్షేమ పథకాలను కేవలం ' ప్రజాకర్షక పథకాల ' ని ఎద్దేవా చేయడం వాస్తవం కాదా అని వారిని నేను అడుగుతున్నాను.

(అంతరాయం )

అధ్యక్షా, ముఖ్యంగా రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం గురించి శ్రీ యన్. చంద్రబాబునాయుడు గారు వారి ' తన మనసు లోని మాట' అనే పుస్తకంలో ఏమన్నారో ఆయన మాటాల్లోనే నేను చెబుతున్నాను.

(అంతరాయం )

శ్రీ పోగాకు యాదగిరి: ఆ పుస్తకాన్ని మీరే వ్రాయించారు.

(సభలో నవ్వులు, అంతరాయం)

శ్రీ బొమ్మిడి నారాయణ రావు: అధ్యక్షా, కంసుడు పదే, పదే కృష్ణ నామం చేసినట్టుగా, శ్రీ షేక్ హుస్సేన్ గారు పదే, పదే శ్రీ యన్. చంద్రబాబు నాయుడు గారి నామాన్ని స్మరిస్తున్నారు.

మిస్టర్ డిప్యూటి ఛైర్మన్: ఆయన స్మరిస్తే మీకు బాధగా వుందా?

శ్రీ బి.చెంగళ్‌రాయుడు: అధ్యక్షా, రామాయణంలో రాముణ్ణి తలచుకున్నని రోజులు రావణాసురుణ్ణి కూడా తలచుకోవల్సిందే.

(సభలో నవ్వులు)

శ్రీ షేక్ హుస్సేన్: ఆయన గారు ఆ పుస్తకంలో ఏమన్నారో, ఆయన మనసు లోని మాటను నేను వారి భాష లోనే ఇక్కడ ప్రస్తావిస్తాను. "1985వ శకంలో తొలిసారిగా తెలుగు దేశం పార్టీ తెలుగు ఆత్మ గౌరవం మీద దారిద్రరేఖకు దిగువన వున్న వారికి కిలో బియ్యం రెండు రూపాయలకు ఇస్తామనే వాగ్ధానంతో అధికారంలోకి వచ్చింది. ఇటువంటి సబ్సిడీని నిర్వహించడం కష్టం. ఆర్థికంగా మెరుగైన స్థితిలో వున్న వారు కూడా సబ్సిడి బియ్యం కోసం పరుగు పెట్టడంతో ఈ వాగ్ధానం దీర్ఘకాలంలో చాలా ఖరీద్దైనటువంటి వాగ్ధానం అయ్యింది. నేను అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఖర్చును భరించరానిదిగా భావించి దాన్ని మళ్లీ రెండు రూపాయల నుంచి మూడున్నర రూపాయలకు ధరను పెంచాం. సబ్సిడిని ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వ పాపులారిటి దెబ్బతింటుందన్నది సామాన్య అభిప్రాయం. కానీ వాస్తవమేమిటంటే సబ్సిడి వల్ల రాజకీయ ప్రయోజనాలు నష్టపోతాయి" అని వారు వ్రాసిన పుస్తకంలోని పేజి నెంబరు: 118, 119 గల 'మనసు లోని మాట' పుస్తకంలోనిది. దీన్ని బట్టి శ్రీ యన్.చంద్రబాబునాయుడు గారు సబ్సిడి బియ్యం పథకానికి వ్యతిరేకి అని స్పష్టంగా తెలుస్తోంది. తీరా ప్రజలు శ్రీ యన్.చంద్రబాబునాయుడు గారిని, తెలుగు దేశం పార్టీ ప్రభుత్వాన్ని ఛీదరించి, అధికారంలో నుంచి వెళ్లగొట్టడంతో పాటు, డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారి నాయకత్వంలోని

కాంగ్రెసు ప్రభుత్వానికి ప్రభంజనంలా ప్రజలు అండగా నిలబడుతుండడంతో ఆందోళన చెంది రోజుకోవిధంగా తెలుగు దేశం పార్టీ నాయకులు ప్రకటనలు గుప్పిస్తున్నారు.

శ్రీ అనుముల రేవంత్‌రెడ్డి: ఇది కూడా ఆ పుస్తకంలోనే వ్రాసారా? లేకపోతే మీరు వ్రాసారా?

శ్రీ షేక్ హుస్సేన్: అధ్యక్షా, ఎన్నికలు వున్నా, లేక పోయినా కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజల పట్ల చిత్తశుద్ధితో వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది.

మ. 12.50

అధికారంలోకి వచ్చిన వెంటనే అంటే 2004, మే నెలలోనే ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అధికారంలో ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేసి, మళ్ళీ ఎన్నికల ముందు శ్రీ నారా చంద్రబాబు నాయుడులాగా మా ప్రభుత్వం హామీలు గుప్పించటం లేదు. ముఖ్యమంత్రి డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ఉన్నారు. అధ్యక్షా, ఇందిరా క్రాంతి పథకం క్రింద 8 లక్షల గ్రూపులలోని కోటి కుటుంబాలకు పావలా వడ్డీకి ఋణాలు అందిస్తున్న ఘనత మా ప్రభుత్వానిదే అధ్యక్షా.

(సభలో సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు).

అధ్యక్షా, నాలుగు సంవత్సరాలలో రూ. 17,565 కోట్లు అందించాము. ఈ ఏడాది రూ. 11 వేల కోట్లు అందిస్తున్నాం. ఈ పథకాన్ని రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ అభినందించి, దేశవ్యాప్తంగా అమలుచేయాలని ఆదేశించినటువంటి విషయం వాస్తవం కాదా. టిడిపి ప్రభుత్వం 9 సంవత్సరముల కాలంలో రూ. 15,078 కోట్లను 12 శాతం వడ్డీకి అందించింది. క్రొత్తగా వీటికోసం భీమా పథకం అమలుచేస్తున్నాం. ఈ పథకం వారి జీవితాలలో వెలుగులను నింపుతుంది. పెన్షన్ రూ. 500 నుంచి రూ. 3,000 వరకు అందిస్తాం. వారి పిల్లలకు ఉపకార వేతనాలు అందుతాయి. అలాగే వృద్ధులకు పింఛన్లు నెలకు 2003-04 సంవత్సరంలో రూ. 75 చొప్పున, 18.93 లక్షల మందికి అందిస్తే, మా ప్రభుత్వం నెలకు రూ. 200ల చొప్పున71 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నది.

అధ్యక్షా, 8 లక్షల మంది వికలాంగులకు నెలకు రూ. 500 చొప్పున అందిస్తున్నాం. అలాగే మన ముఖ్యమంత్రిగారు, ఆయన మంత్రివర్గ సభ్యులు ప్రవేశపెట్టినటువంటి 'ఆరోగ్యశ్రీ ' అత్యంత బ్రహ్మాండమైన పథకం.

మిస్టర్ ఛైర్మన్ :- మీ టైం 20 నిమిషాలు, ఇప్పుడు 30 నిమిషాలు అయింది.

శ్రీ షేక్ హుస్సేన్ :- అధ్యక్షా, ఆరోగ్య శ్రీ అత్యంత బ్రహ్మాండమైన పథకం. యావత్తు ఆంధ్ర రాష్ట్రమంతా హర్షిస్తున్నటువంటి పథకం. యావత్ భారతదేశంలోని రాష్ట్రాలన్నింటిలో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టుకోవాలనే ఆత్రుతలో వారు ఉన్నారు. కనీసం సామాన్య మానవుడు కార్పొరేట్ ఆసుపత్రిలో ప్రవేశించి, ఇది కార్పొరేట్ ఆసుపత్రా, కార్పొరేట్ ఆసుపత్రి ఇలా ఉంటుందా అని ఏనాడూ కూడా చూడనటువంటి వ్యక్తి, కార్పొరేట్ ఆసుపత్రిలో నా జీవితంలో నేను ఎప్పుడైనా వైద్యం చేయించుకోగలనా? అని కలలుగన్న సామాన్య ప్రజానీకాన్ని కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేటట్లు చేసిన ఘనత డా. వై. ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారి ప్రభుత్వానిదే.

నేను ఒక విషయం మనవి చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ వారు డా. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారిని దైవ సమానులు అనడంలో అర్థం ఉంది అధ్యక్షా. భగవద్గీతలో ఒక శ్లోకం ఉంది.

"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతాం,
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

శ్రీ అనుముల రేవంత్ రెడ్డి :- అధ్యక్షా, అదే భగవద్గీతలో 'వినాశకాలే విపరీత బుద్ధి' అని కూడా ఉంది.

(అంతరాయం)

శ్రీ షేక్ హుస్సేన్ :- అధ్యక్షా, దేవుడు ఆయనకిచ్చిన అనుగ్రహం వల్ల బడుగు, బలహీన, పేద, మైనారిటీ వర్గాల అభ్యున్నతికోసం నిత్య కంకణధారియై ముందుకు సాగిపోతున్నారు. అత్యంత ముఖ్యమైన పథకం 'రాజీవ్ ఆరోగ్య శ్రీ', ఈ కార్యక్రమం ద్వారా 360 ఆసుపత్రులలో 15.000 పడకల ద్వారా పేదలకు ఖరీదైన చికిత్స అందిస్తున్నాం. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకూ 7,079 క్యాంపులు నిర్వహించి 14 లక్షల మందికి పరీక్షలు చేయగా, వారిలో 1,75,433 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఇందుకు 579.49 కోట్ల వ్యయం అయింది. అందులో పిల్లలు 8,870 మందికి రూ. 23 కోట్లు ఖర్చు అయింది. 108 ఎమర్జెన్సీ అంబులెన్స్‌ను ప్రతి మండలలంలోనూ నిర్వహిస్తూ ఉంది. ఇప్పటికే 480 అంబులెన్స్‌లు ఉండగా, మరో 120 క్రొత్తగా సమకూరుస్తున్నాం. ఇటువంటి సేవలు చంద్రబాబు పాలనలోనే కాదు, దేశం మొత్తంమీద ఎక్కడైనా చూశామా, ఆఖరికి కమ్యూనిస్ట్ పాలిత రాష్ట్రాలలోనూ అమలులో లేవే, అలాగే గ్రామాలలో వైద్య సేవలు అందించేందుకు 104 సేవలు అందిస్తున్నాము. ఇప్పటికే అటువంటివి నూరు వాహనాలు ఉండగా, మరొక 280 చేకూరనున్నాయి. ఈ కార్యక్రమాల వలననే ప్రజలలో ప్రభుత్వానికి విశేష ఆదరణ లభిస్తున్నది. అందువల్లనే డా. వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి అధికారంలో కొనసాగితే తమకు పుట్టగతులుండవని, ప్రతిపక్షాలు నిర్ణయానికి వచ్చాయి. ప్రజలకు వారు ఏం చెప్పినా నప్పేటటువంటి పరిస్థితి లేదు. దాంతోనే డాక్టర్ వై. ఎస్. ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఆయనపై బురద చల్లి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఆయన ఇమేజ్‌ను దెబ్బతీయడం ద్వారా రాజకీయంగా తాము లబ్ధిపొందగలమని ప్రతిపక్షాలు నిర్ణయానికి వచ్చాయి. అవినీతిని గురించి చంద్రబాబు గొంతు చించుకుంటూ అభూతకల్పనలతో ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో అవినీతి అంటూ ఉన్నదంటే అది ఆయన హయాంలోనే, 9 సంవత్సరముల పరిపాలనలోనే.

(అంతరాయం)

అధ్యక్షా, మహాకూటమి ఎంత బరితెగించిందంటే, ఆఖరికి దేశంలో ఎక్కడా లేని విధంగా, అత్యంత అద్భుతంగా, పారదర్శకంగా అమలవుతున్న ఉపాధి హామీ చట్టాన్ని సైతం రాజకీయం చేస్తున్నది. ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రజా సంక్షేమ, ముఖ్యంగా పేదలకోసం నిర్మించే ఉపాధి పథకం ద్వారా వారికి అమృతం అందిస్తుంటే ప్రతిపక్షాలు ముఖ్యంగా మహా కూటమి ఆ అమృతంలో విషం కలుపుతున్నది. పేదలపాలిట వై.ఎస్. దేవుడైతే, మహా కూటమి పేదల పాలిట రాక్షసులుగా తయారయ్యారు. దేశ వ్యాప్తంగా

ఎక్కడాలేని విధంగా ఆఖరికి పశ్చిమ బెంగాల్‌లోనూ అమలుకాని రీతిలో అత్యద్భుతంగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలో పేదలకు ఫలితాలు అందిస్తుంటే తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, టిఆర్ఎస్‌లు మహా కూటమిగా ఏర్పడి కాలకూట విషం సృష్టించేందుకు సన్నద్ధులయ్యారు. రాజశేఖర్‌రెడ్డి ప్రజాపక్షం కోసం కష్టపడుతూ ఉంటే, మహా కూటమి మాత్రం తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజా సంక్షేమానికి వ్యతిరేకంగా పనిచేస్తూ చరిత్రలో నిలిచిపోతున్నారు. వారి పాపం చరిత్రలో నిరుపయోగంగా మిగిలిపోతున్నది. ఉపాధి చట్టం ద్వారా పేదల ఆకలి తీరుస్తూ......

(అంతరాయం)

నేను ఒక విషయాన్ని మనవి చేస్తున్నాను. ఈ ఉపాధి హామీ పథకంలో బియ్యం నిష్ప్రయోజకంగా తెలుగుదేశం పార్టీ నాయకులందరూ మెక్కుతూ ఉంటే, ఈరోజు మహాకూటమిలో ఏ కమ్యూనిస్ట్ పార్టీ నాయకులైతే వాళ్ళతో చేరిపోయినారో, ఆ నాయకులే వేదికల మీదనుంచి ఎక్కి, కడపలో కాదు, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని చోట్లా, "జంకు బొంకుల రాజకీయపు గొడుగు నీడన బడుగు బతుకులు, ప్రజల బియ్యము దోచి మెక్కెడు పందికొక్కుల సంతరా ఇది యని", ఈ కమ్యూనిస్టులే వేదికల మీద నుంచి చెప్పారు అధ్యక్షా .

(అంతరాయం)

నేను ఇంకొక విషయాన్ని కూడా మనవి చేస్తున్నాను. ఎన్ని మహా కూటములు వచ్చినా, ఎన్ని ప్రజా రాజ్యాలు వచ్చినా, ఈ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు డాక్టర్ వై. ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గత 62 సంవత్సరముల పరిపాలనలో ఏరోజు ఎవరు ప్రవేశపెట్టిన పాపాన పోలేదు కాబట్టి, ఈ రోజు ప్రజలందరూ మాతో ఉన్నారు అధ్యక్షా. ప్రజలతో కాంగ్రెస్ పార్టీ ఉంది, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంది. భవిష్యత్తులో ఎన్ని కూటములు వచ్చినా కూడా మేము అదిరేది, బెదిరేది లేదు. నేను చివరగా ఒక విషయం మనవి చేస్తున్నాను. మా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అన్నీ మా నాయకుడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిగారిని పిలుస్తున్నాయి. రేపు జరగబోయేటటువంటి ప్రజల యొక్క, ప్రజా సంగ్రామానికి, కురుక్షేత్ర సంగ్రామానికి ఏమని పిలుస్తున్నాయంటే, "లెమ్ము ధనుంజయ, విధి బలీయము, న్యాయము గెల్చు, నిల్చు సత్యము, నశించు స్వార్థము, సదా యుగ ధర్మమిదే కదోయి గంగ తను అంత్యకాలమున నూర్గురు బిడ్డల తండ్రికైన పిండమిడు దిక్కు కల్గదకటా గ్రహచారము తప్పి వచ్చినన్ " కాంగ్రెస్ శ్రేణులు మమ్ము పిలుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మమ్ము పిలుస్తున్నది. తిరిగి మేము తప్పకుండా అధికారంలోకి వస్తామని చెప్పి ఖచ్చితంగా మనవి చేస్తున్నాము.

మ. 1.00

(అంతరాయం)

శ్రీ కందుల లక్ష్మీదుర్గేష్ ప్రసాద్ : గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రతిపాదించిన హుస్సేన్‌గారు, అదే విధంగా దానిని తరువాత బలపరుస్తున్న నాకు ఈ సందర్భంగా అవకాశం లభించినందుకుగాను ప్రత్యేకంగా తమరికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. 'Law of diminishing marginal utility 'క్షీణోపాంత ప్రయోజన సూత్రం, ఇది అర్థశాస్త్రంలో ఒక ప్రముఖమయిన సిద్ధాంతం. 'The satisfaction derived by the consumer, and extra unit of particular commodity is always

diminishing 'అని చెబుతోంది. ఏదయినా బాగా ఆకలి ఉన్న వ్యక్తికి ఆపిల్ పండు ఇస్తే, అది అతనికి చాలా సంతృప్తినిస్తుంది. రెండవ పండు ఇస్తె కొంత సంతృప్తిని తగ్గిస్తుంది. మూడవ పండు ఇస్తే ఇంక నాకు ఈ ఆపిల్ పండు అవసరం లేదనిపిస్తుంది. మనం తెలుగులో చెప్పుకుంటే మోహం మొత్తుతోందంటాము. అదే ఆర్థిక విధానంలో ఈ మాట చెబుతుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఈ సిద్ధాంతం నిజం కాకపోవచ్చునని చెప్పారు. ఈ రోజు ఈరాష్ట్రంలో ఆ ప్రత్యేకమయిన పరిస్థితి ఉందనే మాట చెబుతోంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఐదు సంవత్సరాలు పరిపాలించే అవకాశం ఓటర్ మహాశయులు ఇచ్చిన తరువాత ఐదు సంవత్సరాలు పూర్తి అయ్యే తరుణంలో పదవీ కాలం ముగిసిన చివరి సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏ మూల వెళ్లినా డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం మాకు కావాలనే పరిస్థితి వినిపిస్తోందని మనవిచేస్తున్నాను. ఇది ఏదో ఆశామాషీగా ఒక రోజు ప్రయత్నంవల్ల పూర్తిగా ఏ రకమయిన ఎక్సర్‌సైజ్ జరగకుండా వచ్చిన పేరు కాదు. ఖచ్చితంగా నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో ఈరాష్ట్ర ప్రభుత్వం డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారి నాయకత్వంలో ఎటువంటి మంచి కార్యక్రమాలు చేశారో అవి అన్నీ కూడా గవర్నర్‌గారి ప్రసంగంలో ఉటంకించబడ్డాయి. అది విన్న తరువాత కేవలం కాంగ్రెస్ పార్టీవారే కాదు, ఈరాష్ట్రానికి సంబంధించిన అన్ని పార్టీలవారు ఓపెన్‌గా అందరూ ఇది నిజం, ముమ్మాటికీ నిజం, ఇటువంటి సుభిక్షమయిన పరిపాలన మళ్లీ మాకు కావాలనే మాటప్రజలలో వినబడుతోందని తెలియచేసుకుంటున్నారు. ఆ రోజు అధికారంలోకి రాకముందు డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు ఈ రాష్ట్రంలో 1500 కి.మీ., పాదయాత్ర చేసి పేద ప్రజల గుండె చప్పుడు తెలుసుకుని ఎవరు ఎక్కడ, ఏ విధంగా నష్టపోతున్నారు, ఏ విధంగా ఆ వర్గాలవారికి న్యాయం చేయాలని ఆలోచన చేసి వాటిని ఎన్నికల మ్యానిఫెస్టోగా చేసి ఎన్నికలు అయిన తరువాత రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అమోఘమయిన మద్ధతుతో గెలిచామని వారు వెంటనే ముఖ్యమంత్రి అయిన తరువాత ఏమి చేశారన్నది మనందరికి తెలిసిన విషయమే. ఎవరూకూడా సాహసించని కార్యక్రమం ఎన్నికల ముందు ఏమి చెప్పారో, అదే రైతులకు ఉచిత విద్యుత్అనే ఫైల్ మీద సంతకం చేసిన సాహసోపేతమయిన ముఖ్యమంత్రిగారు ప్రపంచంలో, దేశంలోనే మంచి పేరు తెచ్చుకున్న వ్యక్తిఅని గర్వంగా తెలియచేసుకుంటున్నాను. దానితోబాటు కొన్ని విషయాలు బేరీజు వేసుకునితీరాలి. ఖచ్చితంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో మనం చేసే కార్యక్రమాలు, అంతకుముందు చేసిన కార్యక్రమాలు, భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాలు బేరీజు వేయడం వల్ల ఏ పాలకులు ఎంత మంచి చేశారనేది మనకు అర్థమవుతుంది.

ఆ విధంగా చేసినకార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుంటే, పెన్షన్ కార్యక్రమం మొట్టమొదటగా తీసుకుంటే, ఆ రోజే వారు చెప్పారు. వృద్ధులు 65 సంవత్సరాలు నిండిన వారు ఇంట్లో ఉన్న వారి ఆదరణకు నోచుకొని వారికి రు.10, రు.20 ఏదయినా ఖర్చులకు అవసరమయితే బిడ్డల ఎదుట చేయి చాస్తే, తరువాత బిడ్డలు చీదరించుకునే పరిస్థితులు ఉన్న రోజుల్లో రు.50, రు.60 పెన్షన్ ఇచ్చేవారు. అది కూడా క్రమం తప్పకుండా ప్రతీ నెలా ఇచ్చిన దాఖలాలు లేవు. ఎవరయినాసరే, అదే వార్డ్‌లో 10 మందికో, 20 మందికో ఇచ్చేవారు. తరువాత 65 సంవత్సరాలు నిండిన వారు మేము కూడా వృద్ధులమయ్యామని కొత్తవారు మేమూ పేదరికంతో మ్రగ్గుతున్నామని మా చేతుల్లో చిల్లి గవ్వకూడా లేదని వారంతా ముందుకువస్తే, అప్పుటిప్రభుత్వం తాలూకు అధికారులు కొత్తగా వృద్ధులకు ఇచ్చే అవకాశం లేదు. పాతవారు ఎవరయినా చనిపోతే ఇస్తామన్న మాట ఆ రోజులలో చెబితే, ఈరోజు వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు అధికారంలోకి వచ్చిన తరువాత చాలీ చాలని రు.70, రు.80 పెన్షన్ ఉన్న దానిని ఎకాఎకిన రు.200కి పెంచి అది కూడా క్రమం తప్పకుండా ప్రతి నెలా 1వ తారీఖున ప్రభుత్వ ఉద్యోగస్తులకు జీతం ఏ విధంగా వస్తుందో, ఆ విధంగా చేతుల్లో వీరికి పెన్షన్ పెడుతూ ఆ

విధంగా ఎంత మంది ఉంటే అంత మందికి శ్యాచురేషన్ కాన్సెప్ట్‌లా, ఇందులో పార్టీతో, కులంతో, మతంతో ప్రమేయం లేదు. తెలుగుదేశం, కాంగ్రెస్, బిజెపి, కమ్యూనిస్ట్ ప్రతి ఒక్కరూ అర్హులు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రు.200 చొప్పున పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

ఈ రోజు రాష్ట్రంలో ఈ పెన్షన్ కేవలం వృద్ధులకు సంబంధించింది కాదు. వితంతువులకు సంబంధించినవి ఉన్నాయి. అంగవైకల్యం ఉన్న వారికి ఆ శాతాన్ని ఏ మేరకు ఉందో గుర్తించి దాని ప్రకారంగా రు.500 నుండి రు.750 వరకూ పెన్షన్ ఇచ్చే కార్యక్రమం ఉంది. ఈ రోజు రాష్ట్రంలో 71 లక్షల మందికి పెన్షన్ ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఆ ఫిగర్ కంపేర్ చేస్తే గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కేవలం 12 లక్షలు మాత్రమే ఈ పెన్షన్స్ ఉంటే, అదీ క్రమంగా ఇచ్చిన దాఖలాలు లేవు. ఇది ఒక్కటే చాలు మనం ఖచ్చితంగా అర్థం చేసుకోవడానికి. అదే విధంగా మరొక ముఖ్యమయిన అంశం రేషన్‌కార్డులు. గతంలో తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో కొత్తగా రేషన్‌కార్డ్ కావాలంటే ఎంఆర్ఓ., ఆఫీస్ చుట్టూ చెప్పులు అరిగేలా తిరగవలసిన పరిస్థితి ఉంది. ఈరోజు 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఒక్కరికి బీదవర్గాలవారు ఉన్నారో, ఎవరయితే బిలో పావర్టీ లైన్ ఫ్యామిలీస్ ఉన్నాయో వారందరికి తెల్ల రంగు కార్డ్, సామాన్య మధ్య తరగతి కులాలవారికి గులాబి రంగు రేషన్ కార్డ్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ రోజు రు.1.87 లక్షల తెల్లరేషన్ కార్డులు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. దీనితోబాటు కొందరు పేద వర్గాల వారు మాకు తెల్ల రంగు రేషన్ కార్డుల బదులు గులాబి రంగు రేషన్ కార్డులు ఇచ్చారు, వాటిని మార్చండని అంటే, దానికి కూడా ముఖ్యమంత్రిగారు ఎవరయితే నిజమయిన పేదవర్గాలవారు ఉన్నారో, వారిని సర్వే చేయించి, గులాబి రంగు రేషన్ కార్డులు ఉంటే, వాటి ని తెల్ల రంగు రేషన్ కార్డులుగా మార్పు చేయండని అన్నారు.

మ. 1.10

అదే ప్రక్రియ ఈ రాష్ట్రం మొత్తం మీద జరుగుతోంది. దానితో బాటు మరో ముఖ్యమైన విషయం, గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో ఆదాయ పరిమితి పెంచడం జరిగింది. పట్టణ ప్రాంతాలలో రూ.75 వేలకు పెంచి, రూ.75 వేలకు లోబడి ఆదాయం ఉన్న ప్రతి వారు తెల్ల రంగు రేషన్ కార్డుకు అర్హులేనని చెప్పడం ద్వారా రూ. 2 కోట్ల, 27 లక్షల తెల్ల రంగు రేషను కార్డులు ఇచ్చిన సాహసోపేతమైన ప్రభుత్వం ఏదైనా వున్నదంటే అది కాంగ్రెసు ప్రభుత్వమే నని మనవి చేస్తున్నాను.

తెల్లరంగు రేషను కార్డు ఇవ్వడం అంటే అది ఆషామాషీ వ్యవహారం కాదు. దానితో పాటు అనేక రకాలైన లాభాలు ఇవ్వవలసిన అవసరం ఉంటుంది. కిలో బియ్యం రెండు రూపాయలకు ఇవ్వాలని మహానుభావుడు ఎన్.టి.రామారావు పాతికేళ్ల క్రితం ఈ పథకాన్ని ప్రారంభించారు. ఆ రోజున ఆయన నినాదం ఒక్కటే. పేద వాళ్లందరికీ రెండు రూపాయలకు కిలో బియ్యం ఇవ్వాలని. అయితే బయట మార్కెట్‌లో రూ.3.50 కి, రూ.4 కు బియ్యం దొరికేవి. అప్పుడు ఒక్కొక్క కిలో బియ్యానికి ప్రభుత్వంపై భారం కేవలం రూపాయిన్నర నుంచి, రెండు రూపాయలు పడేది. ఆ రోజుల్లో కిలో బియ్యం రెండు రూపాయలకు ఇవ్వడం వేరు. ఈవేళ అనగా పాతికేళ్ల తర్వాత బయట మార్కెట్‌లో నాణ్యమై న బియ్యం కొనాలంటే రూ. 26 నుంచి 28 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితిలో కిలో బియ్యం రెండు రూపాయలకు యివ్వాలంటే ఒక్కొక్క కిలోకు రూ. 25 నుంచి 26 వరకూ భారం పడుతున్న సమయంలో రాజశేఖర రెడ్డి గారు ఒకే ఒక మాట చెప్పారు. ఎవరైతే పేద ప్రజలు

న్నారో వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం వున్నంత వరకూ కిలో బియ్యం రెండు రూపాయలకే యివ్వడం జరుగుతుందని మాట చెప్పి, దానిని అమలు చేస్తున్న ఘనత కూడా ఈ ప్రభుత్వానికి దక్కుతుందని మనవి చేస్తున్నాను. ఈ వాళ వున్న కార్డుల సంఖ్య ఆరోజు వున్న కార్డుల సంఖ్య లెక్క వేయండి. ఈ రోజు ఇంచుమించు 2 కోట్ల 27 లక్షల కార్డులున్నాయంటే, యిన్ని కార్డుల మీద కిలో బియ్యం రెండు రూపాయలకే యివ్వాలంటే ప్రభుత్వ ఖజానా మీద ఎంత భారం పడుతుందో ఆలోచించండి. ఇది ఖచ్చితంగా పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి వున్న ప్రభుత్వమని నేను చెప్పడం కాదు, గణాంకాలే ఖచ్చితంగా చెబుతున్నాయి. ఇతర పార్టీల వారు కూడా వారి మనసు అంతరాంతరాలలోకి వెడితే వారే ఖచ్చితంగా చెబుతారు, ఇది నిజంగా ప్రజా సంక్షేమ ప్రభుత్వం అన్నమాట.

మరో ముఖ్యమైన విషయం. రాజీవ్ ఆరోగ్య శ్రీ గురించి ఇందాక హుస్సేన్ గారు కూడా ప్రస్తావించారు. మనందరకూ తెలుసు, విద్య, వైద్యం అనేవి కేవలం ఎన్నికల నినాదాలుగా మిగిలిపోయాయి. ప్రపంచ రాజకీయ చరిత్రలో ఏనాడూ జరగని విధంగా ఈ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వైద్యాన్ని సామాన్య మానవుని ముంగిటకు తీసుకువచ్చిన ప్రభుత్వం ఏదైనా వుందంటే అది రాజశేఖర రెడ్డి గారి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని మనవి చేస్తున్నాను. ఎందుకు చెబుతున్నానంటే అన్ని రాజకీయ పార్టీల వాళ్లమూ కలసి రాష్ట్రం అంతా తిరుగుదాము. ఏ మూలకు వెళ్లినా సరే పదిమందో, ఐదు మందో, ఇరవై మందో ముందుకు వచ్చి, మగవాళ్లైతే చొక్కా గుండీలు విప్పి చూపిస్తారు, గుండెల మీద పెద్ద చార వుంటుంది ఆపరేషన్ చేయించుకున్నట్లు. వారు చెబుతారు, మాకు 35 సంవత్సరాల వయసు. ఈ వయసులో మాకు గుండె జబ్బు వచ్చింది. దీనికి ఆపరేషన్ పడుతుందని అన్నారు. ఆపరేషన్‌కు ఎంత అవుతుంది అంటే లక్ష రూపాయలు అవుతుందన్నారు. రెండు పూటలా తిండే గడవని మాకు లక్ష రూపాయలు పెట్టి వైద్యం చేసుకునే అవకాశం లేనేలేదని, 35 ఏళ్లకే నూరేళ్లు నిండిపోయాయని, ఇక చచ్చిపోతామనే దైన్య స్థితిలో వున్న మాకు రాజీవ్ ఆరోగ్య శ్రీ అనేది అద్భుత వర ప్రసాదినిగా లభించిందని చెప్పి, మేము ఆరోగ్య శ్రీ డాక్టర్ దగ్గరకు వెళ్లాము, టెస్టులు చేశారు, డబ్బులు కూడా తీసుకోలేదు. ఆపరేషన్ పడుతుంది అన్నారు. దానికి డేట్ యిచ్చారు. ఆపరేషన్ చేయించారు. రానూపోనూ ఖర్చులిచ్చారు. పూర్తి ఆరోగ్యవంతునిగా చేసి, తిరిగి మందులు చేతిలో పెట్టి ఇంటికి పంపించారు. అందుకే చెబుతున్నాను కనిపించని దేవుడు ఎక్కడున్నాడో గాని, కనిపించే దేవుడు మాత్రం డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అనే మాట ఈ రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా పదిమందో ఇరవై మందో చెప్పే మాట నేను మీకు మనవి చేస్తున్నాను. నేను మనవి చేసేది గుండె జబ్బులో , కాలేయం జబ్బులో, క్యాన్సరో , వెన్నుముకకు సంబంధించిన జబ్బులో ఇలాంటి జబ్బులు రావాలని ఎవరూ కోరుకోరు. కాని పొరపాటు వల్లో, గ్రహపాటు వల్లో ఇటువంటి జబ్బులు వస్తే సామాన్య మానవుడికి డబ్బున్నవాడు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి ఏ విధంగా కార్పొరేట్ హాస్పటల్‌లో వైద్యం చేయించుకుంటున్నాడో అలాంటి పరిస్థితి లేక దీనావస్థలో వున్న సామాన్య మానవుడు ఈ వాళ చెబుతున్నాడు, డబ్బున్న వాడితో సమానంగా తాను ఏ రకమైన హాస్పటల్‌లోకి , ఏ రకమైన ఖరీదైన వైద్యం చేయించుకోగలుగుతున్నాడో అటువంటి ఖరీదైన వైద్యాన్ని చేయించుకుని ఆనందంగా, ఆరోగ్యంగా బయటకు వచ్చే అవకాశం కల్పించిన డా. రాజశేఖర రెడ్డే మా నాయకుడని చెప్పే మాట మొత్తం రాష్ట్రం చెబుతోందని మనవి చేస్తున్నాను.

ముఖ్యంగా మరో విషయం, పావలా వడ్డీ గురించి చెప్పుకోవాలి. ఈ వాళ డ్వాక్రా సంఘాలున్నాయి. గత ప్రభుత్వంలో కూడా వున్నాయి. ఆ రోజు డ్వాక్రా సంఘాలు బ్యాంకు నుంచి అప్పు తీసుకోవాలంటే 6 నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేయాలి. పొదుపు చేశాక దానిని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు

ఋణాలిచ్చే వారు ఆ రోజుల్లో సరైన విధానం లేక . ఏ రకమైనటువంటి ఓరియంటేషన్ లేకపోవడం వల్ల. 6 నెలల పొదుపు తర్వాత వారు రూ. 10 వేలో 15 వేలో ఋణాలు తీసుకుని దానితో సర్దేసుకుని, ఆ సంఘం అక్కడితో కొలాప్స్ అయిపోయేది. ఈ వాళ అలాకాదు. ఏదైతే రాజశేఖర రెడ్డి గారు పావలా వడ్డీ పథకం ప్రారంభించారో, దయచేసి అర్థం చేసుకోండి, ఎవరికైనా, ఎక్కడైనా ఈ పావలా వడ్డీ వర్తించక పోతే, వారు సక్ర మంగా తిరిగి కట్టడం లేదనే మాట తప్పితే, ఎవరైతే తీసుకున్న ఋణాన్ని చిన్నాచితకా వ్యాపారాలు చేసుకోవడా నికి ఉపయోగించుకుని, ఆ డబ్బుతో నాలుగు రూపాయలు సంపాదించుకుని, ఆ నాలుగులో రెండు రూపా యలు దాచుకుని, మరో రెండు రూపాయలు తిరిగి బ్యాంకుకి కట్టిన ప్రతి గ్రూపుకీ కూడా పావలా వడ్డీ వచ్చి తీరింది. ఇది నేను చెప్పే మాట కాదు. మీరు ఒక్కసారి ఏ బ్యాంకుకైనా వెళ్లి తెలుసుకొమ్మని మనవి చేస్తు న్నాను. అందుకే ఈ రోజు రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా సరే పావలా వడ్డీ ద్వారా లబ్ధి పొందిన అనేక మంది మహిళలు చిన్నా చితకా ఇబ్బందులు ఎక్కడైనా వుండవచ్చు, వాటిని ఈ వాళ అధిగమించాము, ఈ వాళ ఎవ రైతే తీసుకున్న డబ్బు తిరిగి కట్టారో వారందరికీ కూడా పావలా వడ్డీ వర్తించింది. ఇది ప్రత్యక్షంగా కనిపించే ఉదా హరణ.

చాలా సందర్భాలలో మహిళా సాధికారిత పేరిట ముఖ్యమంత్రి గారు రాష్ట్రంలో ఏడు చోట్ల సమావేశాలు పెడితే ప్రతి చోటా కూడా మహిళలు వేదిక మీదకు వచ్చి అయ్యా ముఖ్యమంత్రి గారూ, మీరు మమ్మల్ని లక్షాధికా రులం చేస్తామన్నారు, మీ దయ వల్ల మేము కోటీశ్వరులం అయ్యాము అని చెప్పే సందర్భం కూడా వుందని మనవి చేస్తున్నాను. ఇది ఖచ్చితంగా మనందరకూ ఉపయోగపడే కార్యక్రమం. దీని ఇంప్లిమెంటేషనులో రీపే మెంట్ లింక్డ్ ప్రోగ్రాముగా పెట్టారు. రీపేమెంటు జరిగిన మరుక్షణమే వారికి పావలా వడ్డీ వస్తుంది. బ్యాంకులెప్పుడూ పావలా వడ్డీకే రుణాలివ్వవు. రూపాయికే ఇస్తాయి. ఐతే సక్రమంగా కట్టిన సంఘాల వారికి ముప్పావలా భారం ప్రభుత్వమే భరించి, పావలా వడ్డీ మాత్రమే వారి మీద పడేలా చేస్తుంది. దీనిలోపల విషయం అర్థం చేసుకోకుండా సరిగా జరగడం లేదనడం సమంజసం కాదు.

దానితో బాటు మరొక విప్లవాత్మకమైన నిర్ణయం, ఈ మధ్యనే క్యాబినెట్ ఆమోదం పొందిన నిర్ణయం . డ్వాక్రా మహిళల్లో ఎవరైతే 60 ఏళ్లు నిండిన వాళ్లున్నారో వారికి కనీసం రూ.500 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ను ఇచ్చే కార్యక్రమం కూడా ఏర్పాటు చేసిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిది. ఇందులో వారు తీసుకున్న రుణం, తిరిగి కట్టిన రుణం వీటి ఆధారంగానే వారికి ఎంత పెన్షను ఇవ్వాలనేది నిర్ణయించబడుతుంది. అందుకే తీసుకున్న, కట్టిన ప్రతి వారికీ కూడా కనీసం రూ.500 పెన్షను వచ్చి తీరుతుంది. బాగా కట్టిన వాళ్లకి, ఎక్కువ తీసుకుని తిరిగి కట్టిన వారికి రూ. 500 నుంచి రూ.5 వేల వరకు వెడుతుంది. దాని లాజిస్టిక్సు చూస్తున్నారు. తప్పనిసరిగా అది ఒక విప్లవాత్మకమైన మార్పు అవుతుంది. అందుకే ఈనాడు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆనాటి ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకున్నప్పటికీ కూడా ఆచరణాత్మకమైన కార్యక్రమం చేపట్టింది మాత్రం ఈ ప్రభుత్వమే అన్న మాటని మనవి చేస్తున్నాను.

మనకందరకూ తెలుసు. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం. అందువల్లనే ప్రభుత్వంలోకి రాగానే తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు మీద చేసిన చరిత్ర మనకుంది. ఈ రాష్ట్రంలో ఉన్న 63.81 లక్షల రైతులకు రుణ విమోచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రూ. 11 వేల కోట్లు రుణ మాఫీ చేశారు. ఎవరైతే ఈ పరిధిలోకి రావడం లేదో, ఎవరైతే తిరిగి డబ్బు కట్టేశారో వారికి ప్రోత్సాహకరంగా రూ.5 వేలు చొప్పున ఇచ్చిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికి దక్కుతుంది.

అలాగే మరో ముఖ్యమైన విషయం. గతంలో ఏ ప్రభుత్వమైనా కొత్తగా పన్నులు వేసే ఆనవాయితీ కలిగి వుండేది. గడచిన 4 సంవత్సరాల 10 నెలల కాలంలో కొత్తగా పన్నులు విధించని రికార్డు వుందంటే అది కేవలం రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వమే అని, కాంగ్రెసు ప్రభుత్వమే అని మనవి చేస్తున్నాను.

ఆనాడు బషీర్‌బాగ్‌లో ఉద్యమాలు చేశాము. ఆనాడు ఇక్కడున్న కమ్యూనిస్టు సోదరులు చాలా పెద్ద నాయకులు - వాళ్ల ముందు మేము చాలా చిన్నవాళ్లం - వాళ్లకు పూర్తిగా తెలుసు - ఆనాడు చేసిన విద్యుత్ ఉద్య మంలో ఆనాడు ఉన్న ప్రభుత్వం కాల్పులు జరిపించి కొంతమంది మరణానికి కారణం అయింది.

మ. 1.20

ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఒకసారి దయచేసి మీ మనస్సులో నుండి కమ్యూ నిస్ట్ పెద్దలు చెప్పండి, ఆ రోజు నుండి నేటి వరకు ఒక్క రోజైనా విద్యుత్ ట్యారిఫ్‌ని పెంచారా? పెంచలేదు. ఆర్థిక మంత్రి గారు ఎంతో ఎఫిషియంట్‌గా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రభుత్వం సామాన్యమానవుడికి ఉపయోగపడే విధంగా ఉంటుందని చెప్పడానికే ఇది ఒక మచ్చు తునక అని కమ్యూనిస్ట్ నాయకులకు చెపుతు న్నాను. ఉచితంగా విద్యుత్‌ని ఇవ్వడమంటే అది సామాన్యమైన విషయం కాదు. ఉచిత విద్యుత్ విషయంలో తెలుగు దేశం ప్రస్తావించిన విషయాలు గుర్తు చేస్తాను. ఉచిత విద్యుత్‌ని ఇస్తే విద్యుత్ తీగల్లో కరెంటు పారదు, కేవలం అవి బట్టలు ఆరేసుకోడానికే పనికివస్తాయని అన్నారు. కానీ తెలుగుదేశం చెప్పిన మాట అబద్ధం, అది కరెక్టు కాదని తీగల గుండా ప్రవహిస్తున్న కరెంటు చెప్పింది. మొన్ననే కరెంటు షాక్ తిన్నటువంటి పవన్‌కళ్యాణ్ కుడా చెప్పాడన్న మాటని మీ అందరి తెలియజేస్తున్నాను. విద్యుత్‌ని నిరంతరాయంగా సరఫరా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందని చెపుతున్నాను. హుస్సేన్ గారు ఇరిగేషన్ ప్రాజెక్టు విషయం చెప్పారు. ఈ ప్రభుత్వానికి ఇరిగేషన్ అన్నది మొట్టమొదటి ప్రాధాన్యతా అంశంగా ఉంది. నీరు అందని ప్రాంతాలకు త్రాగు, సాగు నీరు అందించిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందని తెలియజేస్తున్నాను. పువ్వాడ నాగేశ్వరరావు గార్ని, ప్రక్కనే కూర్చొన్న సి.పి.ఐ.ఎమ్. నాయకులను పోలవరాన్ని ఎందుకు అడ్డు కొంటున్నారని అడుగుతున్నాను. రాజమండ్రి గడ్డపై పుట్టిన వ్యక్తిగా 'వేదంలా ఘోషించే గోదావరి అమర ధామంలా శోభిల్లే రాజమహేంద్రి' అని ఆరుద్ర గారి లాంటి మహానుభావులచేత వేనోళ్ల పొగడబడ్డ రాజమహేంద్ర వరం నుండి వచ్చిన వ్యక్తిగా నేను చెపుతున్నాను. నా చిన్నప్పటి నుండి చూస్తున్నాను. గోదావరి అఖండ గోదావరిలా రాజమండ్రిలో ఉంటుంది. కానీ, ప్రతి ఏటా మినిమం రెండు వేల టి.ఎమ్.సి.ల నీరు వృధాగా సాగరంలో కలిసిపోతోంది. దీన్ని నేను ప్రత్య క్షంగా చూసిన వ్యక్తిని. ఈ రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు చాలా అవసరమైన ప్రాజెక్టుగా మీరు ఆనాడు చెప్పారు. ఈ రోజు మారిన నేపథ్యంలో మీరు కాదని అంటున్నారు.

శ్రీ చేరుపల్లి సీతారాములు : ప్రాజెక్టులకు మేము వ్యతిరేకం కాదు.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్‌ప్రసాద్ : ఈ రాష్ట్రంలో గోదావరి 1465 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. 1265 కిమీ మేర తెలంగాణాలోనూ, రెండు వందల కి.మీ. మేరకు ఆంధ్రాలో ప్రవహిస్తున్నది. తెలంగాణాలో ఉన్న అది లాబాద్ అయితే 1400 అడుగులు, నిజామాబాద్ 1256 అడుగులు,కరీం నగర్ 1031 అడుగులు, వరంగల్ 991 అడుగులు, ఖమ్మం 351 అడుగులు అబౌ సీ లెవల్లో ఉన్న ప్రాంతాలు. ఆంధ్రాకి తెలంగాణాకి ఉన్న తేడాఏమంటే, అవన్నీ కూడా అబౌ సీ లెవల్ ఉన్నాయి, అక్కడ ఈ ప్రాజెక్టులు కట్టాలంటే, మొత్తం తెలంగాణాలో ఈ ప్రాజెక్టులు కట్టాలంటే 1/3వంతు తెలంగాణా మునిగిపోయే పరిస్థితి ఉంది. పోలవరం దగ్గర కూడా

మీరు అదే అబ్జక్షన్ చెపుతున్నారు. ఈ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు కట్టడం వల్లకృష్ణా గోదావరి నదులను అను సంధానం చేయడం, దానితోబాటు ఎన్నో లక్షల హెక్టార్ల భూమికి సాగు నీరు అందించడం , విశాఖ నగరానికి త్రాగునీరు అందించడం, ఖమ్మంలో ఉన్న ఇందిరాసాగర్ ప్రాజెక్టుకి నీరు లభించే ఏర్పాటు చేయడం, ఇటువంటి బహుళార్ధక సాధక ప్రయోజనాలు చేయడంతోపాటు, పోలవరం ప్రాజెక్టు ఇక్కడ సస్యశ్యామలం చేస్తుంది. కనుక, మనం తెలంగాణాను ఎందుకు సస్యశ్యామలం చేయరాదని ఆలోచన చేసిన అపరభగీరథుడు కనుకనే రాజశేఖరరెడ్డి గారు, తెలంగాణాలో ప్రాజెక్టులు కట్టే అవకాశం లేకపోవడం వల్లనే లిఫ్ట్ ఇరిగేషన్ కార్యక్రమాలను చేపట్టారు. ఎత్తిపోతల ద్వారా నీటిని ఇచ్చినప్పుడే వారికి అవకాశం కలుగుతుందని, దీనికి కరెంట్ ఎక్కువగా అయినప్పటికీ, అటువంటి ప్రాజెక్టులు కట్టడానికి రాజశేఖరరెడ్డి గారు సంకల్పించారు. రాష్ట్రంలో ఉచితంగా కరెంటు ఇస్తూనే ఇటువంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను తలపెట్టారంటే ఆయన తపనను, ఇరిగేషన్ పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న పూర్తిస్థాయి చిత్తశుద్ధిని మీరంతా గమనించాలని కోరుతున్నాను. ప్రాజెక్టుల విషయంలో అవినీతి గురించి మాట్లాడారు. ఈ అవినీతి ఆరోపణలు ఎప్పుడు వచ్చినప్పటికీ వాటిలో నిజంలేదని నిరూపించే నిమిత్తం ఈ కాంగ్రేస్ ప్రభుత్వం నిస్పక్షపాతంగా వ్యవహరిస్తోంది. ఎటువంటి విచారణా కమీషన్‌ని వేయడానికైనా సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాను. కాంగ్రేస్ ప్రభుత్వం కమీషన్‌ని వేయడంలో ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, ఆ ప్రభుత్వంపై ఆరోపణలు వస్తే విచరణా కమీషన్‌ని ఏర్పాటు చేయడానికి ఆయన ఎప్పుడూ ఒప్పుకోలేదు. ఈ ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో ఉన్న ప్రభుత్వం. కాబట్టే మీ ముందుకు సిద్ధంగా వస్తున్నది. ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోడానికి కూడా ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పోలవరం ప్రాజెక్టు ఎత్తు ఎక్కువ అవడంవల్ల చాలా లక్షల ఎకరాల అటవీ భూమి మునిగిపోతుందని, గిరిజన తండాలు మునిగిపోయే ప్రమాదం ఉందని కమ్యూనిస్ట్ సోదరులు అభ్యంతరాలు తెలియజేశారు. ఈ అభ్యంతరాల వల్లే కేంద్ర పర్యావరణ అనుమతి లభించక కొంత కాలం ఆగింది. ఈ రోజు మనం చెప్పిన నమూనాను చూసి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి లభించింది. తెలుగుదేశం పార్టీ గతంలో పోలవరం నిర్మాణాన్ని ఎన్నికల నినాదంగా మాత్రమే వాడుకొంది. ఎన్నికల సందర్భం కానప్పుడు ఎప్పుడైనా పోలవరాన్ని ఆచరణాత్మకంగా అమలు చేయడానికి కృషి చేసిందా అని అడుగుతున్నాను. అలా కృషి చేసి ఉంటే, ఈ పాటికే మెట్ట ప్రాంతమంతా సస్యశ్యామలమై ఉండేవని, కృష్ణా, గోదావరి అనుసంధానం జరిగేదని తెలియజేస్తున్నాను. ఈ ప్రభుత్వం నూటికి నూరుపాళ్లు వ్యవసాయానికి పూర్తిగా సహాయమందించడానికి కృషి చేస్తున్నదని తెలియజేస్తున్నాను. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా సాధారణ విద్యే కాదు, సాంకేతిక విద్య, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటివి ఒక రూపాయి ఖర్చు లేకుండా పూర్తి స్థాయిలో విద్యని అభ్యసింపజేయిస్తున్నామని గవర్నర్ గారి ప్రసంగంలో చెప్పారు. ట్యూషన్ ఫీజ్ రీఇంబర్స్‌మెంట్ చేస్తున్నాము. గతంలో నాలుగు విశ్వ విద్యాలయాలు మాత్రమే మన రాష్ట్రంలో ఉండేవి. వీటిలో బాగా మెరిట్ ఉన్న వాళ్లు మాత్రమే ఆనాడు చదువుకొనే వారు. కాని ఈనాటి ప్రభుత్వం ఈ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరికీ విశ్వ విద్యాలయంలో చదువుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నదని తెలియజేస్తున్నాను.

నిరుద్యోగుల కోరిక మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి వయోపరిమితిని పెంచి ఈ ప్రభుత్వం నిరుద్యోగుల కోరికను తీర్చిందని తెలియజేస్తున్నాను. నోషనల్ ఇంక్రిమెంట్‌ని టీచర్లకు ఇచ్చింది. అంగన్‌వాడి టీచర్లకు జీతాల పెంపు గురించి మనం మాట్లాడుకున్నాం. కమ్యూనిస్టు సోదరులు ఈ రోజు తెలుగుదేశం పార్టీ వారితో కలిసి 'మహా కూటమి'ని ఏర్పాటుచేసుకొన్నారు. వారు కలిసినందుకు నేను అభ్యంతరం చెప్పడం లేదు. ఏ విధమైన మార్పుని చూసి కమ్యూనిస్ట్ సోదరులు తెలుగుదేశం పార్టీతో కలిశారని అడుగుతున్నాను.

చంద్రబాబునాయుడుగారు వ్రాసిన 'మనసులోమాట' పుస్తకంలో సబ్సిడీలకు వ్యతిరేకమని నిర్ద్వందంగా ప్రకటించిన ఆయన విధానంలో ఏ మార్పుని చూసి మీరు కలిశారు? ఆనాడు మీకు చంద్రబాబు నాయుడు వ్యతిరేకమయ్యాడు, నేడు ఆయన మీకు ఎందుకు సన్నిహితమయ్యాడని అడుగుతున్నాను. మీ (కమ్యూనిస్ట్) విధానాలకు అనుగుణంగా పనిచేస్తున్న కాంగ్రేస్ పార్టీ ఇప్పుడు మీకు ఎందుకు వ్యతిరేకమయింది? ఆనాడు మీరు తెలుగుదేశాన్ని ఎందుకు వ్యతిరేకించారు? ఈ రోజు ఎందుకు వ్యతిరేకించడం లేదో మాకు మీరు చెప్పక్కరలేదు. కానీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది. నాగేశ్వరరావు గారు మీరే చెప్పారు, ప్రజా కూటమి బయట ఉందని, ఆ ప్రజా కూటమికి మీరు ఖచ్చితంగా జవాబు చెప్పుకోవాల్సిన రోజు వచ్చి తీరుతుందని తెలియజేస్తున్నాను. ఆ రోజు మీరు చేసింది కరెక్టు కాదని ప్రజలే చెపుతారని తెలియజేస్తున్నాను. ఈ రోజు తెలుగుదేశంలో సమూలంగా వచ్చిన మార్పేమిటో చెప్పాలని కోరుతున్నాను. ఆయన 'మనసులో మాట' అన్న పుస్తకంలో వ్రాసుకొన్నాడు, సబ్సిడీలకు వ్యతిరేకమని, ఉచిత విద్యుత్ ఇవ్వడానికి వ్యతిరేకం, ఇవన్నీ ఇవ్వడానికి వీల్లేదు, నేను చేసేది ఒక్కటే, ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు మాత్రమే నేను సంస్కరణ వాదిగా ముందుకు వెళతామని సిద్ధంగా ఉన్నాను తప్పితే ఈ సంక్షేమ విధానానికి నేను సిద్ధం కాదు' అని చెప్పిన చంద్రబాబునాయుడు గారిలో ఏ మార్పు చూసి మళ్లీ మీరు కలుస్తున్నారనే మాటను నేను చిన్నవాడిని అయినా ప్రశ్నించవచ్చని.... మిమ్మల్ని కాదు ప్రశ్నించేది. విధానాన్ని ప్రశ్నించే విషయంగా మిమ్మల్ని అడుగుతున్నాను. కాంగ్రేస్ ప్రభుత్వం సంక్షేమ రంగంపట్ల అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే మాట కమ్యూనిస్టుల మనస్సుల్లో ఉంటుందో లేదోగాని ఆ మనస్సుల్లో ఉన్న మాటను నిజం చేసే ప్రభుత్వం కాంగ్రేస్ ప్రభుత్వం మాత్రమే. ముమ్మాటికి మీరు మాతో కలిసి ఉండవచ్చు, లేక కలిసి ఉండలేకపోవచ్చు అది వేరే విషయం. కానీ, మీరనుకున్న విధానాలను ప్రజల మధ్యకు తీసుకు వెళ్లి... భూ సంస్కరణలు కానీ, భూమిని పంచిపెట్టడం కానీ, లేక సబ్సిడీల ద్వారా ప్రజలకు విద్యుత్‌ని ఇవ్వడం కానీ, ఇటువంటి విధానాలు చేసిన ఏకైక పార్టీ ఈ రాష్ట్రంలో కాంగ్రేస్ మాత్రమే అనేటటువంటి విషయాన్ని సవినయంగా మనవి చేస్తున్నాను. దయచేసి మీరు తీసుకొన్న నిర్ణయాన్ని మరోమారు పునరాలోచించండనే మాటను మీకు మనవి చేస్తూ, మీ అందరి దగ్గర సెలవు తీసుకొంటున్నాను. నమస్కారం.

MR. DEPUTY. CHAIRMAN: The House is adjourned to meet again at 10.00 A.M, tomorrow i.e., on 05.04.2009.

(The House then adjourned at 1.30 PM to meet again at 10.00 A.M., on Thursday the 5th of February, 2009)